
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

**సంపుటి 10 - సంచిక 5**
**సెప్టెంబర్ 2009**

**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

యుగశక్తి గాయత్రి మాసపత్రిక
అందనివారు 9652862601
నంబరుకు సంప్రదించగలరు.

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TUST
BUSINESS DIVISION,
HYDERABAD

సలహాలు, సూచనలకు
శ్రీ అశ్విని సుబ్బారావు
040-23700722

## ఆనందాల గని అంతరాత్మ

ఆనందం కావాలా? అయితే నేరుగా అంతరాంతరాలలో వెతుకు. బయటి ప్రపంచంలో ఎంత వెతికినా ప్రయోజనం లేదు. ఆనందం కావాలనుకుంటే ఒక్కసారి నీ మానసిక స్థితిని పరిశీలించుకో. దేనిని ఎక్కడ వెతకాలో అక్కడే వెతకాలి. అంతేకాని దొరికే చోటును వదిలిపెట్టి ఎక్కడెక్కడో వెతికితే ఏం లాభం? చిట్టచివరకు లభించేవి నిరాశా – నిస్పృహలే అని అర్థం చేసుకోవాలి.

ఒకానొక ముష్టివాడు ఒకేచోట కూర్చుని వచ్చిపోయే వారిని యాచిస్తూ ఉండేవాడు. అక్కడే చిన్న గుడిశ వేసుకున్నాడు. అతనికి ఒకే ఒక కోరిక బలంగా ఉండేది. తాను కూడా ఏదో ఒక నాడు పెద్ద ధనవంతుడై పోవాలి అని. వచ్చిన డబ్బును పూర్తిగా ఖర్చుపెట్టేవాడు కాదు. దాచిపెడుతూ ఉండేవాడు. అర్ధరాత్రి వరకు అడుక్కుంటూనే ఉండేవాడు. నిద్రవస్తే అక్కడే పడుకుని నిద్రపోయేవాడు. ఈ విధంగా అతడు జీవితమంతా అడుక్కుంటూనే ఉన్నాడు. అడుక్కుంటూనే ఒకనాడు నేలపై ఒరిగిపోయాడు. కాని ధనవంతుడు కావాలన్న కోరిక తీరకుండానే పోయాడు. ఇరుగు పొరుగు ముష్టివాళ్ళు వచ్చి ఆతని జేబులు తడిమి చూచారు. శవం మీద కప్పే గుడ్డ కొనడానికి కూడా సరిపడ డబ్బులు దొరకలేదు. చేసేది లేక ప్రక్కకు పడుకోబెట్టారు. మాసిపోయిన అతని పక్క గుడ్డల్లోనే చుట్టుకుని పోదామని గుడ్డలు తీశారు. ఆశ్చర్యం. మాసిపోయిన ఆ బట్టల క్రింద డబ్బు కుప్పలుగా పోసి ఉంది. అతని అజ్ఞానానికి అందరు సానుభూతి చూపకుండా ఉండలేకపోయారు.

అంతరాత్మను వదిలి ఆనందం కోసం అన్ని చోట్లా వెతికి వేసారిపోయే వాళ్ళ స్థితి ఇంతకన్నా వేరేమీ కాదు. అంతరాత్మలో దాగి ఉన్న ఆనందాల రాశిని చూచుకోకుండా బయట వెతుకుతూ ఉంటారు. జీవితమంతా వెతుకుతూనే ఉంటారు. ఎక్కడా లభించక నా జీవితం ఇంతే అనుకుంటూ నిట్టూరుస్తూ ఉంటారు. అలా కాకుండా కాస్త ముందుగా ఆలోచించుకుని ఆనందాల గనిని వెతికిపట్టుకోవాలి. శాంతి సమృద్ధులను కోరుకునేవారు ఆత్మశోధన చేసుకోవాలి. నిజమైన ఆనందం ఎక్కడ లభిస్తుందో అర్థం చేసుకోవాలి. అక్కడే వెతుక్కోవాలి. పెద్ద పెద్ద యోగులు, ఋషులు కూడ ముందుగా ఆనందం కోసం ప్రపంచమంతా తిరిగి తిరిగి వెతికినవారే. చిట్ట చివరకు వారందరు ఆనందాల గని అంతరాత్మే అని అర్థం చేసుకున్నారు.

★★★

**బాధలో ఉన్నవాడు కోరుకొనేది సానుభూతి వాక్యం.**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** ఆనందాల గని అంతరాత్మ 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** మానవ జీవన లక్ష్యం 2
3. **వేదమంత్రం :** వేద విద్యను, విద్వాంసులను గౌరవించాలి 3
4. **వర్తమానభారతం :** యుగపరివర్తన ప్రారంభం అయింది 4
5. **ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం** 7
   జపం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?-7
6. **పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది :** 8
   2400 కోట్ల మంత్రజపం
7. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-4** 9
   మానవుడు – జీవనం?
8. **సంస్కృతీ మూర్తి పరమపూజ్యగురుదేవులు :** 12
   సంస్కృతీ పురుషుని వారసత్వం-వీలునామా
9. **ధారావాహిక : హనుమత్కథామృతం-17** 13
   వేచిచూడక తప్పదు-అప్పుడే ఆత్మ ప్రకాశం
10. **పుస్తక ప్రదర్శన :** వ్యవస్థ ఇలా ఉండాలి 14
11. **ధారావాహిక : భక్తిగాథ-22 :** 19
   వ్రజగోపికల సంపూర్ణశరణాగతి
12. **సుకుమార శరీరం – విచిత్రమైన విద్యుత్కేంద్రం** 21
13. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-36** 23
   దివ్యజ్ఞానం-మనం నడచుకోవాల్సిన విధానం
14. **తత్వచింతన :** 26
   ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి
15. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-65** 27
   భవిత కోసం ప్రతీక్ష-2
16. **ప్రత్యేక వ్యాసం :** మహాతపస్వి పరమపూజ్య గురుదేవులు-
   మహామనస్విని వందనీయ మాతాజీ 29
17. **ధారావాహిక : దేవ సంస్కృతీ సౌరభం-27** 31
   భారతీయ సంస్కృతిలో గృహస్థయోగం
18. **పరమ పూజ్య గురుదేవుల అమృతవాణి :**
   నేటి ప్రజ్ఞావతారుడైన యుగ దేవత యొక్క అప్పీలు-1 32
19. **మహిళాజాగరణ :** పరమపూజ్యదేవీమూర్తి-మహిళ 34
20. **బోధకథ :** మృతునిపట్ల వ్యామోహం వ్యర్థం 35
21. **ఆధ్యాత్మిక విజ్ఞానం :** ఋషుల విజ్ఞానం ఇదే 36
22. **తెలుగు యోగులు :** రాధామహలక్ష్మి 38
23. **కుటుంబ నిర్మాణం :** సదాచారాలను సొంతం చేసుకోవాలి 40
24. **నా వారితో నా మాట :** శతజయంతి ఉత్సవాల రూపురేఖలు
   సామూహిక జపసాధన ఒక రూపుదిద్దుకుంది 43
25. **ఏ పుస్తకంలో ఏమున్నది?** 45
26. **వార్తలు** 46




# సద్గురు వచనామృతం

## మానవ జీవన లక్ష్యం

దైవత్వాన్ని పొందటానికి మొదటి మెట్టు మానవ జీవితమే. ప్రాపంచిక మాయా మోహాలలో చిక్కుకుని, మనిషి తన జీవిత లక్ష్యాన్ని మరచిపోతే అతను ఎల్లప్పుడూ ఏడుస్తూనే ఉండాలి.

మానవ జీవితం లక్ష్యాన్ని చేరటానికై మనం వందల కొలది కష్టాలను ఎదుర్కోవలసి రావడం ఖాయం. అయితే క్షణిక సుఖాలలో మునిగి, మన లక్ష్యం నుండి దృష్టిని మరల్చితే మనం ఎల్లకాలం పశ్చాత్తాపపడవలసి వస్తుంది. ఆ తరువాత ఈ పశ్చాత్తాపం వల్ల ప్రయోజనమేదీ ఉండదు. మనం మనలను గుర్తించి, ఆశయప్రాప్తికై నడుం బిగించడం మరింత ఉత్తమం.

ఈ ప్రపంచం ఒక రంగస్థలం. మనమందరం కూడా ఈ ప్రాపంచిక రంగస్థలంపై మన పాత్రలను నిర్వహించటానికి వచ్చాం. మనం మనకు అప్పగించబడిన కార్యాన్ని క్రమంగా నిభాయించలేకపోతే నాటక కర్త అయిన సూత్రాధారునికి మనమీద కోపం వస్తుంది. ఆ కోపం మరీ ఎక్కువయితే రంగస్థలంపై మన నేర్పు చూపించడానికి పంపించడు. నాటకమండలి సభ్యులు తమ యజమానికి భయపడి పనిచేస్తారు. అలాగే మనం కూడా పరబ్రహ్మ పరమాత్మకు భయపడుతూ అన్ని పనులూ చేయాలి. ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతివాడూ చావవలసిందేనని మనందరికీ తెలుసు. మరి కొద్దిపాటి జీవితకాలాన్ని మనం ఎందుకు దుఃఖ దాయకం చేసుకోవాలి?

*(అఖండజ్యోతి, ఆగస్టు 1951)*

అనువాదం-ఊటుకూరి సత్యనారాయణ గుప్త

★★★

## పండుగలు

**సెప్టెంబర్ 2009**

| | |
|---|---|
| 08-09-09 | మాతా భగవతీ దేవి శర్మ జయంతి |
| 16-09-09 | పండిత శ్రీరామ శర్మ ఆచార్య జయంతి |
| 28-06-09 | విజయదశమి |

**అక్టోబర్ 2009**

| | |
|---|---|
| 02-10-09 | గాంధీ జయంతి |
| | లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి |
| 04-10-09 | వాల్మీకి జయంతి |
| 17-10-09 | దీపావళి |
| 18-10-09 | గోవర్ధన పూజ |

**అందరినీ ప్రేమతో వీక్షించు.**

వేద మంత్రం

# వేద విద్యను-విద్వాంసులను గౌరవించాలి

బ్రహ్మ గవీ పచ్యమానా యావత్ సాభివిఙ్గం హే ।
తేజో రాష్ట్రస్య నిహన్తి నవీరో జాయతే వృషా ॥

**(అధర్వవేద 5/19/4)**

**భావార్థం :** బ్రహ్మవేత్తలు, వేదవిద్య నిరాదరించబడిన రాజ్యం నశిస్తుంది. అక్కడ తేజస్వులు, వీరులు ఎవ్వరూ ఉండరు.

**సందేశం :** ప్రపంచంలో అందరినీ సంస్కారవంతులుగా చేసే కార్యాన్ని స్వీకరించిన వారినే బ్రాహ్మణులని, ఋషులని అంటారు. కేవలం పూజాపాఠం లేదా కర్మకాండల కాలక్షేపం వలన సమాజానికి లాభమేమీ లేదు. అటువంటి బ్రాహ్మణులకు సొంత వ్యాపారం నడుస్తుంది. సుఖ సౌకర్యాలు, ధనం – సంపద ప్రోగుపడవచ్చు – దీని వలన వారికి ఏ విధమైన ఆధ్యాత్మిక లాభం కలుగదు. సమాజంలో సుఖ–సమృద్ధులు కలుగవు. గతంలో ఇరవైఅయిదేళ్ళు వచ్చేదాకా గురుకులంలో సాత్విక వాతావరణంలో విద్యార్జన చేసేవారు. దానితో జ్ఞానవంతులు, సదాచారులు, కర్తవ్యపరాయణులు అయిన నాగరికుల నిర్మాణం జరుగుతుండేది. దుర్యోధనుడు, రావణుడు వంటి వారు దీనికి విరుద్ధం.

విద్యాసంస్కారాలే కాదు, ఋషులు సమయానుకూలంగా రాజ్యనీతిని నిర్ధారణ చేసేవారు. అదృష్టం గురించి మాట్లాడకుండా సమయాన్ని బట్టి పనులు చేసేవారు. సమస్యలను అంచనావేసి దానిని పరిష్కరించడం వారికి ముఖ్యమైన పని. వారి అనుమతి లేకుండా రాజ్యంలో ఆకు కూడా అల్లాడేది కాదు. చాణక్యుడు నలందా విశ్వవిద్యాలయ కులపతిగా ఉండేవాడు. విశ్వమంతటి నుండి విద్యార్థులు అధ్యయనం కోసం వస్తూ ఉండేవారు. ఇదేకాక చాణక్యుడు చంద్రగుప్తుని మంత్రిగా ఉండేవాడు. రాజ్యం, గురుకులం నడిపేవాడు. వశిష్ఠుడు రఘువంశీయులకు కులగురువుగా ఉండేవాడు. రాజు అన్ని పనులు గురువు ఆజ్ఞతో చేస్తూ ఉండేవాడు. ధర్మతంత్రమెప్పుడూ రాజ్యతంత్రాన్ని నిర్దేశిస్తూ ఉండేది. ధర్మం యొక్క అంకుశం వలన రాజ్యతంత్రం నిరంకుశంగా ఆచరించలేకపోయేది. సమాజంలో అరాచకత్వం, భ్రష్టత చొరబడటానికి సాహసం చేయలేకపోయేవి. ధర్మం యొక్క వాస్తవిక అర్థం కర్తవ్యపాలన. రాజ్యశక్తి యొక్క వ్రేళ్ళు ధర్మమనే సారవంతమైన భూమిలో లోతుగా పాతుకుపోతే, దానికి యశస్సు, కీర్తి అనే సుగంధిత పుష్పాలే వికసిస్తాయి.

నేడు రాజ్యాల విద్యాపద్ధతి ఎలా ఉన్నదంటే, ప్రజల నైతిక ఆధ్యాత్మిక ఉన్నతి సంభవమే కాదు. వైదిక సాహిత్యం, సద్గ్రంథాల పఠనం ప్రోత్సాహించబడటం లేదు. నైతిక శిక్షణ దాదాపుగా స్కూళ్ళలో నిలిపివేశారు. మొదట్లో నిత్యకర్మల వలెనే ప్రతిరోజూ నియమిత రూపంలో వేదాధ్యయన పరంపర ఉండేది. ఒకటి రెండు మంత్రాలు లేదా శ్లోకాలు స్వాధ్యాయం. వాటి వ్యాఖ్యపైన చింతన, మననం, సత్సంగం, గోష్ఠి మొదలైన క్రమం ఉండేది. ఈవిధంగా జ్ఞానవంతులు, శీలవంతులకు రాజాశ్రయం, ప్రతిష్ఠ లభిస్తూ ఉండేవి. దీనితో యోగ్యులు, దేశభక్తులు, ఉత్తమ శీలవంతులైన నాగరికుల పెంపు కలిగేది, దుర్గుణాలు కలవారు దురాచారులు, దుర్వ్యసనపరులైనవారు దండింపబడేవారు. రాజ్యానికి యశస్సు, కీర్తి పెంపొందేవి.

జ్ఞానవంతులు, శీలవంతులు, నిష్ఠావంతులకు తగిన ప్రోత్సాహం, సంరక్షణ, గౌరవం ప్రాప్తిస్తే బ్రాహ్మణత్వానికి సార్థకత. వేదవిద్యకు, విద్వాంసులకు నిరాదరణ కలుగకుండా చూడటం మనందరి పవిత్ర కర్తవ్యం .

★★★

ప్రతివారితో మధురంగా భాషించు.

వర్తమాన భారతం

# యుగపరివర్తన ప్రారంభంఅయింది

## (గడచిన 20 సంవత్సరాలే సాక్షి)

### మారిన సమాజంతో ప్రపంచం

ప్రపంచం మహావేగంగా మారిపోతోందిఅనడానికి గడచిన 20 సంవత్సరాలే సాక్షి. పరమపూజ్యగురుదేవులు 1989లో – "ప్రపంచంలో అనేకమైన మార్పులు రైలుపెట్టెల్లాగా ఒకదానివెంట ఒకటి మహా వేగంగాపరుగెత్తుకుంటూ వస్తున్నాయి. నేనే మార్చుకుంటూ వస్తున్నాను. నూతన యుగాన్ని మీ ముందు నిలబెట్టే ప్రయత్నంచేస్తున్నాను" అని వ్రాశారు.

### జరిగేది జరగక మానదు

భవిష్యత్తును గూర్చిన అవగాహన మహామానవులకే ఉంటుంది. కాని సామాన్య మానవులు మాత్రం "అసంభవం",'ఎట్లాసాధ్యం' అంటూ ఉంటారు. ప్రపంచం యొక్క స్థితిగతులు మారితీరుతాయి. కొన్ని శతాబ్దాలలో జరగాల్సిన పని కొన్ని నెలలలో పూర్తి అవుతుంది. ఈ విధమైన మార్పువల్ల ప్రపంచ ప్రజల జీవన శైలిచాలా మారిపోయింది. ఈ రోజుల్లో అతీంద్రియ శక్తులు, పవిత్ర భావనా శక్తులు వృద్ధి చెందుతాయి. మానవులు చెప్పే అనేక విషయాలు భవిష్యత్తును తెలియచేస్తున్నాయి. వాటిని మనం మననం చేసుకొవాల్సి ఉంటుంది కాలగర్భంలో ఏమేమి దాగి ఉన్నాయోవారికి తెలుసు. పరమ పూజ్యగురుదేవులు యుగఋషి. వారుకేవలం రాబోయేమార్పును గురించి తెలియచేయడానికే అవతరించలేదు. ఆ మార్పుకు మూలకారకులు వారే. అందుకుగాను తనను తాను అర్పించుకోవడానికే అవతరించారు. మనందరిచేత చేయించడం కూడ వారి కర్తవ్యం. అందువల్లనే సూక్ష్మరూపంలో వెన్నంటి ఉండి మనలను నడిపిస్తున్నారు.

### యుగసంధికి రెండు నియమాలు

1988 అఖండ జ్యోతి పత్రికకు స్వర్ణజయంతి. స్వర్ణజయంతికి సంబంధించిన సమాచారం మనముందు ఉన్నది. 1988 నవంబరులో 12 సంవత్సరాల"యుగసంధి మహా పురశ్చరణ" ను గురుదేవులు ప్రకటించారు. వారు వ్రాసిన ప్రకారం యుగ సంధిని గురించి రెండు విషయాలు చెప్పుకోవచ్చు. (1) ప్రపంచం అంతటా ప్రకృతి ప్రళయాలు వచ్చే అవకాశాలు చాలా ఉన్నాయి. (2) కాని ఆ విధంగా జరగదు దూర దృష్టి గల సూక్ష్మశక్తులు అదృశ్యరూపంలో రక్షణ కల్పిస్తూ ఉంటాయి "సృష్టికి తనదైన శక్తి ఉంటుంది. సత్యయుగంలో ఈ విధంగానే ప్రభావశీలమైన ఋతువులు వస్తాయి. అవి భూమి మీద ముఖమల్ తివాచీలు పరచివెళ్ళిపోతాయి. భూమిని సస్యశ్యామలం చేస్తాయి. భూమిమీద స్వర్గవాతావరణం ఏర్పడుతుంది. అని వారు తనలేఖల ద్వారా తెలియ చేశారు. ఇప్పుడు ఉబికి వస్తున్న యుగ ప్రభావం ఇప్పటి వరకు గందరగోళాలు సృష్టిస్తున్న ప్రతిభావంతులను కూడా తనతోపాటు తీసుకువెళ్తుంది.

### 1989 ప్రత్యేకత

1989లో ప్రపంచం అంతటా అనేక విధాలైన మార్పులు వచ్చాయి. అందువల్లనే దానిని విశేష సంవత్సరం అనడం జరిగింది. ఆ సంవత్సరంలో జరిగిన సంఘటనల ప్రభావం ఇప్పటికీ ప్రపంచం మీద కనిపిస్తూనే ఉంది. ఆ సంఘటనలే 21వ శతాబ్దిని స్థిరపరచాయి. ఆ సంఘటనల ప్రభావం వల్లనే ప్రపంచం అంతటా ఆర్థిక సమస్యలు, ఆర్థికమాంద్యందాడి చేస్తున్నాయి. ఇట్లాంటివే మరి కొన్ని సృష్టికర్త యొక్క గుప్పిట్లో బిగిసిపోయి ఉన్నాయి."ఇది సంధికాలం. 2010,011,012 సంవత్సరాలు మనకోసం కొన్ని సమస్యలను వెంటబెట్టుకుని వస్తున్నాయి. ఈ కాలంలోనే విశ్వమంతా నూతన మార్పులు చెందబోతూఉంది. దీనిని తెలుసుకోవడానికి ముదుగా మనం 20 సంవత్సరాలు వెనక్కు వెళ్ళాల్సి ఉంటుంది. 20 సంవత్సరాలలో ఏమేమి జరిగాయో, ఎవరు ఈ ప్రవాహాన్ని పూర్తిగా త్రిప్పి వేశారో తెలుసుకోవాలంటే జూన్ 29, జూలై 6 తేదీలనాటి సమ్మర్ స్పెషల్ "టైమ్" పత్రికను చదవాల్సి ఉంటుంది. 'యుగ పరివర్తన జరిగితీరుతుంది' అన్నమాటను నమ్మాలంటే 1989 ప్రత్యేకతను తప్పనిసరిగా తెలుసుకోవాలి. "యుగసంధి మహా పురశ్చరణ" 12 సంవత్సరాల ప్రణాళికకు 1889 మొదటి

బాధలో ఉన్నవారిని మెల్లగా ఓదార్చు - చల్లగా సేవించు.

సంవత్సరం. పరమపూజ్య గురుదేవుల మహా ప్రయాగానికి ముందు సంవత్సరం.

## 1989లో జరిగిన ఘటనలు

1) బెర్లిన్‌లో కట్టబడిన అడ్డుగోడ కూలగొట్టబడింది.

2) రష్యాలో నూతన కాంతులతో ఉదారవాదం వచ్చింది. 'రీగన్',గోర్బచేవు' ల కృషి ఫలితం అనే చెప్పాలి.

3) మార్పుకు సూచనగా వరల్డ్ వైడ్ వెబ్ (www) ప్రారంభించబడింది.

4) చైనాలో "చివానామన చౌక్" దగ్గర (చౌక్=నాలుగు వీధుల కూడలి) జరిగిన మారణకాండ. వేలాది మంది ప్రదర్శకులు మరణించారు.

5) దక్షిణాఫ్రికాలో నెల్సన్‌మండేలా రాష్ట్రపతి డేక్లర్క్‌తో కలయిక.

6) పెషావర్ లో ఉగ్రవాదానికి అంకురార్పణ.

7) వియత్నాం యొక్క సైనిక చర్యతో కంబోడియా విముక్తి

8) దలైలామాకు నోబుల్ బహుమతి ప్రదానం.

9) ఇంగ్లాండ్‌లోని షెఫీల్డ్ యొక్క' హిల్సబారో స్టేడియం' లో కొట్లాట. అనేక మంది ప్రేక్షకుల మృతి.

10) కృత్రిమ సూర్యుని సృష్టించాలన్నవిఫల ప్రయత్నం- (సాల్ట్ లేక్ సిటీ యు.ఎస్.ఎ.)

11) రష్దీపైన జారీ చేయబడిన తీర్పు.

12) అలాస్కోలో నూనె కారిపోవడంతో సముద్రం కలుషితం అయింది.

13) గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం యొక్క (జి.పి.యస్.) ఆవిష్కరణ జరిగింది

14) జపాన్‌లో భ్రష్టాచారం బహిరంగంగా ప్రబలిపోయింది. ఆర్థిక పతనం జరిగింది.

పైన తెలిపిన విషయాలన్నీ పాఠకులకు ఆసక్తికరంగా లేకపోవచ్చు. కాని ప్రపంచమంతా వీటి ప్రభావం పడింది. ఈ రోజు మనమంతా ఉగ్రవాదం నీడలో భయం భయంగా జీవిస్తున్నాం. ప్రపంచం నాలుగుమూలలనుండి స్వతంత్రాన్ని కోరుతున్న స్వరమే వినిపిస్తోంది. సాంస్కృతిక విప్లవాలు జరుగుతూనే ఉన్నాయి. వీటన్నింటికీ మూలకారణం1989 నాటి సంఘటనలే అని గట్టిగా చెప్పవచ్చు. ఈ సంఘటనల ద్వారా చరిత్ర మనకు ముందుకు ఎలా నడవాలో పాఠం నేర్పించింది. అందువల్ల కొన్నింటినిగూర్చి వివరంగా తెలుసుకుందాం.

(1) బెర్లిన్‌లో అడ్డు గోడ కూలిపోవడంతోనే సోవియట్ సంఘం పూర్తిగా విచ్ఛిన్నం అయింది. తూర్పుయూరప్ దేశాలలో మార్పువచ్చింది. జర్మనీలు రెండూ ఏకం అయ్యాయి. ఒక మహా శక్తిగా అవతరించింది. రీగన్ – గోర్బచేవుల నిర్ణయంతో రెండు ప్రపంచయుద్ధాల తర్వాత యూరప్ దేశాలలో శాంతిని గూర్చిన ఆలోచన వచ్చింది. ఫలితంగా యుద్ధ మేఘాలు విచ్చిపోయాయి. చరిత్రలో ఇది మరువలేని ఘటన. దీనివల్ల కోల్డువార్ నశించింది. 'ఇనుపతెర' గా పేరుపడ్డ రష్యా నూతన మార్గాన్నిఅనుసరించింది. దీని కోసం 1989 నుండి 2002-03 వరకు ఎదురుచూడాల్సివచ్చింది. యూరప్‌లోని అన్నిదేశాలు స్వతంత్రం అయ్యాయి. బలవంతంగా ఒక సంఘంగా ఏర్పడటం జరిగింది. ఇంత గొప్ప మార్పు ప్రపంచంలో ఎన్నడూ జరగలేదు. జర్మనీలు రెండూ ఏకంకావడం, యుద్ధఖైదీల పైన యూదులపైన భయంకరమైన అత్యాచారాలు అంతం కావడం, ఒక శక్తివంతమైన దేశంగా నిలబడగలగడం ఎవ్వరూ ఊహించని మార్పు.

**(2) సూచనా క్రాంతి:** ఈనాడు ఇంటర్నెట్ మానవ జీవితాన్ని ఎంతగామార్చి వేసిందో మనందరికీ తెలుసు. http (హైపర్ టెక్స్ట్ ట్రాన్స్‌పర్ ప్రోటోకాల్) ఆవిర్భవించింది, కంప్యూటర్ భాషను 'టిమ్‌బర్నర్స్‌లీ' ద్వారా ఆవిష్కరించబడింది. దానితో పాటే www పేరుతో క్రొత్త బ్రౌజర్ అవతరించింది. దానిని ఈనాడు పిల్లల నుండి పెద్దలదాకా అందరూ వాడుకుంటున్నారు. 'ఈ మెయిల్' ప్రపంచాన్నే మార్చివేసింది. ఇంకా వరల్డ్ వైడ్ వెబ్ (www) కన్సార్టియం యం.ఐ.టి. మోసాచూసెట్స్ అమెరికాలో ప్రముఖమైనది.

వారు ఇప్పుడు క్రొత్తరకం నెట్‌ను తయారుచేస్తున్నారు. దాని ద్వారా ప్రపంచాన్ని గుప్పిట్లోకి తీసుకురావచ్చు. ఇటువంటిదే ఒక మార్పు 'జి.పి.యస్.' తో ప్రారంభం అయింది. 14-2-1989 లో ఒక శాటిలైట్ సిస్టమ్ ను తయారుచేసింది. దానిద్వారా మనం భూమిపై ఉన్న స్థితిగతులను అర్థం చేసుకోగలుగుతాం.

**(3) చివానామన్ చౌక్:** బీజింగ్‌లో 4-6-1989 నాడు చైనా సైన్యం చేతిలో అధిక సంఖ్యలో యువత హతమార్చబడింది.

**బాహ్యంగా నిగ్రహించుకోవడం నాగరికత.**

లక్షల సంఖ్యలో చైనీయులు ఇతర దేశాలకు వలసపోయారు. ఈ కళంకాన్ని పోగొట్టుకోవడానికి చైనాపాలకులు చాలా ప్రయత్నించారు. కాని ఇదే సంవత్సరం ముస్లింలు అధికంగా ఉన్న జినాజియాంగ్‌లో జరిగిన దమనకాండ ఈ కళంకాన్ని మరింత బలపరచింది. దీని ప్రభావం ప్రపంచ ప్రజలందరిమీద పడింది.

**(4) 1992 – 93 లో:** శాంతికుంజ్ ప్రతినిధి దక్షిణాఫ్రికాలో పర్యటించడం జరిగింది. నెల్సన్ మండేలా 23 సంవత్సరాలు ఏకాంత జైలుశిక్ష, అక్కడ ఆయన అనుభవించిన ఘోరమైన ఘట్టాలు, అక్కడ విలయతాండవం చేసిన వర్ణవివక్ష, అత్యాచారాలు, దక్షిణాఫ్రికా స్వతంత్రం కావడం మొదలైనవన్నీ అక్కడ నివసిస్తున్న భారతీయులనోటి వెంట వినడం జరిగింది. నెల్సన్ మండేలా ఆనాటి రాష్ట్రపతి డేక్లర్క్‌తో కలసి జరిపిన చర్చల ద్వారానే దక్షిణాఫ్రికా స్వతంత్రం అయింది. అదీ 1989లో జరగడం విశేషం.

(5) ఇంగ్లాండ్‌లో ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిన దుర్ఘటనలో అనేక మంది క్రీడాకారులు మరణించారు. ఆ సంఘటన 21వ శతాబ్దిలోని ఆటకు నూతనరూపాన్ని ఇచ్చింది. కృత్రిమ సూర్యుని సృష్టించాలన్న విఫలప్రయత్నం కాస్మాలజి క్షేత్రంలో క్రొత్త సంభావనల ద్వారం తెరచింది. పెషావర్ లో అరబ్‌నేత అబ్దుల్లా అజ్జామ్‌హత్యజరిగింది. సల్మాన్ రష్దీ మీద తీర్పు విడుదల అయింది. ఫలితంగా ఉగ్రవాదం జన్మించింది. ఇదేమీ మతకల్లోలం కాదు. మహాశక్తి వంతులైన పాలకులు చేసిన తప్పిదాల ఫలితమే ఉగ్రవాదం. కాని ఇప్పుడు అందరం అనుభవించాల్సి వస్తోంది.

(6) అలాస్కాలో "ఎక్సాన్‌వాల్జేజ్" అనే ఓడ నుండి లక్షల టన్నులనూనె కారిపోయింది. దాని ఫలితంగా సముద్రం కలుషితం అయిపోయింది. అంతేకాదు అమెరికా తన పద్ధతులను మార్చుకోవాల్సి వచ్చింది. ఇదికూడా 1989 లో జరిగిందే.

(7) 1989 డిశంబర్ జపాన్‌లో జరిగిన ఆర్థిక విస్ఫోటన షేర్ బజార్‌ని క్రింద పడవేసింది. దీని ప్రభావం ప్రపంచమంతా పడింది.

1989 విప్లవాత్మక సంవత్సరం ఆ సంవత్సరంలో జరిగిన కొన్ని సంఘటనలకు వివరణను చెప్పుకున్నాం. మిగిలినవి అప్రస్తుతం అనిపిస్తోంది. 21 వ శతాబ్దంలో విశ్వవ్యాప్తంగా జరిగే నూతన విషయాలకు మంచి–చెడులకు అన్నింటికీ మూల కారణం1989 సంవత్సరమే అని చెప్పవచ్చు. ఈ సంఘటనలు అన్నింటిలోను దైవీ ప్రేరణ ఉంది. ప్రజల యొక్క ప్రతిభా పాటవాలు ఉన్నాయి. పరివర్తన అనేది 20 సంవత్సరాల నుండి అనుభవానికి వస్తూనే ఉంది. రాబోయే 3 సంవత్సరాలలో మరింత వేగంగా అర్థం అవుతుంది. మార్పు అనేది మహావేగంతో వచ్చి మనవాకిలి ముందరే నిలబడి ఉన్నట్లుగా అనిపిస్తోంది.

*(అఖండజ్యోతి – సెప్టెంబర్ 2009)*

★★★

## సర్వశక్తులూ సద్వినియోగం కొరకే

*శృతాయుధుని వద్ద శంకరుని వరంతో లభించిన అమోఘమైన గద ఉన్నది. అతని తపస్సుకు మెచ్చి శంకర భగవానుడు ఒక షరతుమీద ఈ గదను ఇచ్చాడు. ఆ షరతు – 'ఈ గదను అవినీతికి ప్రయోగిస్తే, అది తిరిగివచ్చి నిన్నే నాశనం చేస్తుంది'.*

*మహాభారత యుద్ధంలో శృతాయుధుడు అర్జునునితో యుద్ధం చేయవలసి వచ్చింది. యుద్ధం జోరుగా సాగుతోంది. ఇద్దరూ తమ రణ నైపుణ్యాన్ని చూపుతున్నారు.*

*సారథి స్థానంలో ఉన్న శ్రీకృష్ణునికి శృతాయుధుని వికృతరూపం చూసినప్పుడు నవ్వు వచ్చింది. ఆ నవ్వు అతనికి బాణంలా గుచ్చుకుంది. అమోఘమైన ఆ గదను ఆవేశంతో శ్రీకృష్ణుని మీదకు విసిరివేశాడు. శివుడు పెట్టిన షరతును మరచిపోయాడు.*

*గద శ్రీకృష్ణుని దాకా వెళ్ళలేదు. మధ్యలోనే వెనుకకు తిరిగి శృతాయుధుని మీదే పడింది. అతని శరీరం ఖండ ఖండాలు అయి భూమిమీద పడింది.*

*ధృతరాష్ట్రునికి ఈ సమాచారాన్ని వినిపిస్తూ సంజయుడు –'రాజా! మనిషికి సమస్త శక్తులూ – శృతాయుధుని గదవలె – సద్వినియోగం చేసుకోవడానికే లభించాయి. కాని వాటిని వారు అవినీతితో వినియోగించి తామే గాయాలపాలై ఇలాగే వినాశనాన్ని కొనితెచ్చుకుంటున్నారు.'*

★★★

**స్వర్గాన్ని నరకంగా చేసేది - నరకాన్ని స్వర్గంగా చేసేది మనస్సే - మిల్టన్.**

### ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం

# జపం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?-7

'సోహం' ఉపాసనకు చేసే ప్రాణాయామంలో ద్వైతాన్ని అర్థం చేసుకుంటూ, నిద్రావస్థలో ఉన్నదానిని జాగృతం చేసే ప్రయత్నం జరుగుతుంది. జీవి తాను శరీరమే అని నమ్ముతున్నాడు. అందుకే శరీరాన్ని సుఖపెట్టే పనులనే చేస్తూ ఉంటాడు. శరీరంతోపాటు కలసి ఉన్న వ్యక్తులు, వస్తువులు తనవే అనుకుంటాడు. అందువల్ల తన మమకారాన్ని, బాధ్యతను అంతవరకే పరిమితం చేసుకుంటాడు. తనవారికి లాభం చేయడం కోసం ఇతరులకు హాని కలిగించడానికి ఏ మాత్రం సంకోచించడు. ఈ మాయలో పడి భవబంధాలతో బంధించపడతాడు. అందువల్ల స్వార్థం పెరిగిపోతుంది. స్వార్థ ప్రయోజనాల కొరకు అనర్థాన్ని కలిగించే పనులు చేస్తూ ఉంటాడు. ఈ స్థితి వల్ల ప్రాణులు శోక సంతాపాలలో చిక్కుకుంటారు. దాని నుండి రక్షించి బయటపడ వేయడానికే సాధనా విజ్ఞానం, ఆత్మవిజ్ఞానం యొక్క చక్రం నిర్మించబడింది.

'సోహమ్'ను సత్‌జ్ఞానం, తత్వజ్ఞానం, బ్రహ్మజ్ఞానం అనిచెపుతారు. దీనివల్ల ఆత్మకు తన అసలు స్వరూపాన్ని తెలుసుకోవడానికి అవసరమైన సంకేతం లభిస్తుంది. "ఆ పరమాత్మ నేనే'' ఈ తత్వ జ్ఞానంతో మాయనుండి బయటపడవచ్చు. నరకీటకాలు, నరపశువులు, నరపిశాచాలవంటి నికృష్టుల అహంకారం విషయంలో 'సోహం' శబ్దం పనికిరాదు. రావణుడు, కంసుడు, హిరణ్యకశిపుడు మొదలైన ప్రజాపీడకులు అహంకారంతో తామే భగవంతులమని చాటుకున్నారు. తమనే పూజించాలని ప్రజలను బాధించేవారు. కాని చివరకు వారి అహంకారమే వారిని ముంచివేసింది. 'సోహమ్' సాధనలో పంచతత్వాలు, మూడు గుణాలతో నిర్మించబడి ఉన్న శరీరాన్ని 'భగవంతుడు' అని చెప్పలేదు. 'ఆ పరమాత్మయేనేను' అన్న మాటకు విపరీతంగా అర్థం చెప్పుకుని, అహంకారాన్ని పెంచుకుంటూ, ఉన్నతికి బదులుగా పతనావస్థకు చేరుకుంటున్నారు. ఈ దివ్య సంకేతం ఆత్మయొక్క శుద్ధ స్వరూపాన్ని తెలియచేస్తున్నది. ఆత్మ నిజానికి భగవంతుని యొక్క అంశ. సముద్రం-అలలు, సూర్యుడు-కిరణాలు, మేఘాలు -ఆకాశం, బ్రహ్మాండం-పిండాండం, మంట-నిప్పురవ్వలు మొదలైన వాటిని ఉపమానాలుగా చూపిస్తూ విద్వాంసులు ఆత్మ-పరమాత్మల ఏకత్వాన్ని నిరూపించారు. మల మూత్రాల చేత ఆవరింపబడి, పాపపంకిలమైన శరీరం నుండి విడివడిన జీవి నిజంగా బ్రహ్మయే. జీవాత్మ-పరమాత్మల ఏకత్వాన్ని తెలుసుకోలేకపోవడానికి అడ్డు తెరగా నిలిచింది అజ్ఞానమే. ఈ అజ్ఞానమే అహంకార రూపంలో వికసించి స్వార్థకూపంలోనికి పడవేస్తుంది. జీవి అహంకారంవల్ల తన దుర్గతిని తానే తెచ్చుకుంటాడు. సాధన యొక్క ఉద్దేశ్యం మనస్సులో పేరుకుని పోయిన సోమరితనాన్ని తొలగించి వేయడమే. అంతేకాక నిర్మలత్వాన్ని పెంపొందించి, భగవంతుని పొందే దిశలో పయనించడంగా చెప్పబడింది. "సోహమ్" సాధన యొక్క ప్రతిఫలం భగవంతుని చేరుకొనుటయే.

భగవంతుని అంశ అయిన జీవికి నాశము లేదు. ఈ విషయం ధర్మశాస్త్రాలలో అనేక చోట్ల వ్రాయబడి ఉంది. ధర్మాన్ని ఉపదేశించేవారు కూడా ఇదే చెపుతున్నారు. ఈ విషయం సాధారణ బుద్ధికి అర్థం అయినట్లే ఉంటుంది. కాని అదిసరిపోదు. ఈ నమ్మకం అంతఃకరణం యొక్క అట్టడుగు స్థానానికి చేరుకోవాలి. గాఢమైన నమ్మకమే శ్రద్ధగా మారుతుంది. ఆ శ్రద్ధయే అంతఃప్రేరణగా తయారవుతుంది. ఆ ప్రేరణయే మస్తిష్కాన్ని ఒత్తిడి చేస్తుంది. అప్పుడు మస్తిష్కం, శరీరంలోని సేవకులు పనిలో నిమగ్నం కావాల్సివస్తుంది. "సోహమ్" తత్వజ్ఞానం అంతరాత్మలోని శ్రద్ధగా వృద్ధి చెందగలిగితే ఖచ్చితంగా దివ్య జీవనం నవ యవ్వనంతో మనముందుకు వస్తుంది. అప్పుడే మానవుడు దేవత అవుతాడు. ఇద్దరి మధ్య ఏకత్వ స్థితి వస్తుంది. బ్రహ్మ భావంతో జాగృతమైన జీవి తన ఆలోచనను కర్మక్షేత్రంలో వికసింపచేసి దేవ మానవుడు ఔతాడు.

జపంలో ఏవో కొన్ని విశేష శబ్దాలను పలికినంత మాత్రాన సరిపోదు. దానిలో వాక్‌శక్తి, ఆలోచన, జీవం, భావనాశక్తులను కూడా ప్రయోగించాల్సి ఉంటుంది. ఈవిధంగా చేయబడినజపమే సరిఅయిన జపం అనిపించుకుంటుంది. ఉపాసనలో మొదటి చరణం అయిన ఈ జపాన్ని తనదిగా చేసుకోగలిగితే తగిన ఫలితాన్ని పొందవచ్చు.

అనువాదం - ఊటుకూరి సత్యనారాయణ గుప్త

★★★

**మనస్సును నిగ్రహించుకోవడం సంస్కృతి.**

# పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది-2400 కోట్ల మంత్రజపం

కారణజన్ములైన పరమపూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రజపం ద్వారానే విజయాలు సాధించారు. వారి జన్మ శతాబ్దినాటికి మనం అంటే దక్షిణ భారత విభాగం 2400ల కోట్ల గాయత్రీ మంత్రజపాన్ని సామూహికంగా నిర్వహించి గురుదక్షిణగా సమర్పించాలన్న నిర్ణయం జరిగింది. ఇప్పటికే అనేకచోట్ల ప్రారంభింపబడింది. పరిజనులందరు రోజుకు మూడు మాలలు మంత్ర జపం చేయాలి. మీమీ బంధుమిత్రులను ప్రభావితం చేసి వారిచేత జపం చేయించాలి. ఏ రోజైనా ఏ కారణంగానైనా చేయలేకపోయినట్లైతే మరియొకరోజు పూర్తి చేసుకోవచ్చు. సగటున రోజుకు మూడు మాలలు వచ్చేలా చూసుకోవాలి. మూడు మాలలకన్నా ఎక్కువ చేయగలిగితే మరీమంచిది. మూడుమాలలు చేయలేనివారు కనీసం ఒక్క మాలైనా చెయ్యాలి.

**ముఖ్యగమనిక :** ప్రముఖ కార్యకర్తలు, పరిజనులు తమతమ ప్రదేశాలలోని పాఠశాలలకు పర్యటించి విద్యార్థుల చేత కనీసం 10-15 నిమిషాలు మంత్రజపం చేయించాలి. ఇప్పటికే చీరాలలోని ఒక పాఠశాలలో చేయించుచున్నారు. "విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరిగింది. ఏకాగ్రత కుదిరింది. బుద్ధివికసించింది. ప్రవర్తన మారింది" అని తెలియచేశారు. కనుక మన ప్రయత్నం ఆ వైపుగా సాగాలి. లెక్కింపు సౌకర్యార్థం క్రింద ఒక పట్టిక ఇవ్వబడింది. దానిలో 31 గడులు ఉన్నాయి. ప్రతిరోజు ఆ రోజు చేసిన మాలల సంఖ్యను ఒక్కొక్క గడిలో వెయ్యాలి. చేయనిరోజు డాష్ పెట్టాలి. నెలపూర్తికాగానే క్రింది ప్రొఫార్మాను నింపి క్రింది చిరునామాకు పంపాలి. ఈ పేజిని చింపుకొని నింపవచ్చు. లేకపోతే స్వయంగా తయారుచేసుకోవచ్చు.

*శ్రీ కె.పి.విఠల్, 48 LIG-II,బి.కె.గూడా,*
*సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500 038*
*ఫోన్ : 040-23705749, సెల్ : 9989655310*

ఇట్లు
మీ
అశ్విని సుబ్బారావు
*(విశ్వగాయత్రీ పరివార్-దక్షిణ భారత సంయోజకులు)*

**2400ల కోట్ల సామూహిక గాయత్రీ మంత్రజపము**

తేదీ ........................ నుంచి .................. వరకు

నెం :  పూర్తి జప మాలల సంఖ్య : [ ]

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | ప్రతిరోజు మీరు మంత్రజప మాలల సంఖ్యను పైన ఇచ్చిన గడులలో రాయండి | | | | |

పేరు : ..............................................................

గోత్రము : ..........................................................

చిరునామా : ......................................................

.......................................................................

.......................................................................

పుట్టిన రోజు మరియు వివాహదినము : ........................

.......................................................................

ఫోన్ : ..............................................................

*యుగశక్తి గాయత్రి మాసపత్రికకు క్రొత్త చందాదారులను చేర్పించండి.*

**సజ్జనుడి సంపద మేఘాలలోని నీరులాగా దానం చెయ్యడానికే.**

ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-4

# మానవుడు - జీవనం?

మనిషి ఏమిటి? ఈ ప్రశ్నకు విజ్ఞాన శాస్త్రం వద్ద అతి సాధారణ సమాధానం ఉంది. దానిని నిజమైనదిగా గుర్తిస్తే మానవీయ శక్తి అత్యంత తుచ్ఛమైనదిగా, హాస్యాస్పదమైనదిగా తయారవుతుంది. రసాయన శాస్త్రవేత్తల దృష్టిలో మానవశరీరం అనేక రసాయనాల సమ్మేళనం. ఈ కలయిక దాదాపు పదిహేను తత్వాలతో తయారైంది. అవి ప్రతిరోజూ ఖర్చవుతూ ఉంటాయి. మరల క్రొత్తవాటి ద్వారా లభిస్తాయి. ఈ విధంగా రాకడ పోకడ సమతుల్యంగా ఉంటుంది.

కెమిస్ట్రీ ఆఫ్ మెటీరియల్స్ ప్రకారం శరీరాన్ని వంద యూనిట్లుగా గుర్తించి వాటిలో తత్వాల శాతం ఈ విధంగా చెప్పబడింది. (1) ఆక్సిజన్ 65% జలం ద్వారా లభిస్తుంది. (2) హైడ్రోజన్ 10% నీటి ద్వారా లభిస్తుంది. ఈవిధంగా 75% జీవన సాధనాలు వాయువు ద్వారా, నీటి ద్వారా లభిస్తాయి. భోజనంతో 25% అవసరాలు తీరతాయి. దీని వివరణ ఈవిధంగా ఉంది. (3) కార్బన్ 15%, (4) నైట్రోజన్ 3% (5) కాల్షియమ్ 2%, (6) ఫాస్ఫరస్ 1%, (7) పోటాషియం 0.35%, (8) సల్ఫర్ 0.25%, (9) సోడియం 0.15%, (10) క్లోరిన్ 0.05%, (11) మెగ్నీషియం 0.05%, (12) ఇనుము 0.4% (13) అయోడిన్, ఫ్లోరిన్, సిలికాం మూడు కలిపి 0.46% ఈ మొత్తం 100%.

పైన చెప్పిన తత్వాలు అవసరాలను పూరించడానికి (1) ప్రొటీన్‌లు, (2) కార్బోహైడ్రేట్-ఆమ్లాలు, (3) కొవ్వు పదార్థాలు, (4) విటమిన్లు, (5) సాల్టు-లవణాలు, (6) మినరల్-ఖనిజాలు, (7) నీళ్ళు ఇవి తప్పకుండా కావాలి. ఈ పదార్థాలు ఎవరికి లభిస్తే వారి అవసరాలు తీరినట్లే తరువాత జీవన నిర్వహణకోసం ఇంక ఏమీ చేయవలసిన అవసరం లేదు.

ఆర్థిక విశ్లేషణ ప్రకారం మనిషి విలువ ఇంకా తక్కువ. 10 గ్యాలన్ల నీళ్ళు, 7 సబ్బు బిళ్ళల మోతాదులో కొవ్వు, 600 పెన్సిళ్ళు తయారు చేయగలిగేంత కార్బన్, 10 అగ్గిపెట్టెలు తయారు చేయగలిగే ఫాస్ఫరస్, ఒక చిన్న పురుగును చంపగలిగేంత గంధకం, ఒక కోళ్ళ గూటికి వేయగలిగేంత సున్నం, 22 సేర్ల ఐసును కరిగించేంత వేడి, మూడు గాలి గుమ్మటాలు ఎగరడానికి కావలసినంత హైడ్రోజన్ ఇంకా ఇలాంటివే మరికొన్ని స్వల్ప విలువగల వస్తువులు ఈ శరీరంలో ఉన్నాయి. వీటి మార్కెట్ విలువ మహా అయితే యాభై రూపాయలుండవచ్చు. వాటి 'ముఖ్య విలువ'. మార్కెట్ విలువలో ఏమిలేనట్లే చెప్పవచ్చు. వాస్తవానికి విలువ అనేది ఇంట్రిసికల్ వాల్యూ మాత్రమే. నోటు విలువ ఏదీ, ఇరవై పైసల కంటే ఎక్కువ ఉండదు. కాని దాని ఇంట్రిసిక్ వాల్యూ దాని మీద ముద్రించిన విలువతో సమానంగా ఉంటుంది. అయితే మనిషి విషయంలో ఇది పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అతని దృశ్య మూల్యం ఏమీ లేదు. వాస్తవిక, ఆంతరిక, చేతనాత్మక మూల్యమే అంతా.

జీవనం ఏమిటి? దీనిపై వ్యాఖ్యానిస్తూ రసాయన శాస్త్రజ్ఞులు మనలను క్రోమోజోమ్ జీవులు, న్యూక్లియోటాయిడ్, ఆక్సోరైబో న్యూక్లిక్ యాసిడ్ లాంటి వృక్షాలతో నిండిన వనంలోకి తీసుకెళ్ళి నిలబెడతారు. అయితే విభిన్న స్థాయిలలో డి.ఎన్.ఏ. తయారు చేయడం. ఒకరికొకరు మార్పు చెందనీయకుండా ఉండే ఆ మూల సత్తా ఏమిటి? అనేది చెప్పరు.

పదార్థం పరమాణువుల సముచ్చయం అయినట్లే శరీరం జీవాణువుల సాకార మండలం అని జీవాణు శాస్త్రవేత్తలు చెబుతుంటారు. అయితే ఆ జీవాణువులు తీవ్రవేగంగా జన్మిస్తాయి, మార్పు చెందుతాయి. మరణిస్తాయి. ఈ పరివర్తనా ప్రభావం జీవి యొక్క రీతిని, నీతిని మార్పు చేసేదిగా ఎందుకు కనబడదు? దీనికి జీవశాస్త్రవేత్తల వద్ద జవాబు లేదు.

జీవశాస్త్రం ప్రకారం యుక్త వయసులో మానవ శరీరంలో దాదాపు 600 నుండి 800 ఖరబ్బుల కోశాలు ఉంటాయి. (ఖరబ్=పదివేల కోట్లు) వీటిలో ప్రతి సెకనుకు 5 కోట్లు చనిపోతాయి. అంతే సంఖ్యలో మరల ఉత్పన్నమవుతాయి. ఉత్పన్నమయ్యే క్రమం వేగంగాను, చనిపోయే క్రమం తేలికగాను ఉన్నంతవరకు శరీరం వికసిస్తూ ఉంటుంది. రెండింటి క్రమం

**మధుర భాషణమే మానవునికి నిజమైన మనుగడ.**

సమానంగా ఉంటే స్థిరత్వం ఉంటుంది. నశించే క్రమం తీవ్రంగాను, ఉత్పత్తి స్థితి మందంగా ఉంటే వృద్ధావస్థ సమీపించి అశక్తుడ్ని, రోగిని చేసి మృత్యు ముఖానికి చేరుస్తుంది.

పరమాణు విజ్ఞానం ప్రకారం జడ పరమాణువు విశేష స్థితిలో జీవనంలా ఆచరిస్తుంది. తరతరాలు తమ రీతిని నీతిని అనుసరిస్తాయి. పరమాణువుల కలయికతో జడ–చేతనా పదార్థాల రచన జరిగిందని గుర్తించబడుతుంది, పరమాణువులను పదార్థాల యొక్క అతి చిన్న భాగంగా చెబుతారు. కాని ఇప్పుడు అభివృద్ధి చెందిన విజ్ఞానం దీని కంటె ముందటి రహస్యాలను తెలియజేసింది. వాస్తవానికి విశ్వంలో శక్తి యొక్క సత్తాయే నిండి ఉన్నది. ఆ శక్తిమహాసాగరంనుండి అలలు ఎగసిపడుతుంటాయి. వాటికి తరంగాల రూపం లభిస్తుంది. ఈ తరంగాలకు విభిన్న వరుసక్రమం (ఫ్రీక్వెన్సీ) ఉంటుంది. తరంగాల క్రియాకలాపాలు ప్రకాశాన్ని, శబ్దాన్ని ఉత్పన్నం చేస్తాయి. ఈ రెండు పరస్పరం కలుస్తూ విడిపోతూ వివిధ అణు పరమాణువుల రూపంలో మేఘాల లాగా తయారవుతూ వ్యాపించే ఆకృతుల రూపంతో ముందుకు వస్తాయి. నిజానికి పరమాణువులకు కణం పేరుపెట్టడంతప్పు. వాటిని శక్తితరంగాలుగా చెప్పాలి. వాటికి స్వతంత్ర అస్తిత్వం ఏమీ లేదు. కాని అవి స్వతంత్రశక్తిగలవిగా భ్రమకలుగుతుంది.

డా॥ హెచ్.ఎం.వర్ తన సహచరులతో కలిసి ప్రాణుల జీవిక విద్యుత్ శాస్త్రాన్ని రచించారు. అందులో ప్రాణులలో ఉండే విద్యుత్తుకు ఆధారం మరియు క్రియాకలాపాలు భౌతిక విద్యుత్తుకు భిన్నమైనదిగా వ్రాశారు. ప్రాణి ఎంత బలహీనమైనా దానిలోని విద్యుత్‌ను ఇచ్ఛ, బుద్ధుల మిశ్రమంగా కూడా వారు గుర్తించారు. ఈ ప్రవాహం కారణంగానే ప్రాణిలోని విద్యుత్ తమ తమ రంగాలలో విశేష పరిస్థితులను, సాధనలను రచిస్తుంది. ప్రాణం అయస్కాంత పదార్థం నుండి తనకు ఉపయోగకరమైన భాగాన్ని లాక్కుంటుంది. దానిని తన మూసలో పోసుకుంటుంది. చేతనా స్వరంలో తన సంగీతాన్ని వినిపించే యోగ్యతను పొందుతుంది. "ఏ ప్రాణి గర్భం నుండి ఏ ఆకృతి, ఏ స్వభావం గల ప్రాణి ఉత్పన్నం కావాలి?" ఈ నిర్ధారణ రసాయనిక సంరచన మీద ఆధారపడి జరుగదు. రజం మరియు శుక్రకణాల లోపల నిండిఉన్న చైతన్యం ద్వారా ఇది నిర్ధారించబడుతుంది. ఆ ఆకర్షణతో శిశువులో విశిష్టస్థాయికి చెందిన ప్రాణుల ఆకృతి, స్వభావం ఎదగడం ప్రారంభం అవుతుంది. అలాకాకపోతే ప్రపంచంలో కనబడే ప్రాణులన్నీ ఒకే ఆకృతి, స్వభావం గలవిగా ఉత్పన్నమవుతాయి. ఎందుకంటే అణువుల స్థితి దాదాపు ఒకేరకంగా ఉంటుంది. వాటి రసాయనిక అంతరాల మీద ఆధారపడి కోటాను కోట్ల రకాల ప్రాణులు ఉత్పన్నం కావడం, వాటి వంశపరంపర అలా సాగుతూ ఉండడం జరుగుతుంది. కాకపోతే కొద్దిపాటి తేడా ఉన్న జీవజాతులు ఈ ప్రపంచంలో కనిపించవచ్చు. ఈనాడు మన ముందున్న వంశపరంపర, జీవవిజ్ఞాన స్వరూపంలో ప్రాణుల ఆకర్షణశక్తి విశిష్ట భూమికను పోషిస్తుంది.

అణువిజ్ఞాన శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత డా॥ హెరాల్డ్ సి.ఉరే కథనం ప్రకారం కార్బన్ లేని పదార్థాలు కార్బన్ పదార్థంలోకి మారడం వలన ఎమినో యాసిడ్ వస్తుంది. ఈ రసాయన పరమాణువుల నిర్మాణం కార్బన్, ఆక్సిజన్, హైడ్రోజన్ మరియు నైట్రోజన్‌ల విశిష్ట సంయోగంతో జరిగింది. ఈ విచిత్ర సంయోగం కారణంగా తయారైన ఈ రసాయనం జడాన్ని చైతన్యంలోకి మార్చే భూమికను ఆవిష్కరిస్తుంది.

డా॥ హెరాల్డ్ మాటలలో పృథ్వి యొక్క మొదటి వాయు మండలం అమ్మోనియా, మిథేన్ మరియు హైడ్రోజన్‌తో నిండి ఉండేది. దానిలో ఆక్సిజన్ పరిమాణం తక్కువ. స్థితి మారినపుడు ఆక్సిజన్ వృద్ధి చెందింది. అప్పుడు ఎమినో యాసిడ్ ఉత్పన్నమై జడపదార్థాలు చైతన్యంగా తయారయ్యే కార్యక్రమం ప్రారంభించింది.

ఈ వ్యాఖ్యలన్నీ అస్పష్టంగా ఉన్నాయి. ఇందులో కేవలం జీవి యొక్క ప్రాణ ప్రక్రియలోని విద్యుద్దీకరణ వివరాలు మాత్రమే లభిస్తాయి. కాని మూల ప్రశ్నకు ఇందులో సమాధానం లేదు. పదార్థానికి ఒక నియమిత నిర్ధారిత గతి ఉంటుంది. మానవీ చేతనలో రుచి, ఇచ్ఛ, ఆకాంక్ష, భావన భిన్నత్వం ఉంటుంది. అడుగడుగునా మారుతూ ఉంటాయి. భావుకత ద్వారా చిత్రవిచిత్ర అనుభూతులు రసాస్వాదన చేస్తాము. ఇదంతా ఏమిటి? దీనికి పరమాణు శాస్త్రవేత్తలు జవాబివ్వలేకపోతున్నారు.

శక్తి విజ్ఞానం జీవితాన్ని శక్తుల రాశి అని చెబుతుంది. ధ్వని, ప్రకాశం, ఆకర్షణలాగానే, తాపం కూడా ఒక ప్రచండశక్తి. ఆ

**మానవతా వాదమే నిజమైన మతం.**

తాపం (ఉష్ణం) యొక్క ఒక విశిష్ట పరిపక్వ స్థితియే ప్రాణం. శరీరంలో ఉన్న ఉష్ణమే జీవనం. అంటే ఉష్ణం యొక్క ఒక విచిత్ర ప్రక్రియను జీవనధార అని చెప్పవచ్చు. శరీరంలోని విభిన్న క్రియా కలాపాల వెనుక శక్తి విజ్ఞానం నియమిత స్థానాలలో, నియమిత ధాతువులలో నియమిత శక్తినే కారణంగా గుర్తించబడింది.

వాటి కథనాలను బట్టి మనిషి యొక్క సామాన్య తాపమానం $36.6^0$ సెంటిగ్రేడ్ ఉంటుంది. రక్తంలో చక్కెర 0.1 శాతం ఉంటుంది. సామాన్య రక్త ప్రసరణ 100 నుండి 140 మిల్లీ మీటర్ల వరకు ఉంటుంది.

లోపలి తాపమానం $36.6^0$ సెంటిగ్రేడ్ ఉంటుంది. కాని బయటి చర్మం వేడి $33^0$ సెంటిగ్రేడ్ కంటె ఎక్కువ ఉండదు. బయటి తాపమానం $33^0$కు తగ్గకుండా $45^0$ కంటె పెరగకుండా ఉంటే లోపలి తాపమాన స్వాభావిక స్థితి ద్వారా శరీర సామాన్య క్రియాకలాపాలు సరియైన రీతిలో జరుగుతాయి.

శరీరంలో మాంసకండరాలు అవసరమైన ఉష్ణాన్ని ఉత్పన్నం చేస్తుంటాయి. శరీరం 24 గంటలలో 60 నుండి 80 లక్షల క్యాలరీల ఉష్ణాన్ని బయటకు వదులుతుంది. ఇంటిలో పనిచేసే కరెంటు హీటర్ కూడా దాదాపు ఇంతే వేడిని ఉత్పన్నం చేస్తుంది. రక్తంలోవేడి శరీరవేడిని సమతుల్యంగా ఉంచుతుంది. వేడి పెరిగినప్పుడు శరీరంలో రక్తం వేగంగా పరుగులుతీస్తుంది. అనవసరమైన వేడిని బయటకు నెట్టి వేస్తుంది. కాని జలుబు చేసినప్పుడు అది శరీరంలో వేడిని కూడబెడుతుంది.

ప్రాతఃకాల తాపమానం దాదాపు $30^0$ సెంటిగ్రేడుగా ఉంటుంది. సాయంత్రం $37.5^0$ సెంటిగ్రేడ్ వరకు చేరుతుంది. పగటి కంటె రాత్రి ఉష్ణోగ్రత కొంచెం తక్కువగా ఉంటుంది.

వెన్నెముక పైన మస్తిష్కం క్రింద శరీర తాపాన్ని నియంత్రించే కేంద్రం ఉంది. అక్కడ నుండి అవసరాన్నిబట్టి వేడినిపెంచడం, తగ్గించడం జరుగుతుంది. ఈ కేంద్రాన్ని గనుక కృత్రిమంగా ప్రభావితం చేస్తే ఘోరమైన వేడిలో కూడ చలి వణికిస్తుంది. ఘోరమైన చలిలో కూడా మధ్యాహ్నపు వేడిలాగా సలసల కాగుతున్నట్లు అనుభవమవుతుంది.

★★★

## కదిలించే కళ్లు

9.సీ॥ రూప కిశోర్‌శర్మ రూపాన సరితూగు
దానకుంవరిదేవి ధర్మపత్ని
తొమ్మిది మాసాలు తొమ్మిది విధముల
కలలలో కదలాడి కలిగెసుతుడు
సూర్యచంద్రుల నుండి సూటిగా ప్రసరించు
కిరణపుంజమనగ కీర్తిగాంచె
ఆవల ఖేదలో అల్లారుముద్దుగా
శ్రీరాముడనుపేర చెలగుచుండె

తే॥ భువిని దివ్యావతారుడై అవతరించి
తల్లిదండ్రులకెంతేని తనివిదీర
పెరిగిన వితమంత తెలియపరచుమనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

10.సీ॥ సకల సంస్కారముల్ సవ్యంగ జరిపించి
తీర్చిదిద్దెను తండ్రితీరుగాను
గురు శిష్యబంధంబు గురిదప్పనీకుండ
పేరుపేరున దెల్పెవరుసగాను
మహితాత్ముడైనట్టి మాన్యుండుమాలవ్య
గాయత్రినందించె ఘనముగాను
గురుదేవు మహిమను గుర్తించి బాలుండు
వెదకుచుండెను మది వింతగాను

తే॥ గురువు రూపంబుగూర్చిన గురుతు లేక
గురువు రాకను మదిలోన మరువలేక
మంత్ర జపమును చేపట్టు మహిమ గూర్చి
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటి చూపు

రచన–మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**ప్రేమించే హృదయమే నిజమైన మతగురువు.**

సంస్కృతీమూర్తి - పరమపూజ్య గురు దేవులు

# సంస్కృతీ పురుషుని వారసత్వం-వీలునామా

'వసీయత్ ఔర్ విరాసత్" అనే గురుదేవుల జీవితకథ నుండి ఈ క్రింది వాక్యాలను చదువుకోవచ్చు. "అనన్య ఆత్మీయ ప్రజ్ఞా పరిజనులకు ఇదే నా వారసత్వపు వీలునామా. మా జీవితం నుండి కొంత నేర్చుకోండి. నా అడుగులలోని యథార్థాన్ని వెతకండి. విజయాన్ని పరీక్షించండి. వీలైనంతవరకు అనుసరించండి" 1) మార్పును ఆశించిన ఒక ఋషి యొక్క ఆత్మకథ నుండి వెలువడిన ఈ విషయం దస్తావేజు వంటిది. గురుదేవులు తమ జీవితంలోని అంతరంగ భాగాలు తెరచి ప్రజల సమక్షంలో పెట్టారు. ఈ పుస్తకాన్ని చదివి చాలా మంది తమ ఆలోచనల్లో మార్పుతెచ్చుకున్నారు. 1980లో ముద్రించబడిన ఈ పుస్తకం లక్షలాది మంది జీవిత దిశను మార్చి వేసింది. ప్రపంచంలో ఎందరో మహా పురుషులు జన్మించారు. ఎన్నో ఘనకార్యాలు సాధించారు. వారందరిలో పరమపూజ్య గురుదేవులు ఒక్కరే ప్రజలందరికీ తమ వారసత్వాన్ని అందించారు. ప్రతి ఒక్కరూ సంస్కృతీ దూతగా తన బాధ్యతను నిర్వహించారు. భారతీయ సంస్కృతీ ఆదర్శాలను పాటించేవారు. తమ కర్తవ్యాన్ని తప్పక నిర్వహించారు.

పరమపూజ్యగురుదేవుల సత్సంకల్పాల ఆధారంగా పూర్ణాహుతి జరుపబడింది. గురుదేవులు సంస్కృతిని తిరిగి సంస్కరించారు. ప్రతివారిలోను 'జీవన సాధన' అనేది ఒక భాగంగా అమర్చివేశారు. "మీరు నాకు మీ క్షుద్రతను, సంకీర్ణతను ఇచ్చి వేయండి. నేను మీకు గొప్పదనాన్ని ప్రసాదిస్తాను" అని అభయం ఇచ్చారు. ఈనాడు ప్రపంచం అంతటిలో 100 దేశాలకు పైగా మన సంస్కృతీ శంఖారావాన్ని మ్రోగిస్తూ ఉన్నాయి.

ప్రస్తుతం మన గురు సత్తా జీవితం యొక్క అనుభూతులతో మనస్సులను నింపివేసే ప్రయత్నం జరుగుతోంది. వారు తమ జీవిత సంగ్రామంలోని ఎన్నో ఘట్టాలను వివరించారు. వాటిని గనుక విపులంగా వివరించగలిగితే నూతన యుగానికి ఆధార స్తంభాల్లా నిలుస్తారు. ఆ యుగపురుషుని వ్యక్తిత్వం నుండి ఎంతో కొంత భాగం మనలను తాకగలిగితే వారి విరాట్ రూపాన్ని దర్శించగలుగుతాం. వారి సమగ్ర రూపాన్ని చూడగలిగితే ఆ బ్రహ్మదేవుని సాక్షాత్కారం పొందగలిగినట్లే. 8 కోట్ల మంది పరివార జనులు వారు తెలిపిన ఉజ్వల భవిష్యత్తు కొరకు గట్టి నమ్మకంతో ఎదురుతెన్నులు చూస్తున్నారు. ప్రజల మనసుల్లో మార్పు వస్తున్న విషయం చాలా మందికి అర్థం అవుతూనే ఉంది.

"దక్షిణేశ్వరంలో ప్రారంభించిన పనిపూర్తికావడానికి ఇంకా చాలా సమయం పట్టేటట్లు ఉంది. ఎంత ప్రయత్నించినా వివేకానందుని ఆశయాలకు ఒక రూపాన్ని ఇవ్వలేకపోతున్నాం. రాబోయే రోజులలో ఇది ఒక ఉద్యమంగా రూపుదిద్దుకుని ముందుకు సాగాలి". అని అరవింద మహర్షి "హ్యూమన్ సైకిల్" అనే గ్రంథంలో వ్రాశారు. "నూరు సంవత్సరాలకు పూర్వం వివరించిన సత్యాలు – సత్యయుగం తప్పకవస్తాయి" అని స్వామి వివేకానంద "భారతదేశ భవిష్యత్తు" అనే పుస్తకంలో వ్రాశారు. "21వ శతాబ్ది ప్రారంభంలోనే ఇది స్పష్టంగా కనిపిస్తుంది" అని కూడా వ్రాశారు.

21వ శతాబ్దంలో సమాజ వికాసం, నారీ జాగరణ అనే అంశాలు ఈశ్వరుని సంకల్పం, తపస్సు అనే బాధ్యత ఋషులది. శ్రేయస్సును చేకూర్చిపెట్టడం మనవంతు. ఫలితాలను అనుభవించేది మానవులు. నవయుగం రాకను మనం అందరం తప్పక చూస్తాం. చూడడమే కాదు అందులో భాగస్వాములం అవుతాం. గురుదేవులు పరిజనులను అంశావతారులుగా, మధ్యావతారులుగా పిలిచారు. పరిజనులు చూడడానికి సామాన్యులుగానే కనిపిస్తారు. కాని వీరు సమయదానం, అంశదానం, సాధనాదానం, ప్రతిభాదానం మొదలైనవి అన్నీ అందిస్తూ ఆత్మబలాన్ని పెంపొందించుకుంటూ ఉన్నారు. పరమేశ్వరతత్వాన్ని, ఆయన లీలా విశేషాలను చూడగలుగుతూ ఉన్నారు. ఈ సమయంలో గురుదేవుల చేతనాశక్తి కారణశరీరంతో పనిచేస్తూ ఉంది. వారి శక్తి ప్రపంచం నాలుగుమూలలా వ్యాపిస్తూ ఉంది. సంస్కృతిని విస్తరింపజేస్తూ ఉంది. ఈ ప్రయత్నాల కారణంగానే సత్యయుగం వచ్చి తీరుతుంది. ఈ విషయంలో అనుమానించాల్సిన అవసరం లేనే లేదు.

పరమపూజ్య గురుదేవులు తన వీలునామాలో పరిజనులందరినీ తనకు వారసులుగా చేసి వ్రాశారు. ఆ వారసత్వాన్ని స్వీకరించి, వారు తలపెట్టిన, ప్రారంభించిన, సూచించిన కార్యాన్ని మనమందరం కలసికట్టుగా పనిచేసి సాధించి తీరాలి. అదే సంకల్పంగా తీసుకోవాలి. సూక్ష్మరూపంలో వారి అండదండలు మనకు లభిస్తూనే ఉంటాయి.

★★★

విషయాన్ని క్రమబద్ధం చేసేవాడే నిజమైన ఉపన్యాసకుడు.

ధారావాహిక: హనుమత్ కథామృతం-17

# వేచిచూడకతప్పదు - అప్పుడే ఆత్మ ప్రకాశం

'పవిత్రత' అనే శబ్దం బాలహనుమాన్ మనోభూమిలో మహాబీజంలాగా నాటుకుంది. క్షణక్షణం అది మహామంత్రంలాగా ప్రతిధ్వనిస్తోంది. మహాకాలుని కళలతోపాటు ఆతని స్పందనలు గంభీరంగా తయారౌతున్నాయి. అందువల్ల మానసిక ఆలోచనలు రూపాంతరం చెందుతూ ఉన్నాయి. మెల్లమెల్లగా 'పవిత్రత' అనే పదం శబ్దరూపం నుండి భావంగా మారిపోతోంది. ఏదోఒక అసాధారణ క్రియను ప్రేరేపించడం మొదలుపెట్టింది. కాని ఆ క్రియ ఏమిటి? ఎలా ఉంటుంది? దాని స్వరూప స్వభావాలు ఏమిటి? అన్న మూడు ప్రశ్నలు 'స్థూల, సూక్ష్మ, కారణ' మూడింటి పరిధిలో వేధిస్తూనే ఉన్నాయి. బాల హనుమాన్ తన జిజ్ఞాసను గురించి అడవిలో ప్రవహించే నదులతోను, వృక్షాలతోను, ఆ వృక్షాలను చుట్టుకుని జీవిస్తున్న లతలు తీగలతోను, మొగ్గలతోను, వికసించిన పుష్పాలతోను, కొమ్మ-రెమ్మలతోను మౌనంగా చర్చిస్తూనే ఉన్నాడు. అయినా పాపం అతనికి సమాధానం కూడ మౌనమే మిగిలిపోతోంది.

ఆకాశంలో ఎగిరే పక్షులతో పాటు ఆతని జిజ్ఞాస కూడ ఉపరితలం దాకా ప్రాకిపోతోంది. కంటికి కనిపించే ఈ స్థూల ప్రకృతి ఈ మహాప్రశ్నకు సమాధానం ఇవ్వడం కష్టం అని నిర్ణయించుకున్నాడు. ఎక్కడ చూచినా కాలుష్యంతో కప్పబడి ఉంటోంది. అందువల్ల పవిత్రతను పట్టుకోలేకపోతున్నాం. ఇక లాభం లేదనుకుని బాల హనుమాన్ తన ప్రశ్నను అంతర్ముఖం చేశాడు. అది ఆలోచనా సాగరంలో ఈదుకుంటూపోతున్నది. కానీ అక్కడ కూడ దైవీ భావన వేధిస్తోంది. ఊహలు, కల్పనలు వేధిస్తున్నాయి. పవిత్రతను గూర్చి తెలిపేది స్వీయ ప్రతిభగా భావించాడు. దాని ప్రకాశం కోసం ఎదురుచూడసాగాడు.

హనుమాన్‌కు వయస్సు చిన్నదైనా ఆలోచనాపరుడు. అనుకున్న విషయాన్ని సాధించి తీరడం ఆతని ప్రత్యేకత. అందువల్ల ఆతని మనస్సు గురించి అన్వేషణ ప్రారంభించాడు. అనుకున్నది లభించేవరకు ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనకడుగు వేసే గుణం లేదు. రోజూ నిద్రించడానికి వెళ్ళుతూ తల్లిని ఏదో ఒక ఆధ్యాత్మిక ప్రశ్న వేయడం ఆతనికి అలవాటు. ఎందువల్లనో గాని ఈ విషయం తల్లిని కూడ అడగాలనిపించలేదు.

చిరునవ్వులు చిందిస్తూ అంజనీదేవి కుమారుని ముఖాన్ని పరికించి చూచింది. చుక్కల దుప్పటిచేత పట్టుకుని నిద్రించడానికి వెళుతున్న ఆకాశం వైపు చూచింది. ఆ చుక్కల దుప్పటిలో ఒక మూలనుండి వెలుతురు బాలహనుమాన్ ముఖం మీద ప్రసరించింది. ఆ వెలుగులో బాలహనుమాన్ ముఖం మీద ఏదో అడిగి తెలుసుకోవాలన్న కుతూహలం కనిపించింది. వెంటనే

"నాయనా! మనస్సులో అనేక రకాల ప్రశ్నలు పుడుతూనే ఉంటాయి. అవి సహజంగా అంతరంగంలోని సంస్కారాల నుండి, బుద్ధి నుండి గాని పుట్టుకువస్తాయి. ఒక్కొక్కప్పుడు చుట్టు ప్రక్కల వాతావరణంనుండి గాని, ఏదైనా సంఘటన నుండి గాని ఉదయిస్తాయి. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం కోసం సామాన్యులు ఎవరో ఒకరిని అడుగుతారు. దానికి సమాధానాలను కూడ పొందుతారు. ఇది సామాన్య జనుల మాట. కాని నా కొడుకు ఎప్పుడూ అసామాన్యుడే" అని చెప్పుతూ ప్రేమగా నుదిటిపై ముద్దుపెట్టింది. కన్నతల్లి నమ్మకానికి, ప్రేమకు హనుమాన్ పులకించిపోయాడు. చంద్రునిలాగా చల్లని దరహాస చంద్రికలను ప్రసరింపచేస్తూ తల్లి ముఖంలోకి చూచాడు. నుదిటిపై తిలకంతో అంజనీదేవి ముఖం దేదేప్యమానంగా ప్రకాశిస్తోంది. పూర్ణచంద్రునిలా ప్రకాశిస్తున్న తల్లిముఖం వంక చూస్తూనే రెండు కాళ్ళను గట్టిగా చుట్టేసుకున్నాడు.

అమ్మ ఆనందం వర్ణనాతీతం. కుమారుని గోముగా దగ్గరకు తీసుకున్నది. "కుమారా! సామాన్య మానవుడు తన సందేహాలను ఇతరుల ద్వారా తీర్చుకుంటాడు. కాని బుద్ధిమంతుడు ప్రకృతిని పరిశీలిస్తూ, నిరీక్షిస్తాడు. నిరంతరం దానిని గురించే ఆలోచిస్తాడు. ఏదో ఒకనాడు ఇతరుల ద్వారా కాకుండా ఆతని అంతరంగం నుండే సమాధానం వచ్చి తీరుతుంది. "అమ్మా! ఒకవేళ ఆ జిజ్ఞాస సశేషమయిందైతే? ప్రకృతి నుండి గాని, అంతరంగం నుండి గాని సమాధానం లభించకపోతే? అప్పుడేం చెయ్యాలి?" ప్రశ్నించాడు.

"కుమారా! అదొక ప్రత్యేక పరిస్థితి. అంతరంగంలో సమాధానం లేని ప్రశ్న అంటూ అసలు ఉండనే ఉండదు. కాకపోతే ఆ విషయాన్ని ముందుగా నమ్మితీరాలి. నమ్మకంగా నిరీక్షిస్తూపోతే ఎంత పెద్ద ప్రశ్నకైనా సమాధానం స్వీయ ప్రతిభలో మిళితమయ్యే ఉంటుంది.

స్వీయ ప్రతిభను ప్రకాశింపచేసుకోవాలన్న జిజ్ఞాసలో పడిపోయిన హనుమాన్ ఇక మాటిమాటికి అమ్మను ప్రశ్నించి బాధించకూడదన్న నిర్ణయానికి వచ్చాడు. తన నిరీక్షణతోనే సాధించాలి అనుకున్నాడు. చిరునవ్వుతో తల్లి వంకచూచాడు.

"కుమారా! స్వీయ ప్రతిభతో ప్రశ్నకు సమాధానం వెదకడం చాలా సులభం. ప్రారంభంలో ఒక్కొక్క ప్రశ్నకు సమాధానాలు వెదుక్కోవాల్సి ఉంటుంది. మౌనంగా లోతుగా ఆలోచించాలి. ఆ సమయంలో తర్కవితర్కాలకు స్థానం ఇవ్వకూడదు. ఆలోచిస్తూనే సమాధానం కోసం ఎదురుచూడాలి. నిరీక్షణలోనే ఆత్మ వికసిస్తుంది, ప్రకాశిస్తుంది. ఆ వెలుగులోనే సమాధానం కనిపిస్తుంది. దీనికి అనువైన సమయం రాత్రి వేళలు మాత్రమే" అని వివరించింది.

★★★

**కారణాలను వెదికి పట్టుకున్నవాడే నిజమైన హేతువాది.**

పుస్తక ప్రదర్శన

# వ్యవస్థ ఇలా ఉండాలి

పుస్తక ప్రదర్శన యొక్క ప్రధాన ఉద్దేశ్యం పరమపూజ్య గురుదేవుల విరాట్ రూపాన్ని దర్శింపచేయడమే. విరాట్ రూపం అంటే పెద్ద చిన్న చిత్రపటాలు పెట్టడం కాదు. వారు రచించిన అనంత సాహిత్యాన్ని ప్రదర్శింపచేయాలి. మొట్టమొదట 50 పుస్తకాలతో ప్రదర్శన జరిగింది. దానిలో ఎదురైన సాధకబాధకాలను దృష్టిలో ఉంచుకుని క్రింది ప్రణాళికను ఏర్పాటు చేయడం జరిగింది.

## 1. గాయత్రీ తపోభూమితో సంప్రదింపులు

గురుదేవుల ప్రేరణతో పుస్తక ప్రదర్శన పెట్టాలన్న ఆలోచన రాగానే అక్కడున్న ప్రముఖ కార్యకర్తలందరూ ఒకచోట సమావేశం కావాలి. పెట్టాలా? వద్దా? అన్న విషయం తేల్చుకోవాలి. నిర్ణయం బలపడగానే 4గురు గాని 5గురుగాని ప్రముఖ కార్యకర్తలు చర్చించుకుని 9927093699 నంబరుకు ఫోను చేసి శ్రీ పాండేయగారితో అపాయింట్ తీసికోవాలి. దాని ప్రకారం తపోభూమి మథురకు వెళ్లి వారి మార్గదర్శనం పొందాలి. వారికి ఈ విషయంలో అపారమైన అనుభవం ఉంది. అందువల్ల ఎలాంటి స్థలం కావాలి? కార్యక్రమ స్వరూపం ఎలా ఉండాలి? ఏవిధంగా పనిచెయ్యాలి? ప్రచారం చేసే పద్ధతి ఏంటి? ఎంత ఖర్చు అవుతుంది? ఎంత ఖర్చు పెట్టాలి? ఎంతమంది కార్యకర్తలు కావాలి? మొదలైన ముఖ్యమైన విషయాలకు స్పష్టమైన సమాచారం అందిస్తారు. ప్రదర్శన ఏర్పాటుకు తక్కువలో తక్కువ రెండు నెలల సమయం పడుతుంది. అంతకన్నా ఎక్కువ పట్టినా ఇబ్బంది లేదు. మరింత ప్రయోజనం ఉంటుంది.

## 2. ఎలాంటి స్థలం కావాలి?

పుస్తక ప్రదర్శనకు దాదాపు 400 చదరపు (వర్గఫీట్) అడుగుల గల హాలు ఉంటే మంచిది. అది కూడ రోడ్డుకు (మెయిన్‌రోడ్) సమీపంలో ఉంటే, కార్లు, స్కూటర్లు పార్కింగ్ చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. వీలైతే ఏదైనా స్కూలుగాని, కాలేజిగాని, హాస్టలుగాని దొరికితే మరీ మంచిది. సామాన్యంగా స్థల నిర్ణయం చేసేటప్పుడు జనాల రాకపోకలు ఎక్కువగా ఉన్న ప్రదేశాన్ని ఎంచుకోవాలి. షామియానా వేసి బల్లలు వేయవచ్చు. కాని చాలా ఖర్చు వస్తుంది. అనుకోకుండా వర్షం వస్తే పుస్తకాలు తడిసిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల అలాంటి ప్రయత్నాలు చేయనేకూడదు. సాధ్యమైనంతవరకు అద్దె చెల్లించాల్సిన పనిలేకుండా మాట్లాడుకోవాలి.

## 3. ఎన్ని రోజులుండాలి?

ప్రదర్శన తక్కువలో తక్కువ 10 రోజులన్నా ఉండాలి. వీలైతే 12 రోజులు పెట్టవచ్చు. సామాన్యంగా ప్రభుత్వం వారి ప్రదర్శనలు కూడ ఇలాగే ఉంటాయి. మొదటి 3,4 రోజులు జనం తక్కువగా ఉంటారు. అక్కడి నుండి మెల్లమెల్లగా సంఖ్య పెరుగుతూ ఉంటుంది. చివరలో 2,3 రోజులు చాలా రద్దీగా ఉంటుంది. పరిస్థితిని బట్టి ఇంకా రెండు రోజులు పెంచాలి అనిపిస్తుంది. పెంచాలంటే హాలు వారి అనుమతి కావాల్సి ఉంటుంది. మొత్తం మీద మనం పెట్టిన ఖర్చుకు, పడిన శ్రమకు తగిన ఫలితం లభించాలి. మొదటి రెండు రోజులు అన్నీ సర్దిపెట్టుకోవడానికి, చివరి రెండు రోజులు మిగిలినవి సరిచూచిపెట్టుకోవడానికి సరిపోతాయి.

## 4. ఎలాంటి రోజుల్లో నడపాలి?

ప్రదర్శన ఎలాంటి రోజుల్లో నడపాలో బాగా ఆలోచించుకోవాలి. శుభముహూర్తాలు ఎక్కువగా ఉన్న సమయంలో పెట్టరాదు. ముహూర్తాలు లేని సమయం అయితే తక్కువ అద్దెలో, సులభంగా హాలు దొరుకుతుంది.

## 5. కార్యకర్తల సమావేశం

ప్రదర్శనకు నెల, నెలన్నరకు ముందుగా కార్యకర్తలు సమావేశం కావాలి. పైన చెప్పిన విషయాల గురించి కూలంకషంగా చర్చించుకోవాలి. తేదీలు నిర్ణయించుకున్న తర్వాత గాయత్రీ తపోభూమి మథురకు విషయాన్ని తెలియచెయ్యాలి. జిల్లాలోని కార్యకర్తలను తగినంత ముందుగా పిలిపించాలి. జిల్లా స్థాయిలోని, రాష్ట్ర స్థాయిలోని ముఖ్య కార్యకర్తలందరినీ రప్పించాలి. వచ్చిన కార్యకర్తలందరికీ కార్యక్రమాన్ని పరిచయం చెయ్యాలి. వారు కూడ యథాశక్తి సహకరించాలి. చివరలో కార్యకర్తల చేత సంకల్పపత్రాలు నింపించాలి. దీనిద్వారా ఎవరి

జాతి సమైక్యతను, దేశ సమగ్రతను కోరుకున్నవాడే నిజమైన సన్యాసి.

శక్తి కొలది వారు అంశదానం, సమయదానం ఇవ్వగలుగుతారు.

## 6. పుస్తకాలు కావాలంటే

ప్రదర్శన కొరకు పుస్తకాలను తెప్పించుకోవాలి అనుకున్న వారు ప్రదర్శన తేదికి నెల, నెలన్నర ముందుగానే మథుర నుండి ఆర్డరు ఫారాన్ని తెప్పించుకుని పూర్తి చేయాలి. ఈ ఫారంతోపాటు కావలసిన పుస్తకాల వెలకు 75% ధనాన్ని బ్యాంకు డ్రాఫ్టు ద్వారా "యుగనిర్మాణ యోజన-మథుర" పేరు మీద పంపించాలి. దేశం నలుమూలల నుండి పుస్తకాల కొరకు మథురకు ఆర్డర్లు వస్తూ ఉంటాయి. అందువల్ల ముందుగా పంపించకపోయినట్లైతే చాలా కష్టం అవుతుంది. వనమూలికలు, హవన కుండీలు, సి.డి.లు శాంతికుంజ్ నుండి తెప్పించుకోవాలి.

గత అనుభవం ప్రకారం 'ఎ' క్లాసు పట్టణాలలో దాదాపు 3 లక్షలు, 'బి' క్లాసు పెద్ద జిల్లాలలో దాదాపు 4 లక్షలు, 'సి' క్లాసు చిన్న జిల్లాలలో దాదాపు $2^1/_2$, 3 లక్షల పుస్తకాల విక్రయం జరిగింది. ఈ సంఖ్య అక్కడ ఉన్న స్కూళ్ళు, కాలేజీల సంఖ్యను అనుసరించి, హాజరైన ప్రముఖుల సంఖ్యను అనుసరించి నిర్ణయించుకుని ఆర్డరు ఇవ్వవచ్చు.

ప్రదర్శన నడుస్తూ ఉండగా వేగంగా అమ్ముడుపోతున్న పుస్తకాలపై దృష్టిని పెట్టాలి. వెంటనే ఎవరినైనా ఒకరిని మథురకు పంపించి తెప్పించుకోవాలి. వీలైతే దగ్గరలో ఉన్న పెద్ద కార్యాలయానికైనా పంపి తెప్పించుకోవచ్చు. ఈ పనికోసం ఇద్దరు ముగ్గురు వ్యక్తులను సిద్ధంగా ఉంచుకోవాలి. కావలసినవి ఎప్పటికప్పుడు లిస్టు వ్రాసుకుని పంపుతూ ఉండాలి.

## 7. ప్రచార పద్ధతులు

ప్రదర్శన విజయవంతం కావాలంటే క్రింది ప్రచార పద్ధతులను పాటించాలి.

(1) **హోర్డింగులు:** 10'×15'; 10'×20' లేక అవసరాన్ని బట్టి ఇదే పద్ధతిలో పెద్దవిగాని, చిన్నవిగాని తయారుచేయించాలి. 30 రోజులు ముందుగానే కట్టించాలి.

(2) **పోస్టర్లు:** కొన్ని పోస్టర్లను ఆకర్షణీయంగా తయారు చేయించాలి. వాటిని బ్యాంకులు, పోస్టాఫీసు, స్కూల్సు, కాలేజీలు మొదలైన జనం ఎక్కువగా వచ్చే ప్రదేశాలలో కట్టించాలి.

(3) **పాంప్లెట్లు:** 1,2 నెలల ముందుగానే కరపత్రాలు అచ్చు వేయించాలి. కార్యకర్తల చేతికిచ్చి పంచిపెట్టమనాలి. కార్యకర్తలు పత్రంతోపాటు అవసరాన్ని బట్టి ఏదైనా ఒక చిన్న పుస్తకాన్ని కూడ పంచితే బాగుంటుంది.

(4) మెల్లమెల్లగా ప్రచారాన్ని పెంచుకుంటూపోవాలి. చిన్న చిన్న పత్రాలను దుకాణాలలోను, ఇంకా అనుకూలమైన ప్రదేశాలలోను, అంటించాలి.

(5) కార్లు, స్కూటర్లు పార్కు చేసిన చోట్ల ఈ పత్రాలను అంటించడంగాని, యజమానికి అందించడం గాని చేస్తుండాలి.

(6) ప్రదర్శనకు 3,4 రోజుల ముందునుండి ఆటోలోగాని, రిక్షాలోగాని, జీప్‌లోగాని ప్రీ-రికార్డ్ కేసెట్ ద్వారా నగరంలో ప్రచారం చేయాలి. దానితోపాటే కరపత్రాలు పంచాలి.

(7) ప్రదర్శనకు 3,4 రోజుల ముందునుండే వార్తాపత్రికల్లో కరపత్రాలు పెట్టి వేయించాలి.

(8) 2,3 రోజులు ముందునుండే వార్తాపత్రికల్లో ప్రదర్శన గురించి సంక్షిప్త ప్రకటన ఇవ్వాలి.

(9) టి.వి.ఛానళ్ళలో 15 రోజుల ముందునుండే వార్త రూపంలో ప్రసారం చేయించాలి.

(10) ప్రదర్శనా స్థలంలోని గేటు మీద, చుట్టు ప్రక్కల ప్రదేశాల్లో రకరకాల సైజుల్లో ఫ్లెక్సీలు తయారుచేయించి అంటించడంగాని, వ్రేలాడదీయడంగాని చేస్తే ఆకర్షణీయంగా ఉంటుంది.

"ఈ ప్రదర్శన కేవలం ఒక ధర్మానికి, మతానికి, సంప్రదాయానికి సంబంధించినది కాదు, అందరి కొరకు" అనిపించే విధంగా ప్రచారం జరగాలి. ఎందుకంటే మన ఉద్దేశ్యం అందర్నీ కలుపుకునిపోవడమే. అందువల్ల అన్ని మతాలవారిని ఆహ్వానించేవిధంగా ఉండాలి.

## 8. ఆహ్వాన పత్రం

మనం ఆహ్వానించే వారిని ప్రత్యేక వర్గాలుగా విభజించి పట్టికలు తయారుచేయాలి. అప్పుడు పంచడం సులభమైపోతుంది.

1) **రాజకీయవర్గం:** మంత్రి, ఎమ్.ఎల్.ఎ, ఎమ్.పి, సర్పంచ్, మాజీమంత్రి, మాజీ సభ్యుడు మొదలైనవారు.

2) **అధికారవర్గం:** కమీషనర్, కలెక్టర్, జడ్జి, ఆఫీసర్లు, పోలీసు అధికార్లు మొదలైనవారు.

3) విద్యారంగంలోని ఆచార్యులు, ప్రధానాచార్యులు, లెక్చరర్లు మొదలైనవారు.

మత సామరస్యతను పాటించడమే నిజమైన అధ్యాత్మ.

4) పత్రికా సంపాదకులు, విలేకర్లు మొదలైనవారు.

5) **మేధావివర్గం:** కవులు, రచయితలు, సాహిత్యకారులు మొదలైనవారు.

6) వేర్వేరు మతాధికారులు, విభిన్న సంప్రదాయాలవారు మొదలైనవారు.

7) వ్యాపార రంగంలోని ప్రముఖులు

8) భిన్న భిన్న సంస్థలకు, యూనియన్లకు లీడర్లు

9) అనేకమంది ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగియున్నవారు.

ఇలాంటి వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల చాలా ముందుగానే లిస్టు తయారు చేసుకోవాలి. ఇద్దరేసి వ్యక్తులను టోలీలుగా తయారుచేయాలి. ఏ టోలీ ఏ వర్గాన్ని పిలవాలో నిర్ణయించి చెప్పాలి. వారు వెళ్లి ఆహ్వానించడమే కాకుండా వారు వచ్చే తేదీని, సమయాన్ని నోటు చేసుకోవాలి. వారు వచ్చే రోజున, పిలిచిన వ్యక్తి ఆ సమయానికి తప్పనిసరిగా ఉండి తీరాలి. ఈ విధంగా ప్రతిరోజూ విశిష్ట వ్యక్తులు 5-6 మంది ఉండేలా చూచుకోవాలి. ఒక విజిటర్స్ బుక్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి. వారు వచ్చి వెళ్లేటప్పుడు వారి అభిప్రాయాన్ని, అనుభూతిని వ్రాయించుకోవాలి. ఆ అభిప్రాయాలు ఏరోజుకారోజు పత్రికల్లో వచ్చేలా చూచుకోవాలి. వారు దర్శించే సమయంలో ఫోటోలు తీయాలి. వార్తతో పాటు ఫోటోలు కూడా పత్రికల్లో రావాలి.

కార్యకర్తలు ప్రతిరోజూ ఒక సమయాన్ని నిర్ణయించుకుని సమావేశం కావాలి. ఆనాటి కార్యక్రమంలో జరిగిన మంచి-చెడులను సమీక్షించుకోవాలి. మరురోజు కోసం జాగ్రత్త వహించాలి.

## 9. బాధ్యతలు

ప్రదర్శన విజయవంతం కావాలంటే అందరికీ స్పష్టంగా బాధ్యతలు అప్పగించబడాలి.

1) సమయస్ఫూర్తితో సమర్థవంతంగా ఆలోచించగల వ్యక్తిని సంయోజకుడుగా నిర్ణయించాలి. పూర్తి పర్యవేక్షణ ఆతనికి అప్పగించాలి.

2) రక్షణ వ్యవస్థను లోపల-బయట కూడ దృష్టిని సారించి ఉంచగల వ్యక్తికి అప్పగించాలి. ఆతనికి ఇద్దరు, ముగ్గురు వ్యక్తులను సహాయకారులుగా ఇవ్వాలి.

3) స్వాగతసమితికి నలుగురు వ్యక్తులను కేటాయించాలి. వారు ఎప్పటికప్పుడు సమాచారాన్ని లోపలకు అందించేవారుగా ఉండాలి.

4) వేదిక వ్యవస్థ: వేదిక మీద పూలమాలలు, జ్యోతి ప్రజ్వలన మొదలైనవి చూచుకోవడానికి శ్రద్ధాసక్తులు కలిగిన మహిళను నిర్ణయించాలి. వేదికపై మైకు వ్యవస్థను చూచుకుంటూ ఎనౌన్సుమెంట్ చేయడానికి ఒక వ్యక్తిని సిద్ధంగా ఉంచాలి.

5) మీడియా విభాగం చూచుకునే వ్యక్తి ప్రతిరోజూ వార్తను వ్రాసి ఇవ్వడమేకాకుండా, ఫోటోలను కూడ అందించగలగాలి.

6) పుస్తక స్టోర్ విభాగం చూచుకునే వ్యక్తికి ఒకరిద్దరు సహాయకుల్ని అప్పగించాలి. ఏవి అయిపోతున్నాయో, ఏవేవి తెప్పించాలో వారు చూచుకుంటూ ఉండాలి.

7) భోజనం-టిఫిన్ వ్యవస్థ చూచుకునే వ్యక్తికి ఇద్దరు సహాయకులు ఉండాలి. వారు కార్యకర్తల భోజనం మొ॥ వాటిని శ్రద్ధగా చూచుకోవాలి.

8) పార్కింగ్ వ్యవస్థ: దీనిని రక్షణ విభాగమే చూచుకోవాల్సి ఉంటుంది.

9) పేమెంట్ కౌంటర్: దీనికి మొత్తం మీద 4 నుండి 6 మందిదాకా ఉండాలి. ప్రతిఒక్క కౌంటరు దగ్గర ఇద్దరు వ్యక్తులుండాలి. అవసరాన్ని బట్టి వీరి సంఖ్య తగ్గించడంగాని, పెంచడంగాని జరుగుతుంది. బిల్లులో పుస్తకంపేరు వ్రాయాల్సిన అవసరం లేదు. పుస్తకం యొక్క కోడ్ నంబరు వ్రాస్తే చాలు.

10) విజిటర్స్ బుక్, ఫీడ్ బ్యాంక్ కౌంటరు: ఈ కౌంటరు పేమెంట్ కౌంటరుకన్నా ముందే ఉండాలి. విశిష్ట వ్యక్తుల చేత విజిటర్స్ బుక్‌లో వ్రాయించాలి. సామాన్యుల చేత ఫీడ్ బ్యాంక్ పత్రంలో రిమార్కులు వ్రాయించాలి.

11) ఉచితంగా ఇచ్చే సాహిత్యం, పత్రికల కౌంటరు: ఇక్కడ సాహిత్యం, స్టిక్కర్లు, పాత పత్రికలు ఇవ్వబడతాయి.

12) హాలులోగైడ్ చేసే వ్యవస్థ: ఇక్కడ అధికశాతం మహిళలే ఉండాలి. కాని పుస్తకాలను గురించి అవగాహనగల వారై ఉండాలి. వారు దర్శకులకు పుస్తకాలపై ఆసక్తిని కలిగించాలి.

వనమూలికల కౌంటర్ దగ్గర ఎవరైనా డాక్టరునుకాని, వైద్యం తెలిసిన వారిని కాని ఉంచాలి. వారికి మందులను గురించిన అవగాహన కావాలి. మందులను ఎలా ఉపయోగించాలో, వైద్యం

ఏ దేశ భవిష్యత్తైనా యువతమీదే ఆధారపడి ఉంటుంది - స్వామి వివేకానంద.

గురించి ఏ పుస్తకంలో ఏముందో చెప్పగలిగినవారై ఉండాలి.

కార్యకర్తలు వచ్చినవారందరికి విషయజ్ఞానాన్ని కలుగచేస్తూ ఉండాలి. అందరు కూడ సంస్థను గురించి ఆకర్షణీయంగా చెప్పగలిగి ఉండాలి.

## 10. హాలు లోపల

ప్రదర్శన ప్రారంభానికి రెండు రోజులు ముందుగా ఒక కార్యకర్త మథుర నుండి వస్తాడు. అతను హాలు యొక్క పరిస్థితిని, దర్వాజాలను చూచి, దానికి అనుగుణంగా బల్లలు ఎలా వేయాలో, పుస్తకాలను ఎలా పేర్చాలో, వేదికను ఎలా నిర్మించాలో క్యాష్ కౌంటర్ ఎక్కడ ఉండాలో మొదలైనవాటికి మార్గదర్శనం చేస్తాడు.

బల్లల వ్యవస్థ ఎలా ఉంటుందంటే దర్శకులు లోపలకు వచ్చి ప్రదర్శన మొత్తం చూస్తారు. తరువాత పేమెంట్ కౌంటర్‌లో పేమెంట్ చేసి మరీ బయటకు వెళతారు. బయటకు వెళ్ళే దోవలోనే పేమెంట్ కౌంటర్లు ఉంటాయి. జనాన్ని బట్టి ఈ కౌంటర్ సంఖ్య పెంచడంగాని, తగ్గించడంగాని చేస్తారు. విజిటర్స్ వ్రాసిన అనుభూతులు, రిమార్కులు వార్తాపత్రికల్లో వేయడానికి వినియోగిస్తారు.

## 11. పుస్తకాలు - ప్రదర్శన

1) పుస్తకాలను గోడలపై వ్రేలాడదీయడంగాని, బీరువాలలో సర్దిపెట్టడంగాని చేయకూడదు. రాక్‌లలో పెట్టకూడదు. రైల్వేస్టాల్‌లో పెట్టినట్లు పేర్లు మాత్రమే కనిపించేలా ఒక దానిమీద ఒకటి పెట్టరాదు.

2) ప్రదర్శనలో 1.5' లేక 2' వెడల్పైన బల్లల మీద 2 వరుసల్లో పుస్తకాలను పెట్టాలి. రెండు వరుసల మధ్య 6 నుండి 8 అంగుళాలదూరం ఉండాలి. అట్లా అయితే వారికి అనుకూలంగా ఉంటుంది.

3) పట్టికలో అచ్చువేసిన క్రమంలోనే టేబుల్‌పైన సర్దాలి. పట్టికలో చూపించిన వర్గక్రమంలో వరుసలుగా సర్దిపెట్టాలి. వర్గాలను అనుసరించి చూడడానికి వీలుగా ఉంటుంది.

4) పుస్తకాలను టేబుల్ మీద తక్కువ సంఖ్యలోనే పెట్టాలి. మిగిలిన పుస్తకాలను అదే టేబుల్ క్రింద పెట్టుకోవాలి. టేబుల్ మీద పుస్తకాలు అమ్ముడు పోతున్న స్థితిని చూచి, క్రిందివి తీసి పైన పెట్టుకోవాలి.

5) హాలులో వెలుతురు బాగా ఉండాలి. తప్పనిసరిగా లైట్లు ఏర్పాటు చేసుకోవాలి. అవసరాన్ని బట్టి వాడుకోవడానికి జనరేటర్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి.

## 12. ఉద్ఘాటన - సమారోహ్

ప్రదర్శనను ప్రారంభించడానికి ముందురోజు మథుర నుండి ఒక ప్రముఖ కార్యకర్త వచ్చి ఏర్పాట్లను పరిశీలించి, సమీక్ష చేస్తారు. లోటుపాట్లు ఏవైనా ఉంటే సరిదిద్దుతారు. ఉద్ఘాటన సమయంలోకాని, ముందుగాగాని ప్రెస్ కాన్ఫెరెన్స్‌ను నిర్వహిస్తారు. ఆ సమావేశంలో పాత్రికేయులకు ముద్రించిన ప్రెస్ నోట్ ఇవ్వబడుడుతుంది. దాని ఆధారంగా సమాచారం ముద్రించబడుతుంది.

ఉద్ఘాటన 11 గంటలకుగాని, తరువాతగాని ప్రారంభించాలి. అంతకన్నా ముందు అయితే సర్దడం పూర్తిగా కాదు. ఉద్ఘాటనకు గాని, సమారోహ్‌కుగాని ఆహ్వానించబడిన పెద్దలకు ఒకరోజు ముందు గుర్తుచేయాలి. ఉద్ఘాటన సమయంలో ఫాదరీ, మౌలవీ, సిక్కు గురువు ఖాలసా మొదలైన విభిన్న ధర్మాచార్యులను పండితులను ఆహ్వానించాలి. ముఖ్య అతిథితో పాటు వారిచేత కూడ జ్యోతి ప్రజ్వలన చేయించాలి. దీని సౌకర్యం కోసం వత్తులు అధికంగా వేస్తే సరిపోతుంది. తలాఒకటి వెలిగించవచ్చు. ఈవిధంగా చేయిస్తే సమాజం మీద మంచి ప్రభావం పడుతుంది.

ఇతర దినాలలో ఆయా రోజులలో హాజరైన విశిష్ట వ్యక్తులతో జ్యోతి ప్రజ్వలన చేయించాల్సిన పనిలేదు. మొత్తం తిరిగి చూచిన తర్వాత వేదిక మీదకు తీసుకునిపోవాలి. దేవతల పటాలకు పుష్పాంజలి సమర్పణ చేయించాలి. రెండు నిమిషాలు సందేశం ఇవ్వాల్సిందిగా కోరాలి. ఆ సందేశాన్ని వేరే విజిటర్స్ బుక్‌లో వ్రాయించాలి. తర్వాత పత్రికలకు పంపవచ్చు. ప్రదర్శనకు సంబంధించిన కొన్ని ఫోటోలను తపోభూమి మథురకు పంపించాలి. అవి "యుగనిర్మాణయోజన"లో వేయబడతాయి.

## 13. ఆర్థిక సహకారం

ప్రదర్శనలో ముఖ్యంగా ప్రచార సామగ్రికి, ప్రసారం చేయడానికి, 10–12 రోజులు టెంటు వేయించడానికి ఎక్కువగా ఖర్చు వస్తుంది. అందువల్ల ప్రయత్న పూర్వకంగా తగిన దాతలను పట్టుకోవాలి. చాలా చోట్ల హాలు, కావలసిన ఫర్నీచర్ ఉచితంగా (అద్దెలేకుండా) ఇవ్వడం జరిగింది. ప్రయత్నం చేస్తే మంచి పనులకు ఆ మాత్రం సహాయం లభించి తీరుతుంది. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన అంశం ఏంటంటే ముహూర్తాలు

**శారీరక పుష్టిగలవాడే నిజమైన యువకుడు - స్వామి వివేకానంద.**

లేనిరోజులలో మాత్రమే ప్రదర్శన జరుపుకోవాలి. అప్పుడైతే హాలు ఫ్రీగా లభిస్తుంది. చాలా చోట్ల హోర్డింగ్స్, పాంప్లెట్స్, పోస్టర్లు మొదలైనవాటిని పెద్ద పెద్ద వ్యాపారస్థులకు అప్పచెప్పడం జరిగింది. వారికి కావలసిందల్లా క్రింద "సౌజన్యంతో" అని వ్రాయాలి. ఈవిధంగా కొన్ని బ్యాంకులు కూడా సహకరిస్తూ ఉన్నాయి. కొన్ని చోట్ల టి.వి. ఛానల్ వారు ప్రచార నిమిత్తం ఉచితంగానే ప్రసారం చేశారు. ఈ పని "వ్యాపార దృష్టితో కాదు, సమాజ కళ్యాణానికి" అని అర్థం చేయించడంలోనే ఫలితం ఇమిడి ఉంటుంది. ఆగ్రాలో కార్యకర్తలకు కాఫీ-టిఫిన్లు రోజుకు ఒకరు చొప్పున పరివార్ వారే పంపించేవారు. ప్రయత్నిస్తే ఇలాంటి సహాయాలు తప్పక లభిస్తాయి.

## 14. కూపన్ వ్యవస్థ

పుస్తక ప్రదర్శన గురించి కూపన్లు అమ్మడానికి కొన్ని పట్టణాలలో ప్రయోగం చేశారు. సఫలతను సాధించారు. దీని మాధ్యమంలో నూతన వ్యక్తులు కలుస్తారు. అనుకున్న విధంగా ధనం జమ అవుతుంది. కూపన్ వెలను నిర్ణయించేటప్పుడు కార్యకర్తలు బాగా ఆలోచించి నిర్ణయించాలి. వెల ఎక్కువగా ఉంటే కొద్దిమంది మాత్రమే చేరుతారు. తక్కువ ధర పెట్టినట్లైతే సామాన్యులు కూడా వచ్చి చేరుతారు. సామాన్య కార్యకర్తలకు కూడ తక్కువ వెలకూపన్లు అమ్మడానికి ఇవ్వవచ్చు. వారికి కూడ గురుదేవుల పనిచేసిన తృప్తి కలుగుతుంది. ఇప్పటివరకు చేసిన ప్రయోగాల్లో 50-100 రూపాయల కూపన్లు అమ్మబడ్డాయి.

ఒక్క విషయాన్ని గుర్తుంచుకోవాలి. దూరంగా ఉన్న కార్యకర్తలకు కూపన్లు ఇవ్వాల్సి వస్తే ముందుగా కొంత డబ్బు అడ్వాన్సు తీసుకోవాలి. లేకపోతే ప్రదర్శన పూర్తి అయిన తర్వాత కూపన్లు తిరిగి ఇచ్చే అవకాశం ఉంటుంది. మన లక్ష్యం నెరవేరదు.

## 15. సంచీ పుస్తకాలయం

బరోడాలో ఒక నూతన ప్రయోగం చేశారు. వారు ఒక వెయ్యి పచ్చ సంచీలను కుట్టించారు. వాటిపైన ప్రదర్శన తేదీ, స్థలం ముద్రించారు. వాటిలో 500 రూ॥ విలువ గల సాహిత్యాన్ని సర్దుకున్నారు. ప్రదర్శన $1\text{-}1^1/_2$ నెలలు ఉంది అనగానే కార్యకర్తలు భుజాలకు తగిలించుకున్నారు. ఆ సంచీ ఎక్కడకు వెళ్లినా కూడానే ఉండేది. కొంతలో కొంత బేరం కూడ చేసేవారు. దానితోపాటే పాంప్లెట్లు పంచారు. ప్రదర్శన గురించి ప్రచారం కూడ జరిగింది. క్రమంగా ఈ సంచుల సంఖ్య వెయ్యి నుండి 1800 వరకు పెరిగింది.

ఇక్కడ కూడ పుస్తకాల సంచీ ఇచ్చేటప్పుడు పుస్తకాల వెలను ముందుగానే తీసుకున్నారు. రెండవసారి 500 రూపాయలకు బదులు 400ల రూ॥లు లేక 300 రూ॥ల విలువ గల పుస్తకాలు పెట్టారు.

ఇప్పటివరకు దేశం మొత్తం మీద జరిగిన ప్రదర్శనలు అన్నీ విజయవంతం అయ్యాయి. అనేక మంది కార్యకర్తలు పుస్తక ప్రదర్శనలు జరిపి తీరాలన్న దృఢనిశ్చయంతో ఉన్నారు. పరమపూజ్య గురుదేవుల సంకల్పం సఫలం అవుతోంది.

*(ఫిబ్రవరి 2009 యుగ నిర్మాణ యోజన)*

★★★

### శ్రీ గాయత్రీ శతకం

10. *పాపపరిహారమును కోరి భక్తిమీర*
*దివ్యమంత్రమున్ జపియించ దీక్ష బూని*
*కరుణ జూపించి పాపమున్ కడిగివేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రివేదమాత*

**భావం:** వేదమాత గాయత్రి విశ్వానికే జనయిత్రి. చేసిన పాపం తెలుసుకుని పశ్చాత్తాపంతో గాయత్రీ మంత్రాన్ని దీక్షతో, భక్తితో జపిస్తే ఆ తల్లి కరుణించి పాపాన్ని తొలగిస్తుంది.

11. *ఆధిభౌతికదృష్టితో ఆత్మ నిల్పి*
*అధిక భక్తితో ఆ తల్లినాశ్రయింప*
*ఆయురారోగ్య భాగ్యాలనందజేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత గాయత్రి విశ్వానికే జనయిత్రి. ఆధ్యాత్మిక దృష్టితో, ఆత్మపూర్వకంగా, అత్యంత భక్తితో గాయత్రీ మాతను ఆశ్రయిస్తే ఆయుష్షును, ఆరోగ్యాన్ని, భాగ్యాన్ని తప్పకుండా అందచేస్తుంది.

రచన
సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

క్షాత్ర వీర్యం-బ్రహ్మతేజం కలవాడే నిజమైన యువకుడు - స్వామి వివేకానంద.

ధారావాహిక : భక్తిగాథ-22

# వ్రజ గోపికల సంపూర్ణశరణాగతి

"భగవంతుని స్మరణ హృదయం నుండీ కదలాలి. సమర్పణ సంపూర్ణమైన హృదయంతో జరిగినప్పుడే భక్తి ప్రకటితమౌతుంది" అని అఘోర ఋషి మాటల వల్ల ప్రతి ఒక్కరికీ అనుభవమైంది. అందరూ ఈ అనుభూతిని అనుభవిస్తున్నారు. హిమాలయ శ్వేత శిఖరాలపైన పక్షులు కిలకిలరావాలు ఒక మధుర సంగీతంలా వినిపిస్తూ ఉన్నాయి. ఈ మధుర సంగీతానికి తోడు హిమాలయంలోని జలపాతాల ధ్వని సంగీతం కూడ తోడయింది. శాంతంగా ఉన్న ప్రకృతి కూడ వాతవరణాన్ని అందంగా తీర్చిదిద్దడానికి సహకరించింది. నలువైపులా హార్షోల్లాసాలు ఉత్సాహంతోపాటు భక్తి యొక్క పవిత్రధార అందరి అంతరంగంలో ప్రవహిస్తోంది. అందరూ భావసమాధిలో లీనమయ్యారు. దేవల మహర్షి నెమ్మదిగా ఇలా అన్నారు. "ఇప్పుడు దేవర్షి తన తదుపరి భక్తి సూత్రాన్ని వివరించాలి."

శ్రీమన్నారాయణుని పాదపద్మాలనే ధ్యానం చేస్తున్న నారద మహర్షి మందహాసం చేశారు. దేన్నో వెదుకుతున్నట్లుగా అతని చూపులు అంతరిక్షం వైపు నిలిచాయి. దేన్నో జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్లుగా సూత్రాన్ని ఉచ్చరించారు–"యథా వ్రజ గోపికానామ్" (21). "వ్రజ గోపికల భక్తిలాగా" ఇలా ఉచ్చరించి దేవర్షి మరల భావ సమాధిలో లీనమయ్యారు. దేవర్షి స్మృతి సరోవరంలో వ్రజ భూమి యొక్క పావన స్మరణ, గోపికల సౌమ్యత, సుందరమూ, పావనమూ అయిన వారి వ్యక్తిత్వమూ, యశోదా నందుల జ్ఞాపకాలఅలలు కదలాడసాగాయి.

ఇంతలో బ్రహ్మర్షి క్రతువు "మీ స్మృతి రసాన్ని మమ్మల్ని కూడ పానం చేయనీయండి" అని అభ్యర్థించారు. నారద మహర్షి భగవన్నారాయణుని అనన్య భక్తుడనీ, భగవంతుడు భూమి మీద అవతరించిపుడల్లా నారదుడు ఆయనకు సమీపంలో ఉండేవారనీ, భగవంతుని లీలల యొక్క దుర్లభమైన భాండాగారం నారదుని వద్ద తప్ప వేరెవ్వరి వద్ద ఉండదనీ వారికి తెలుసు. భగవన్నారాయణుని అవతార లీలలలో శ్రీకృష్ణుని లీలాకథలు అద్భుతమైనవి. భక్తి యొక్క అన్ని రసాలు అందులో ఇమిడి ఉన్నాయి.

శ్రీకృష్ణుని లీలలలో వ్రజ గోపికల స్థానం విశిష్టమైంది. వ్రజ భూమిలోని ప్రతి ఇసుక రేణువు ఎంతో విశేషమైంది. దానికి అంతటి పవిత్రత కేవలం అచ్చటి గోపికల పాదస్పర్శ చేత కలిగింది. వారెప్పటికీ శ్రీకృష్ణుని వారే. వారికి ఇహ, పరాలూ, సుఖదుఃఖాలూ, లాభనష్టాలూ, కీర్తి–అపకీర్తులు వీటన్నిటికంటె ఇష్టుడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుని కొరకు వారు దేనినైనా ఇస్తారు. దేనినైనా త్యాగం చేస్తారు. అతని కోసం ఎన్ని కళంకాలనైనా సహిస్తారు. శ్రీకృష్ణుడు తప్ప వారికి ఇంకేమీ అవసరం లేదు.

ఇటువంటి ఆలోచనలో దేవర్షికి కొన్ని క్షణాలు గడిచాయి. క్రతు మహర్షి ఇంతవరకు వారి జవాబు కొరకు ఎదురుచూస్తున్నాడు. అందరిలో తెలుసుకోవాలన్న ఉత్సాహాన్ని చూచి దేవర్షి శాంతంగా ఇలా చెప్పారు. "వ్రజ గోపికల భక్తిని గురించి మనం మాటలలో చెప్పలేము. అనంతమైన వారి భక్తి భావన ముందు మాటలు చాలా అల్పమైనవి. వారి భక్తి భావనను వ్యక్తం చేయడానికి నేను చాలా విషయాల్లో సాక్షిని. వారి మధుర లీలలకు సాక్షిగా ఉన్న నేను ఒక్క విషయాన్ని వర్ణిస్తాను".

దేవర్షి చెప్పడం మొదలు పెట్టారు– "ద్వారకాధీశుడైన శ్రీకృష్ణ భగవానుడు ఒక రోజు తను ఏదో జబ్బుతో ఉన్నట్లుగా నటించాడు. ఆయనకు జబ్బుచేసిందన్న విషయం అంతటా వ్యాపించింది. దేవవైద్యులూ, రాజవైద్యులూ అందరూ వచ్చినాడిని పరీక్షించారు. జబ్బేమిటనేది ఎవరికీ తెలియలేదు. ప్రభువు నన్ను స్మరించారు. నేను వెంటనే వారిముందు నిలిచాను. చూస్తే ప్రభువు మంచం మీద పడుకున్నారు. నన్ను చూడగానే కొద్దిగా నవ్వి, మళ్ళీ యథాస్థితికి వచ్చారు.

ఆరోగ్యమే జీవనం - అనారోగ్యమే మరణం.

అంతర్యామి తన ఉద్దేశ్యాన్ని మనస్సుతోనే నాకు తెలియచేశాడు. తన భక్తులగర్వం అణచడానికి, భక్తి యొక్క రహస్యాన్ని గురించి తెలియచేయడానికి తను ఆడుతున్న నాటకమని నాకు అర్థమైంది.

"భగవంతుని మంచంవద్ద ఆయనరాణులు రుక్మిణి, సత్యభామ మొదలైనవారు, బంధు జనులు నిలబడి ఉన్నారు. నన్ను చూడగానే వారంతా "మీరు పరమజ్ఞానులు. ఈ జబ్బు నయమవడానికి ఏదైనా ఉపాయం సూచించండి" అని అడిగారు. నేను ఒకసారి శ్రీకృష్ణుని వైపు చూచి మనస్సులోనే నవ్వుకొని ఇలా అన్నాను– "ప్రభువు జబ్బు చాలా కఠినమైంది. కానీ నివారణ సులభమైందే. మీరు కోరుకుంటే నేను ఆ ఉపాయం చెపుతాను". అందరూ చెప్పండి "అది ఎంత కఠినమైనా మేము చేస్తాం" అన్నారు.

"కొంచెం సేపు ఆగి నేను వారితో ఇలా చెప్పాను. శ్రీకృష్ణుని భక్తులెవరైనా తమ పాద ధూళిని శ్రీకృష్ణుని నుదుట పెట్టినట్లయితే వారు వెంటనే ఆరోగ్యవంతులవుతారు, నా మాటలకు అందరూ ఆశ్చర్యపడి ఆలోచనలో మునిగిపోయారు. నేను రుక్మిణీదేవినీ, సత్యభామనూ, జాంబవతి మొదలైన వారందరినీ మీరెవరైనా ఇలా చేయగలరా? అని అడిగాను, నా మాటలకు వారు "శ్రీకృష్ణుడు మా భర్త, పైగా స్వయంగా పరాత్పరుడు. మా పాద ధూళి వారి నుదుట పెట్టితే మేమంతా నరకానికి పోతాం" అని బదులు చెప్పారు.

"అన్న బలరాముడుగానీ, ఇంకెవరైనా గురుజనులు కానీ చేయగలరా అంటే వారికీ నరకానికి పోతామన్న భయం. ఎవ్వరూ ముందుకు రాలేదు. ఇది ఒక పాపకర్మ అని అందరూ భయపడ్డారు".

చివరకు ప్రభు ప్రేరణ చేత వ్రజభూమి చేరి శ్రీకృష్ణుని జబ్బును గురించి చెప్పాను. నే నా మాటలు చెప్పగానే అందరూ తమ పాదధూళిని ఇవ్వడానికి సన్నద్ధులు అయ్యారు. అందరూ తమ పాదధూళిని ఒకపొట్లంలో కట్టి తీసుకొచ్చారు. నేను వారితో శ్రీకృష్ణుడు భగవంతుడు. మీ పాదధూళి ఇస్తే మీరంతా నరకానికి పోతారు అని చెప్పాను. అందరూ గట్టిగా "మా శ్రీకృష్ణుని కొరకు మేము ఎల్లప్పుడూ నరకంలోనే ఉండాలన్నా ఉంటాము" అన్నారు. నేను నిరుత్తరుడినై ద్వారకా నగరానికెళ్ళి జరిగిన విషయమంతా వారికి చెప్పాను. అదంతా విని శ్రీకృష్ణుడు నవ్వి ఇలా అన్నాడు– "నారదా! భక్తి అంటే ఇదే. భక్తులు అంటే వీరే. నేను సదా వీరికి వశ్యుడనై ఉంటాను". ప్రభువు యొక్క ఈ మాటలకు అందరూ మౌనం వహించారు. ఎవరి ఆలోచనల్లో వారు మునిగిపోయారు.

అనువాదం – కె. అరవిందమ్మ

★★★

## చిలుక పలుకులు అంటే? – ఇలాగే ఉంటాయి.

*పెంపుడు చిలకను ఎవరో పంజరంతో సహా ఒక సన్యాసి ఆశ్రమానికి చేర్చారు. సన్యాసి దానికి మోక్ష మార్గాన్ని చెప్పాడు. ఒక కొత్త వాక్యాన్ని గుర్తుండేలా చెప్పాడు – 'పంజరాన్ని విడువు, పైకి ఎగురు'. చిలుక ఆ మాటలను వల్లెవేసింది*

*ఒకరోజు పంజరం తెరిచి ఉంది. చిలుక పంజరం నుండి తల బయటపెట్టి వల్లె వేసిన పదాలను చెబుతోంది. –'పంజరం విడువు – పైకి ఎగురు'. ఎవరైనా వస్తే మూలకు నక్కి కూర్చుంటుంది.*

*ఆశ్రమవాసులు కుతూహలంగా దానిని చూస్తున్నారు. తలుపు తెరిచే ఉంది. మరి అది ఎందుకు ఎగిరిపోవడం లేదు? మంత్రం గుర్తుంది. మరి ఎందుకు ఎగరదు? వచ్చిన వారిని చూసి, అంది పంజరం మూల ఎందుకు నక్కి ఉంటుంది? వింతగా నవ్వుకుంటున్నారు.*

*నవ్వుతున్న ఆశ్రమవాసులు కుతూహలాన్ని చూసి దానికి సమాధానంగా సన్యాసి ఇలా చెప్పాడు – 'మనలో చాలా మంది ఇలా చిలుక వల్లెవేసినట్లు వల్లెవేసే వారే ఉన్నారు. భక్తిద్వారాలు తెరుచుకున్నా బంధనాల నుండి బయటపడే ప్రయత్నం చేయరు. పైగా – అలా ప్రయత్నించకపోవడమే ధార్మికత అనే భ్రమను వ్యాపింపజేస్తూ ఉంటారు.*

**ఆసక్తి – ఓర్పు – దృఢ సంకల్పం ఉంటే ఏ పని అయినా సాధించవచ్చు.**

# సుకుమార శరీరం - విచిత్రమైన విద్యుత్ కేంద్రం

మానవశరీరంలో అద్భుతమైన విషయాలు ఎన్నో ఉన్నాయి. యోగుల వల్ల ఇవి ప్రత్యక్షంగా మనకు తెలుస్తూ ఉంటాయి. కానీ సామాన్య మానవుల్లో కూడ అకస్మాత్తుగా ఈ అలౌకిక ప్రతిభ గోచరిస్తూ ఉంటుంది. ఈ అసాధారణమైన ప్రతిభ శరీరంలో విద్యుత్‌శక్తి రూపంలో కనిపిస్తుంది. సుకుమారమైన ఈ శరీరంలోనికి ఇంతటి ప్రచండమైన శక్తి ఎక్కడ నుండి వస్తున్నది? అదీకాకుండా ఇంకా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ శక్తి వల్ల శరీరంలోని కోమలమైన న్యూరాన్స్ నాడులు, హర్మోన్సు మొదలైన వాటికి ఏవిధమైన హానీ కలుగదు. అందువల్లే భాగవతంలో మానవ శరీరాన్ని బ్రహ్మాండం యొక్క ప్రతీకగా అనగా మాక్రోకాస్మ్ యొక్క మైక్రోకాస్మ్‌గా చెప్పబడింది.

1890లో ఫ్రాన్స్‌లో లూయిస్ హైంబర్‌గర్ అనే యువకుడు ఉదయాన్నే లేచి తనదుకాణం చేరుకున్నాడు. వెళ్ళగానే అక్కడి దృశ్యాన్ని చూచి ఆశ్చర్యపోయాడు. అతను రాగానే స్విచ్ ఆన్ చేయకుండానే కొన్ని మిషన్లు పనిచేయడం ప్రారంభించాయి. అతను మిషన్ దగ్గరకు వెళ్ళగానే టేబుల్ మీదున్న చిన్న చిన్న ప్లైయిర్, స్క్రూడ్రైవర్ మొదలైన ఇనప వస్తువులు చేతులకు అతుక్కుపోతున్నాయి. కష్టపడి వాటిని తొలగించుకున్నాడు. పేపర్‌కు పిన్ చేద్దామని గుండు సూదులున్న డబ్బా తెరిచేసరికి గుండుసూదులన్నీ అతని వ్రేళ్ళకు అంటుకుపోయాయి. పిన్నుల్ని వదిలించుకునే ప్రయత్నం చేశాడు. ఒకదానికొకటి అతుక్కుని ఒక మాలలాగ తయారయ్యాయి.

ఈ సంఘటనలోని వాస్తవాన్ని తెలుసుకోవడానికి మేరీలాండ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, బాల్టిమోర్‌లోని వైజ్ఞానికులు వచ్చారు. శరీరంలోని విద్యుత్తే కారణమని తెలుసుకున్నారు. వారికి శరీరంలోని ఈ అద్భుత జీవ విద్యుత్ గురించి స్పష్టమైన జవాబు దొరకలేదు. సైన్సులో ఇటువంటి వాటిని సరిగ్గా వ్యాఖ్యానించలేదు. బహుశా సూక్ష్మ శరీరంలోని ఒక శక్తి స్థూలశరీరంలో నుండి బయటపడి ఈ రూపంలో ప్రవేశించి ఉండవచ్చు.

ఇలాంటిదే ఇంకొక సంఘటన 1846లో ఫ్రాన్స్‌లో జరిగింది. 14 సంవత్సరాల బాలిక ఎగ్లిక్‌కాటన్ తన ఫాక్టరీలో పనిచేస్తోంది. ఉన్నట్లుండి అక్కడ ఏదో గొడవ మొదలైంది. ఆమె రాగానే ఇనుప వస్తువులన్నీ క్రింద పడడం ప్రారంభించాయి. ఈ విధమైన ఆకర్షణ ఇతర వస్తువులలో కూడ జరిగింది. ఆమె వంట గదిలోకి వెళ్ళింది. అక్కడి సామాన్లన్నీ కదలడం ప్రారంభించాయి. కుర్చీ మీద కూర్చుందామనుకుంటే కుర్చీ జరిగిపోయింది. పరుపు మీద పడుకోవాలంటే అది విపరీతంగా కదిలిపోతోంది. ఈవిధంగా పదిరోజులు జరిగింది. ఈ పదిరోజులు ఆమె జీవితమంతా అస్తవ్యస్తమైపోయింది. ఈ పరిస్థితిని గురించి పారిస్ అకాడమీ ఆఫ్ సైన్స్ నుండి విశేషజ్ఞులు వచ్చి ఎంతో సూక్ష్మంగా అధ్యయనం చేశారు. కానీ ఏవిధమైన సమాధానం లభ్యం కాలేదు. పది, పదిహేను రోజుల తర్వాత పరిస్థితి తనంతట తానే సర్దుకుంది.

1879లో లండన్‌లోని 19సం॥ల బాలిక కెరోమిన్ క్లియర్ నెర్వస్ సిస్టమ్‌లోని ఏదో వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకుంటుంది. ఒక రోజు ఆమె శరీరంలో ఆశ్చర్యకరమైన పరివర్తన కలిగింది. ధాతు వస్తువులు ఏవైనా సరే పిన్నులు, చెంచాలు, మేకులు, పాత్రలు అన్నీ ఆమెకు అతుక్కుపోయాయి. అతి కష్టం మీద వాటిని విడిపించాల్సివచ్చింది. 1920లో న్యూయార్క్‌లో ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురయింది. తెలీకుండా కొందరు విషపూరిత భోజనం చేశారు. ఈవిధమైన భోజనం చేసిన చాలా మందిలో బయోఎలిక్ట్రిసిటీ పెరిగింది. గుండుపిన్నులు మొదలైన వస్తువులన్నీ వారి శరీరాల ద్వారా ఆకర్షింపబడ్డాయి. వారు కంపాస్‌లోని సూదిని సూదంటురాయిలాగ గిరగిర త్రిప్పసాగారు.

1973లో ఇంకొక సంఘటన. లండన్‌లో సోఫియా అనే మహిళ టి.వి. సెట్ దగ్గరకొచ్చేసరికి టి.వి. కదలడం మొదలు పెట్టింది. టి.వి.లో పిక్చర్ రావడం ఆగిపోయింది. రేడియో దగ్గరకు వెళ్తే అక్కడా ఇదే పరిస్థితి. ఆమె టి.వి.కి రేడియోకు దూరంగా వెళ్ళినప్పుడు పరికరాలు యధావిధిగా పని చేశాయి. ఈ ఘటన వల్ల మానవునిలో జీవ విద్యుత్ ఉన్నదనీ, దానితోనే జీవితం నడుస్తున్నదనీ తెలుస్తోంది. ఐతే ఈ విద్యుత్ ప్రవాహం స్థాయిని మించినప్పుడు పైన చెప్పిన ఘటనలు జరుగుతుండేవి.

జీవవిద్యుత్తు యోగభాషలో ప్రాణమని పిలువబడుతుంది. ఈ ప్రాణం యౌగికసాధనల ద్వారా పెరుగుతూఉంటుంది. అందువల్లనే కొన్ని విశిష్టసాధనలు చేస్తున్నప్పుడు ఇతరులను స్పర్శించనివ్వరు. అపాత్రుడు, అయోగ్యుడు అయిన వ్యక్తి

**మతాలు చూపించే మార్గాలు వేరైనా లక్ష్యం ఒక్కటే.**

స్పర్శించినప్పుడు యోగులకు ఏవిధమైన హాని జరుగదు. స్పర్శించిన వ్యక్తి ప్రాణ ప్రవాహంలో ప్రమాదం ఉత్పన్నమౌతుంది. ఇటువంటి ఒక సంఘటన జరిగింది. స్వామి వివేకనందులవారు ధ్యానం చేసుకుంటున్నారు. అటువంటి సమయంలో వారి దేహమందు ప్రచండమైన ప్రాణ ప్రవాహం ప్రవహిస్తూ ఉంటుంది. ఒకరోజు వారు ధ్యాన సమయంలో ఉన్నప్పుడు జిజ్ఞాశువైన స్వామి అబేధానందతో తనను స్పర్శిస్తూ ఉండుమని చెప్పారు. స్వామీ అబేధానంద అలాగే చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రామకృష్ణ పరమహంస చాలా వ్యాకుల పడ్డారు. అబేధానంద ప్రాణిక ప్రకృతిలో చాలా మార్పు వచ్చింది. అది కూడ అనుకూలమైంది కాదు. అబేధానందులకు ప్రాణాంతకమయ్యింది. జీవ శక్తి యొక్క ప్రచండ ప్రవాహం యొక్క శక్తి అమోఘమైనది.

ఎలక్ట్రిసిటీ అనగా జీవ శక్తి సంబంధమైన ఈ ఘటన గురు, శిష్య సంబంధాలకు కూడ ఆధారమవుతుంది. గురువు తన శిష్యునిలోని ఈ జీవశక్తితో నిత్యనూతన ప్రయోగం చేస్తారు. రామకృష్ణ పరమహంస స్వామి వివేకానందుని ఛాతీ మీద కాలితో ఒక తన్ను తన్నినపుడు వివేకానందునికి అంతటా పరబ్రహ్మదర్శనం కలిగింది. ఆయనకు బస్సు, కారు, గోడ, భోజనం, దుస్తులు మొదలైన అన్నింటిలోనూ ఆ బ్రహ్మ సాక్షాత్కారమే కలిగింది. ఇది ఘనమైన ప్రాణ ప్రవాహం యొక్క అద్వితీయ ఘటన. ఇది అత్యంత దుర్లభమైంది. ఇచ్చట రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద ఇద్దరూ సమర్థులే. అందువల్లే ఈ ప్రక్రియ సంభవమైంది.

మానవుడు తన జీవశక్తిని విరివిగా ఉపయోగిస్తాడు. జపము, ధ్యానము, సాధన మొదలైన వాటిచేత శక్తిని పొందగలం. కాని వ్యక్తి కోరిక, క్రోధము ఇటువంటివి కలిగి ఉంటే ప్రాణమనే పూలమొక్క మాడిపోతుంది. కామవాసన, భోగేచ్ఛ మొదలైన వాటి వల్ల ప్రాణం హోళీలాగా జ్వలిస్తుంది. ఈ ప్రాణాన్ని సంయమంతో పొందగలిగితే అద్భుతమైన ఆశ్చర్యజనకమైన పనులు జరుగుతాయి. ప్రాణం కారణంగానే ఆకర్షణ కలుగుతుంది. ప్రాణవంతులైన వారు ఎన్నో ఆశ్చర్యకరమైన పనులు చేయగలరు. శ్రేష్ఠకార్యాలు చేయడానికి మనశరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవాలి. గాయత్రీమంత్రం మొదలైన మంత్రజపంవల్ల ప్రాణమనే ఖజానాను నిత్యం అభివృద్ధి చేసుకోవాలి.

అనువాదం – కె. అరవిందమ్మ

★★★

## ఆలోచనలో మార్పు - ఫలితం

*శ్రావణ పూర్ణిమ రాత్రి ప్రకాశిస్తున్న చంద్రుడిని చూసి వశిష్ఠ మహర్షి తన భార్య అరుంధతితో 'ప్రియా! ఈనాడు చంద్రుడు విశ్వామిత్రుడు తపస్సు లాగా వెలిగిపోతున్నాడు' అన్నాడు. వశిష్ఠుడు విశ్వామిత్రుని ప్రశంసించడం విని అరుంధతి బాధపడింది. మమత, జాలి అనేది లేకుండా తమ నూరుగురు పుత్రులను చంపినవాని ప్రశంసను వినలేక వ్యంగ్యంగా "మరి అలా అయితే మీరు ఆయనను బ్రహ్మర్షి అని ఎందుకు పిలవరు? ఆయన రోషాన్ని ఎందుకు రెచ్చగొడుతున్నారు?" అని అడిగింది.*

*వశిష్ఠుడు గంభీరంగా మారిపోయాడు. "ప్రియా! సద్గుణాలను ముక్తకంఠంతో ప్రశంసించడం మన కర్తవ్యం. అతనిలో ఉన్న దోషం ఒక్కటే. అదే అహంకారం. అహంకారంతో ఈర్ష్య, ద్వేషం, క్రోధం, ఉద్విగ్నత ఉత్పన్నమవుతాయి. వాటివల్ల ప్రేరేపింపబడిన వ్యక్తి చెడ్డపనులు చేయడం ప్రారంభిస్తాడు. స్వచ్ఛమైన విశ్వామిత్రుని తపస్సు అహంకార రహితంగా ఉండి ఉంటే ఈనాడు అతడు ప్రపంచంలో మహాపురుషుడయి ఉండేవాడు."*

*విశ్వామిత్రుడు ఆ కుటీరం వెనుక దాగి ఉన్నాడు. ఆయన వశిష్ఠుని తనను బ్రహర్షి అని పిలవకపోతే ఆయనను చంపాలని అనుకుంటున్నాడు. తన దోషాలను గురించి కాక, గుణాల గురించే అతడు ఆలోచిస్తున్నాడు. అహంకారం అతనిలో బ్రహ్మర్షి కావాలనే ఉద్విగ్నతను పెంచింది.*

*అరుంధతి, వశిష్ఠుల సంవాదం విన్న తరువాత విశ్వామిత్రుడు గ్రహించాడు – ద్వేషంవల్ల కాక, న్యాయంవల్ల ప్రేరితుడై వశిష్ఠుడు తనను బ్రహర్షిగా ప్రకటించలేదని, దుర్భావనలతో ఆలోచించినంతవరకు వశిష్ఠుడు ఆయనకు నిందించేవాడుగా, శత్రువుగా కనపడ్డాడు. తాత్త్విక దృష్టితో ఆలోచించినపుడు వాస్తవాన్ని అర్థం చేసుకోవడానికి ఆయనకు ఎంతో సమయం పట్టలేదు. విశ్వామిత్రుని దృష్టిలో వశిష్ఠుడు న్యాయదృష్టిగల కర్తవ్యనిష్ఠాపరుడుగా, సజ్జనుడుగా, స్నేహితుడుగా మారాడు. ఆలోచించే పద్ధతి మారగానే, అంతా చక్కబడింది.*

*ఆత్మ పరీక్షలో అహంకారం తొలగింది. అహంకారం తొలగితే ద్వేషం, క్రోధం ఉండవు. అనుచిత వరాన్ని తిరస్కరించిన వశిష్ఠుడు విశ్వామిత్రునికి శత్రువుగాగాక మిత్రుడుగా కనిపించాడు. ఆయన ఎక్కువసేపు దాగి ఉండలేకపోయాడు. కుటీరం వెనుక నుండి బయటకు వచ్చి, వశిష్ఠ మహర్షి పాదాలమీద పడి, క్షమాపణ కోరాడు. వశిష్ఠుడు 'బ్రహ్మర్షీ' అని పిలిచి అతనిని తన హృదయానికి హత్తుకున్నాడు. అహంకారం తొలగిపోయిన తరువాత ఇక నికృష్టత ఎక్కడ ఉంటుంది? విశ్వామిత్రుడు ఆంతరంగికంగా మారిన తరువాత ఇక ఆయన బాహ్యస్థాయి మారడానికి కష్టమేముంది? ద్వేషంతో, దర్పంతో అతను కోరుకున్నది లభించలేదు. హృదయపరివర్తన జరిగిన వెంటనే బాధలన్నీ తొలగిపోయాయి. వశిష్ఠుడు ద్వారా ప్రకటించబడి, విశ్వామిత్రుడు సర్వత్రా బ్రహర్షిగా పిలువబడ్డాడు.*

**సుస్థిర జీవనానికి ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లే మతం.**

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-36

# దివ్యజ్ఞానం-మనం నడచుకోవాల్సిన విధానం

దివ్యజ్ఞానం అంటే భగవంతుని అద్భుతశక్తిగా విశ్వసించడం ఒక్కటే కాదు. భగవంతుని ఆలోచనలను మన ఆలోచనలుగా భావించి నడుచుకోవడమే. మన నడవడిక, సరైన పద్ధతిలో, మంచి మార్గంలోకి మలచుకోవాలి. మనం గుడికి వెళ్ళకపోయినా, భగవంతుని నమ్మి, ఆయన చూపిన మంచిదారిలో, మంచి ఆలోచనలతో నడచుకొంటే, మనం నిజమైన భక్తులమే అనవచ్చు. దివ్యజ్ఞానాన్ని ప్రతి ఇంటికీ అందించడానికి వివిధ కార్యక్రమాలు చేపట్టబడ్డాయి.

1) ప్రతి ఇంటిలో దేవతా ప్రతిష్ఠ: గాయత్రీ మాత పటాన్ని ప్రతిఇంటిలోనూ దేవప్రతిష్ఠ పేరుతో పూజించటం.

2) మంత్రజపం, మంత్రలేఖనం: ఏ మతానికి చెందినవారైనా వారివారి పద్ధతులలో మంత్రజపం, మంత్రలేఖనం విధిగా చేసే ఏర్పాటు.

3) బలి వైశ్వ యజ్ఞం: ప్రతిరోజూ అగ్నిదేవునికి అయిదు ఆహుతులు ఇవ్వడం. మనం తినే ఆహారాన్నే అగ్నికి ఆహుతి ఇవ్వడం.

4) జ్ఞానమందిరం స్థాపన: ఇంటింటా మత ధర్మాలకు సంబంధించిన పుస్తకాలు ఉంచి, ప్రతిరోజూ వాటిని పఠించేటట్లు ఏర్పాటు చేయడం.

5) శ్రీరామ్ ఝోలా పుస్తకాలయం: ప్రతి కార్యకర్త తన సంచిలో మంచి మంచి ఆలోచనలను ప్రబోధించే పుస్తకాలను తీసికొని పోయి ప్రజలలో గురుదేవుల ఆలోచనలు ప్రచారం జేయటం.

6) జ్ఞానరథం: పసుపు పచ్చని రంగు బండిలో గురుదేవుల పుస్తకాలను విక్రయానికి ఏర్పాట్లు చేయటం.

7) సంస్కార పరంపరలు: సాంప్రదాయకమైన సంస్కారాలను ప్రోత్సహించడం-పుంసవనం, నామకరణం, జన్మదినాలు జరుపుకోవటం, వివాహాలు, షష్టిపూర్తి, వానప్రస్థ స్వీకరణ మొదలగు సంస్కారాలను ప్రోత్సహించడం.

8) యజ్ఞం, మత సంబంధమైన కార్యక్రమాలు: యజ్ఞం అంటే సమిష్టి ప్రార్థన. యజ్ఞం ద్వారా దివ్య వాతావరణాన్ని ఏర్పరచడం, పండుగలు జరిపించడం మొదలగు కార్యక్రమాల ద్వారా ఆదర్శములను ప్రచారం చేయడం.

9) తులసి స్థాపన: ప్రతి ఇంటిలో తులసి మొక్కను పెంచడం, పూజించటం ద్వారా, వాతావరణాన్ని శుద్ధి జేయడం, వ్యాధులను నివారించడంలో తులసి ప్రాధాన్యాన్ని తెలియజెప్పడం.

10) ఆహారం, నీరు, స్నానం: ప్రతివ్యక్తీ భోజనానికి ముందు మూడు సార్లు గాయత్రీ మంత్రం చదివించే ఏర్పాట్లు చేయడం. నీరు త్రాగేటప్పుడు పవిత్ర గంగాజలం త్రాగుతున్నామని భావించడం. స్నానం జేసేటప్పుడు పవిత్రమైన గంగానదిలో స్నానం చేస్తున్నామని భావించడం. దాంతో స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు శుద్ధిగాబడుతున్నవని భావించడం.

## ఆరోగ్య ఉద్యమం

1) సరైన ఆహారం తీసికోనందునా, సరైన అలవాట్లు లేనందునా, వ్యాధులు రావడానికి అవకాశం ఏర్పడుతుంది. ఆరోగ్యానికి మంచి అలవాట్లు, మంచి ఆహారం ఉండాలని ప్రచారం జేయాలి. సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామం కార్యక్రమాలు ప్రచారం చేయాలి. మొలకెత్తిన విత్తనాలు, కాయగూరలను వాటి తోలు తీయకుండా వండడం ప్రతికాలంలోనూ వచ్చే ఆయా పండ్లు తినడం, పచ్చి కూరలు తినడం మొ॥ ప్రచారం చేయాలి. బిగువైన వస్త్రాలు ధరించడం వల్ల, సౌందర్య సాధనాల వల్ల, ఆభరణాలు ధరించడం వల్ల కూడా ఆరోగ్యానికి హాని జరిగే ప్రమాదం ఉంది. ఆయుర్వేద ఔషధాలు రోగాలను బాగా నివారిస్తాయి. "ఆయుర్వేద ఔషధాల ద్వారా ఆరోగ్య పరిరక్షణ" అనే పుస్తకం చదివితే, చాలా మేలుగల్గుతుంది. ఈ ఔషధాలు శాంతికుంజ్‌లోనూ, గాయత్రీ సంస్థలలోనూ దొరుకుతాయి.

2) **పుస్తకమాల:** ఆరోగ్య పరిరక్షణకు, మంచి పుస్తకాలు తయారు చేయబడ్డాయి. ప్రతి జబ్బుకూ చికిత్స దొరుకుతుంది.

**ఇతరులకు ఆదర్శంగా ప్రవర్తించేవాడే మనిషి.**

ఈ పుస్తకాలు 'యుగనిర్మాణ యోజన' పేరున మథురలో తయారైనాయి. జ్ఞాన మందిరాల ద్వారా, కార్యకర్తలు ఈ పుస్తకాలను ప్రచారం చేయాలి.

3) మనస్సుకు ఆరోగ్యం: దేహంలో మనస్సు ప్రధాన భాగం. ప్రతిరోజూ మంచి పుస్తకాలు చదవడం, సత్సంగం ద్వారా మనస్సును శుద్ధి చేయవచ్చు. శరీరాన్ని ప్రతిరోజు శుభ్రపరుస్తున్నట్లే, మనస్సునూ శుభ్రం చేయాలి. మంచి ఆలోచనలతోనూ, కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలను నిరోధించడంతోనూ మంచి గ్రంథాలు పఠించడం ద్వారానూ, ధ్యానంతోనూ ఇది సాధ్యం. మనస్సు సరిగా లేకపోతే రకరకాల వ్యాధులు వస్తాయి. మొదట మనస్సులో ప్రారంభమైన జబ్బు శరీరానికి ప్రాకుతుంది. ఇది నిజం. అందుకే ముందు మనస్సును శుభ్రపరచాలి.

4) ఆత్మిక ఆరోగ్యం: పూజలతో, ఆత్మని సక్రమంగా ఉంచుకోవచ్చు. భగవంతుని స్వరూపమైన ఆత్మ ఎప్పుడూ శుభ్రంగా ఉంటుంది. వాతావరణంలోని మాలిన్యాలు ఆత్మను కప్పివేస్తాయి. అందుకే పూజ, ధ్యానం ద్వారా ఆత్మను శుద్ధిచేసుకోవాలి.

## నారీజాగరణ ఉద్యమం

స్త్రీ దేవతా స్వరూపిణి. మామూలుగా అందరిలోనూ లోపాలు ఉంటాయి. ఏ తప్పు చేయనివాడు భగవంతుడు మాత్రమే. ప్రతి స్త్రీ జీవితంలో కుమార్తెగాను, సోదరిగాను, భార్యగాను, తల్లిగాను పాత్రపోషిస్తూ ఉంటుంది. మగవాడు తన సామర్థ్యంతో అనేక రంగాలలో ముందు ఉండవచ్చు. కాని ఆధ్యాత్మిక రంగంలో అతను స్త్రీ వెనకే నిలబడవలసి ఉంటుంది. స్త్రీ స్వభావ సిద్ధంగా సున్నిత మనస్కురాలు. గృహనిర్వహణా, కాన్పులూ మొదలైన బాధ్యతల వల్ల ఆమె బలహీనురాలుగా కన్పించవచ్చు. కాని ఆమెలో భగవంతుడు మెచ్చే ఆధ్యాత్మిక శక్తి అనంతంగా ఉంటుంది. రాబోయే కాలంలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. పరిపాలనా వ్యవస్థ, మతం, ఆర్థిక లావాదేవీలు సమాజంలో అన్నింటా సంస్కరణలు, దానికి అనుకూలంగా మార్పు చేయబడతాయి. ఈ పరిస్థితులలో ప్రతి స్త్రీ ఒక ప్రత్యేక విధి నిర్వహణ చేయవలసి ఉంటుంది. మనకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే నారీ జాగరణ కార్యక్రమాలు అనివార్యం.

1) యుగనిర్మాణ మహిళా మండలులను ఏర్పరచడం తప్పనిసరి అవుతుంది.

2) యుగనిర్మాణ యోజన, యుగశక్తి గాయత్రి, అఖండజ్యోతి, యుగ సాహిత్యం స్త్రీలను ఆకర్షిస్తాయి. వారికి ఎప్పటికప్పుడు ఈ సాహిత్యం అందుబాటులో ఉంటే, వారికి ఉత్సాహం కల్గుతుంది. కొద్ది సమయంలోనే వారు మహిళా మండలుల అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. కాబట్టి పట్టణాలలోని చదువుకున్న యువతుల పేర్లు సమీకరించి సాయంత్రం వేళల్లో వారిని కలసి సంస్థ కార్యక్రమాలను వివరించాలి. వారికి యుగ సాహిత్యాన్ని అందజేసి, వారు చదివిన తర్వాత ఆ సాహిత్యాన్ని తిరిగి తీసుకోవచ్చు. దీనివల్ల వారికి డబ్బు ఖర్చు ఉండదు. సాహిత్య ప్రచారం జరుగుతుంది. క్రొత్త వాతావరణం ఏర్పడుతుంది.

3) ప్రతి వారమూ సత్సంగం జరిగే ఏర్పాటు చేయాలి. ఆ సమయంలో భగవంతుని గూర్చి గ్రంథాలు చదవడం, చర్చ, చేయవచ్చు.

4) మూఢనమ్మకాలు, చెడు అలవాట్లు దేశ సమాజాన్ని క్రుంగదీస్తున్నాయి. వీటివల్ల స్త్రీలు చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. కాబట్టి ఆ చెడు అలవాట్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. స్త్రీల ఉన్నతికి తీసికోవలసిన విధానాలు, మన చదువులో భాగం కావాలి. ప్రస్తుత విద్యావిధానంలో స్త్రీకి నిజ జీవితంలో కావలసిన విద్య అందటం లేదు. స్త్రీలు కూడా ఆధ్యాత్మిక కర్మకాండలు – పుంసవనం, పుట్టు వెంట్రుకలు, అన్నప్రాశన, మొ॥నవి నేర్చుకొని, వాటిని అమలుచేయాలి. వీటివల్ల ఆయా కుటుంబాల్లో క్రొత్తక్రొత్త ఆలోచనలు ప్రారంభం అవుతాయి. క్రొత్త ఒరవడి ప్రారంభం అవుతుంది.

5) పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవ సమయంలో స్త్రీలు వెళ్ళి వారిని అభినందిస్తే వారు ఆయా వ్యక్తులకు దగ్గరవుతారు.

6) స్త్రీల అభివృద్ధికి ఆటంకాలు కల్గించడం, ఘోషా పద్ధతి మొదలగు వాటి నిర్మూలనకు కృషి జరగాలి.

7) స్త్రీలకు గృహ నిర్వహణలో కొంత వెసులుబాటు కల్గిస్తే, వారు సాంఘిక కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనడానికి

**పేదలకు, బలహీనులకు మార్గదర్శనం చేయడం యువతరం కర్తవ్యం.**

వీలవుతుంది.

8) స్త్రీల అభ్యుదయాన్ని కోరేవారు, స్త్రీల బంధనాలను తొలగించాలని కోరేవారు, దేశజనాభాలో సగంమంది ఉన్న స్త్రీల మనస్సులో జాగృతి కలగాలని కోరేవారు. ముందుగా తమ తమ గృహాల్లోనే మొదలుపెట్టాలి. తమ గృహ వాతావరణంలో మార్పు తీసుకొనిరావాలి. స్త్రీలను పై కార్యక్రమాలు చేపట్టే విధంగా ఉత్సాహపరచాలి.

9) స్త్రీలలో విద్యా వ్యాప్తి జరగాలంటే సాయం సమయాల్లో గాని, రాత్రివేళల్లో గాని చదువుకున్న స్త్రీలు చదువురాని స్త్రీలకు చదువుచెప్పాలి.

## సత్ప్రవృత్తి సంవర్ధన, దుష్ప్రవృత్తి నిర్మూలన ఉద్యమం

ప్రతి మనిషిలోనూ దేవ, అసుర ప్రవృత్తులు రెండూ ఉంటాయి. మంచీ, చెడూ రెండూ ప్రక్కప్రక్కనే ఉంటాయి. పరిస్థితులను బట్టి ఈ ప్రవృత్తులు అభివృద్ధి చెందుతూ ఉంటాయి. మంచి వాతావరణంలో దేవప్రవృత్తి అభివృద్ధి అవుతుంది. అదే చెడు వాతావరణంలో అసుర ప్రవృత్తి పెరిగిపోతుంది.

1) మేధావులూ, సంఘ సేవకులూ మంచి వాతావరణాన్ని తయారు చేయడానికి, మానవుని ఉన్నతికీ తమ వంతు కృషి చేయాలి. మానవులను గౌరవప్రదమైన వ్యక్తులుగా తీర్చిదిద్దాలి.

2) మంచిని గౌరవించడానికి చెడును నిర్మూలించడానికి ప్రయత్నాలు చేయాలి.

3) మంచి నడవడిక గల్గిన పిల్లలను ఉత్సాహపరచాలి. ప్రేమపూర్వక పురస్కారాలు అందించాలి. చెడు నడత కల్గిన వారిని సరి అయిన మార్గంలో పెట్టాలి. అటువంటి వారికి అవసరమైనంత దండన, సహాయ నిరాకరణ సందర్భాన్ని బట్టి చేయాలి. తాము చెడుచేస్తే ఇంటిలోని వారి ఆగ్రహానికి గురి అవుతామనే విషయాన్ని వారు గుర్తించేలాగా చేయగల్గాలి.

4) ఆదర్శంగా జీవించేవారిని కూడా మనం ప్రతిరోజూ కలుస్తూ ఉండాలి. కాని వారికి గుర్తింపు లేకపోవచ్చు. అది వారి బీదరికం మూలంగా కావచ్చు. ఇటువంటి వ్యక్తులు తారసపడితే, వారిని ప్రోత్సహించాలి. ఇటువంటివారు మరణించిన దినాన, వారి ఛాయాచిత్రాలకు నివాళులు అర్పించాలి. వారి గుర్తుగా మొక్కలను నాటాలి. వారి జీవిత కథలను ప్రజలందరికి తెలియజేయాలి. దానివల్ల ప్రజలలో నుండి కొందరైనా వారిలాగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తారు.

5) మన జీవితాల్లో జరిగిన పొరపాట్లకు, చెడునడతకూ పశ్చాత్తాపపడాలి. మనసు మనం శుద్ధిపరచుకోడానికి మహామంత్రం "ప్రతి ఉదయం క్రొత్త జన్మ, ప్రతిరాత్రి ఒక మరణం". ప్రతి రోజూ మన పనులను జాగ్రత్తగా మలచుకోవాలి. ప్రతిరాత్రి నిద్రించడానికి ముందు ఆ రోజు చేసిన చెడ్డపనులు గూర్చి పశ్చాత్తాపపడాలి. మనని మనం శిక్షించుకోవాలి. లెంపలు వేసికొని, గుంజిళ్ళు తీసి, మనం తినే ఆహారం తగ్గించిగాని, కొంచెం సమయం నిలబడికాని శిక్షించుకోవాలి. ఈ రకంగా చేస్తూ ఉంటే కొంతకాలానికి తప్పులు చేయడం మానేస్తాం. ప్రతిరోజూ లేవగానే మన జీవిత కాలం ఈ రోజు మాత్రమే అనుకొని, ఆ రోజు పనులను నిర్ణయించుకోవాలి. ఇలా కొంత కాలం గడిస్తే మన జీవన విధానంలో తప్పకుండా మంచి మార్పు వస్తుంది.

6) గృహ జీవితాన్ని మంచిగా మలచుకోడానికి ప్రయత్నం జరగాలి. భార్యా బిడ్డలపై తగిన ప్రేమ, ఆదరణ చూపాలి. గృహంలో ఉండే పెద్దలపైనా, బాలబాలికలపైనా తగిన శ్రద్ధ చూపాలి. వారి అవసరాలు తీర్చాలి. అదే సమయంలో, గృహంలోని ఏ సభ్యుడూ చెడుమార్గాన పయనించకుండా గమనిస్తూ ఉండాలి. ఈ విధానం తగినంత సున్నితంగా, ఆదరణపూర్వకంగా జరగాలి.

7) ఇంటిలోని వృద్ధుల యెడల గౌరవంగా ప్రవర్తించాలి. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. వారి అవసరాలను తగినంత ఆదరణతో తీర్చాలి. వారి శేష జీవితం సుఖప్రదంగా జరిగేలా చూడాలి. మనం కూడా వృద్ధులమవుతామనే విషయాన్ని మరువరాదు.

8) మగ, ఆడా అనే తేడా ఉండరాదు. వితంతు వివాహాలను ప్రోత్సహించాలి.

9) చెడు అలవాట్లు, చెడు ప్రవర్తనలు, చెడు ఆలోచనలపై సహాయనిరాకరణ అనే యుద్ధం ప్రకటించాలి.

★★★

**ప్రపంచ శాంతిని కోరుకునేవాడే ప్రజ్ఞావంతుడు.**

తత్వ చింతన

# ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి

శరీరంలో అన్నింటికంటే ముఖ్యమైంది గుండె. రక్త ప్రసారానికి, ప్రాణ సంచారానికి ఇది కేంద్రం. వేదాంత వేత్తల దృష్టిలో ఈ కేంద్రం భావాలకు నిలయంగాను, అంతఃకరణగాను, కారణ శరీరంగాను ఇంకా అనేక రకాల పేర్లతో చెప్పబడింది. భావన, శ్రద్ధ, ప్రేరణ, సాహసం, ఆత్మీయత, ఆదర్శం వంటి తత్వాలు దీని నుండి పుట్టుకొస్తాయి. మానవుడు తాను మహామానవుడుగా వికసించాలన్న ఆలోచన ఇక్కడి నుండే మొదలైంది. దీనికి విరుద్ధంగా అవినీతి, అవాంఛనీయత, అధికారవాంఛ మొదలైనవి ప్రారంభం అయితే ఆ మనిషి రాక్షసుని వలె ప్రవర్తించే స్థాయికి దిగజారిపోతాడు. భావాలు సానుభూతి తరంగాలు అంతరంగం నుండే వికసిస్తాయి. చిన్న విత్తనం నుండి పుట్టిన మర్రిచెట్టు వలె భగవంతుడు తనను ఆశ్రయించిన ప్రతి జీవినీ తనలో లీనం చేసుకుంటాడు.

యోగశాస్త్రంలోని హృదయస్థానాన్ని అనాహత చక్రం అన్నారు. క్రింది నుండి పైకి వెళితే మూలాధారచక్రం, స్వాధిష్ఠాన చక్రం, మణిపూరక చక్రాల తర్వాత ఈ అనాహత చక్రం ఉంటుంది. తపస్సు, స్వాధ్యాయాల ద్వారా ఈ చక్రాలు పైకి ఎత్తబడతాయి. దానివలన ప్రాణశక్తికి ఉన్నత గతి లభిస్తుంది. అప్పుడే సాధకుడు పశువృత్తిని వీడి, పరమేశ్వరుని చేరుకోవాలని ఆలోచిస్తాడు. ఆత్మోన్నతి మార్గంలోనే పయనించాలని ప్రయత్నిస్తాడు. కాని ఆ మార్గం అంత సులువైనది కాదు. గుణము, కర్మ, స్వభావాలను సంస్కరించడానికి, మనస్సులోని మాలిన్యాన్ని కడిగి వేసుకోవడానికి మెట్లు కనిపిస్తాయి. వాటిని ఎక్కుతూ పోతే హృదయంలోని చిక్కుముడులు విడిలిపోతాయి. అప్పుడే మానవుడు దేవత అవగలుగుతాడు. అతనినే దేవమానవుడు, మహామానవుడు అంటారు. బుద్ధత్వాన్ని సాధించాలన్నా, నారాయణ తత్వాన్ని చేరుకోవాలన్నా అసలైన రాజమార్గం ఇదే. అంతరంగంలో అంతులేని కోరికలు, వాటిని తీర్చుకునే నిమిత్తం చెడు ఆలోచనలు, నన్ను మించినవారు లేరు అన్న అహంభావం ఉన్నంతవరకు మానవుడు నీచస్థితి నుండి పైకి లేవలేడు. పరమార్థం గురించి ఆలోచించలేడు. ఈశ్వరునిపై ప్రేమ, ఉన్నతమైన ఆదర్శాలు మనస్సులో మెదిలినప్పుడు తప్పనిసరిగా పరివర్తన జరుగుతుంది. అప్పుడే ఆతని హృదయంలోని చిక్కుముడులు విడిలిపోతాయి. హృదయగత మార్గం తెరుచుకుంటుంది.

'అష్టావక్రగీతం' లోని అష్టాదశప్రకరణంలో 88వ శ్లోకం ఈ విషయాన్నే తెలియచేస్తుంది. "హృదయ గ్రంథి విడిపోయి, అహంభావం పరమాత్మ భావంలో లీనమైపోయిననాడు మానవుడు రజస్తమో గుణాల నుండి ముక్తుడు అవుతాడు. ఆత్మలోనే ఆనందాన్ని అనుభవిస్తాడు''. అని అష్టావక్రుడు జనక మహారాజుకు బోధిస్తాడు. భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు తాను భక్తుల హృదయక్షేత్రంలో నివసిస్తానని అర్జునునితో చెపుతాడు. (18–61)

ప్రఖ్యాత దార్శనికుడు, జ్యోతిర్విదుడు అయిన 'యజ్ఞీపా' జీవాత్మ యొక్క కేంద్రం అయిన హృదయాన్ని సృష్టికేంద్రంతో పోల్చి చెప్పాడు. దానిలో సౌరమండలానికి చెందిన సమస్త గ్రహాలు తమ సూర్యుని చుట్టూనూ, విశ్వ బ్రహ్మాండము యొక్క మహా సూర్యుని చుట్టూనూ తిరుగుతూ ఉంటాయని తెలిపారు. దాని ఫలితంగా సంకల్పాలకు స్థానం అయిన హృదయంలోనే విశ్వబ్రహ్మాండానికి సంఘటనలు, మనకు తెలియని ప్రకృతి రహస్యాలు, భూత భవిష్యత్తులకు చెందిన జ్ఞానం ఏర్పడుతుంది. దీనిని బట్టి సమస్త సృష్టి కూడ సూక్ష్మరూపంలో హృదయంలోనే నిండి ఉంటుందని తెలుస్తోంది. కనుక జీవాత్మకు, పరమాత్మకు సమానత్వాన్ని చెప్పడం జరిగింది. రెండింటి సమానతకు, కలయికకు స్థానం హృదయమే. మొత్తం ప్రపంచానికే కేంద్ర స్థానం హృదయం. అందువల్లనే అన్ని మతాలవారు, అన్ని ధర్మాలు కూడ హృదయ పవిత్రతకు ప్రథమ స్థానాన్ని ఇవ్వడం జరిగింది. హృదయ గుహలో ప్రవేశించిన వ్యక్తి ఉన్నతుడై ఆధ్యాత్మిక రంగంలో ఉన్నత స్థితికి చేరుకోగలుగుతాడు.

*అనువాదం – కె.బి.సోమయాజులు*

★★★

**శత్రువు క్షేమాన్ని కోరి పని చేయాల్సిన సమయం కూడ వస్తుంది.**

ధారావాహిక: దివ్యజీవన దర్శనం-65

# భవిత కోసం ప్రతీక్ష-2

## గడ్డు రోజులు

1945 మే నెలలో రెండవ ప్రపంచ యుద్ధం సమాప్తమయింది. ఆ తర్వాత సుమారు ఏడాదిపాటు దేశంలో అనేక తుఫానులు చెలరేగాయి. బ్రిటన్‌లో లేబర్ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వం భారతదేశపు పరిస్థితిని గుర్తించింది. భారతదేశం నుండి తన పాలనను తొలగించాలని నిర్ణయించుకున్నది. ముస్లిం లీగ్ నాయకుడు మహమ్మదాలీ జిన్నా మొండిపట్టుదల వల్ల సిమ్లా సంభాషణ విఫలమయింది. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ముస్లింలీగ్ సభ్యుల సంఖ్య సగం కన్న హెచ్చుగా ఉండాలని ఆయన పట్టుపట్టారు.

గత రెండు మూడు సంవత్సరాలలో దేశ రాజకీయాలు మలుపు తిరిగాయి. ఫలితంగా దేశ విభజన దాదాపు ఖాయం అయింది. సిమ్లా సంభాషణల వైఫల్యం దేశ విభజనను మరింతగా ఖరారు చేసింది. మతపరమైన ఉద్రిక్తత తీవ్రతరం అవుతూ వచ్చింది. ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన పరిస్థితులు, బ్రిటిష్ వారి రాజకీయ ఎత్తుగడలు, అధికారాన్ని పంచుకోవడంలో పోటీ, మొదలైన పరిణామాలన్నీ ప్రజలలో తీవ్రమైన క్రోధాన్ని, అసంతృప్తినీ కలిగించాయి. చిన్న చిన్న కారణాలే హింసాకాండకు దారితీసేటంతగా పరిస్థితి విషమించింది. చిన్న సాకు దొరికితే చాలు జనం వీధుల్లోకి వస్తున్నారు. హింసకు దిగుతున్నారు. 1946 తొలి నెలలలో ఆజాద్ హింద్ ఫౌజ్‌కు చెందిన ఒక ముస్లిం ఆఫీసరు కోర్ట్ మార్షల్ చేయబడ్డాడు. సైనిక న్యాయస్థానం అతడికి శిక్ష విధించింది. ఈ శిక్షను నిరసిస్తూ కలకత్తాలోని ముస్లింలు ఊరేగింపు జరిపారు. కొద్ది దూరం సాగిన తర్వాత, ఆ ఊరేగింపు హింసాత్మకంగా మారింది. పెక్కు దుకాణాలు లూటీ చేయబడ్డాయి. ట్రామ్‌లు తగులబెట్టబడ్డాయి. హింసకు దిగిన గుంపు కొందరి ప్రాణాలు తీసింది.

రక్షణ వ్యవస్థలో సహాయ నిరాకరణ జరిగిన సంఘటనలు అనేకం వెలికివచ్చాయి. పోలీసు శాఖలో కూడ అసంతృప్తి పెరుగసాగింది. బొంబాయిలో నౌకాదళ సిబ్బంది సమ్మె చేశారు. ఈ విషయ పరిణామాలకు ప్రపంచ యుద్ధం కారణమని గాంధీజీ చెప్పారు. యుద్ధం తర్వాత సమాజంలో కొంతకాలంపాటు నైతికత దెబ్బతినే అవకాశం, విశృంఖలత్వం విలయ తాండవం చేసే అవకాశం పూర్తిగా ఉంటాయి. అంతేకాదు హిందువులకూ, ముస్లింలకూ మధ్యగల దూరాన్ని పెంచడానికి రకరకాల కుట్రలు జరుగుతూ వచ్చాయి. 1946 మార్చి నెలలో బ్రిటిష్ ప్రభుత్వపు మంత్రుల బృందం (కేబినెట్ మిషన్) భారతదేశానికి వచ్చింది. ముగ్గురు కేబినెట్ మంత్రులతో కూడిన ఆ బృందం సుమారు నాలుగు నెలలపాటు సుమారు 500 మంది నాయకులతో సంభాషణలు జరిపింది.

భారత్‌కు స్వరాజ్యం ఇవ్వడానికీ, దానితోపాటు ప్రభుత్వ స్వరూపాన్ని నిర్ణయించడానికీ పూర్వరంగాన్ని నిర్మాణం చేయడం ఈ సంభాషణల వెనుక ఉన్న లక్ష్యం. 1946 మే నెలలో కేబినెట్ మిషన్ ఒక పథకాన్ని ప్రతిపాదించింది. దాని ప్రకారం భారత్‌లో యూనియన్ ప్రభుత్వం ఏర్పడాలి; స్వదేశ సంస్థానాల, రాష్ట్రాల ప్రతినిధులతో ఏర్పడే యూనియన్ ప్రభుత్వానికి విదేశీ వ్యవహారాలు, రక్షణ, ఆంతరిక వ్యవస్థ, రవాణా అనే బాధ్యతలు ఉండాలి; ఇతర విషయాలన్నింటినీ రాష్ట్రాల శాసన సభలు చూచుకోవాలి.

కేబినెట్ మిషన్ రూపొందించిన పథకాన్ని అన్ని పార్టీలూ, సంస్థానాలూ ఆమోదించాయి. ముస్లిం లీగ్ ఆలోచన మాత్రం వేరుగా ఉంది. అది దేశ విభజనను కోరుతూ వచ్చింది. ఆ పార్టీ మే నెలలో కేబినెట్ మిషన్ పథకాన్ని ఆమోదించింది. అయితే పదివారాల తర్వాత అది తన ఆమోదాన్ని ఉపసంహరించుకున్నది. పాకిస్తాన్ కోసం ప్రత్యక్ష చర్య జరుపుతానని ఆ పార్టీ ప్రకటించింది. ఈ ప్రకటనతో దేశంలో విద్వేషం, ఉద్రిక్తత, హింసల విస్ఫోటనం జరిగింది. సమాజంలో ఆవేశకావేశాల దావానలం విజృంభించింది.

అట్టుడికి పోతున్న ఈ వాతావరణంలో కర్తవ్యాన్ని నిర్ణయించడానికై శ్రీరామ్ మథురలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విద్వాంసులనూ, పండితులనూ, సామాజిక కార్యకర్తలనూ ఆ సమావేశానికి ఆహ్వానించారు. వారి గృహాలకు వెళ్లి స్వయంగా వారిని ఆహ్వానించారు. ప్రత్యక్ష చర్య ప్రకటన జరిగిన 12 రోజుల తర్వాత ఘియామండీలోని శ్రీరామ్ నివాసంలో ఏడుగురు మత

శత్రువులు మిత్రులుగా మారేవరకు ప్రేమించడం నేర్చుకో.

నాయకులు సమావేశం అయినారు. వారిలో ముగ్గురు హిందువులు, ఇద్దరు ముస్లింలు, ఒకరు క్రైస్తవుడు, ఒకరు సిక్కు. హిందువులలో ఒకరు ఆర్యసమాజ్‌కు చెందిన వ్యక్తి.

ఛత్తా బజార్‌లోని మసీదు ఇమామ్ అయిన సలీమ్ మహమ్మద్ సమావేశానికి అధ్యక్షత వహించవలసిందిగా కోరబడ్డారు. ఆయన మౌలానా ఫారూక్ వైపు చూచారు. అధ్యక్షత వహించవలసిందిగా ఒకరిని మరొకరు కోరుతూ వచ్చారు. చివరకు ఆర్యసమాజ్‌కు చెందిన ద్వారక్‌బాబుపై అందరి దృష్టి లగ్నమయింది. సమావేశంలో దిగువ నిర్ణయాలు తీసుకోబడ్డాయి.

రాజకీయవాదులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినప్పటికీ, శాంతియుత వాతావరణాన్ని నిలిపి ఉంచవలసిందిగా మనం మన మతానికి చెందిన ప్రజలకు నచ్చజెప్పాలి. పూజ, ప్రార్థన, నమాజుల తర్వాత తమ తమ మత గ్రంథాలలోని భాగాలను చదివి వినిపించాలి. శాంతి, ప్రేమ, సోదరత్వాలను బోధించే భాగాలను ఎంపిక చేయాలి. తమ ఇంటిలో, ఆఫీసులో, దుకాణంలో ఇతర మతస్థులు కనీసం ఒకరిని నియమించాలి. ఉదాహరణకు హిందూ మత నాయకులు ముస్లింలకూ, ముస్లిం నాయకులు హిందువులకూ తమ వద్ద ఉపాధి కల్పించాలి.

'అబ్దుల్ మీ వద్ద మొదటి నుంచీ పనిచేస్తున్నాడు కదా. కనుక మీరు మరొకరిని పనిలోకి తీసుకునే అవసరంలేదు' అని ద్వారక్ బాబు శ్రీరామ్‌తో అన్నారు. శ్రీరామ్ ఇలా వెల్లడించారు. 'ఇతర మతాల పరిచయాన్నీ, సందేశాలను మా పత్రికలో ప్రచురించాలని మేము నిర్ణయించుకున్నాము.

మత సామరస్యాన్ని ప్రబోధించే సాహిత్యాన్ని ప్రచురించాలనే తమ నిర్ణయాన్ని కూడ శ్రీరామ్ తెలిపారు. అందుకోసం సమావేశంలో పాల్గొన్న విద్వాంసుల సహకారాన్ని కోరారు. సమావేశంలో మరో ముఖ్య నిర్ణయం తీసుకున్నారు. మత ఘర్షణలు జరగకుండా ఉంటే మరీ మంచిది. ఒకవేళ జరిగితే సమావేశంలో పాల్గొన్న ప్రతిఒక్కరూ ఎలాంటి భేదభావం లేకుండా ఘర్షణలో చిక్కుకున్నవారిని కాపాడాలి. చిక్కుకున్న వ్యక్తి పర మతానికి చెందినవాడయితే అతడిని రక్షించడానికై ఘర్షణకారులతో తలపడాలి. అందువల్ల ఘర్షణకు గురయిన ప్రజల మనోబలం ఇనుమడిస్తుంది.

పరిస్థితినిబట్టి, అవసరాన్నిబట్టి వివిధ మతాల వారి మధ్య ఐకమత్యాన్ని పెంచడానికి కృషిచేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. ఒకరి ఉత్సవాలలో మరొకరు పాల్గొనడం, ఒకరు మరొకరి మత సంస్థలకు సేవ చేయడం, మరమ్మత్తులు చేయడం, ఒకరి ఇంటిలో జరిగే కార్యక్రమాలలో మరొకరు పాల్గొనడం ఇవి ఆ కృషిలో అంతర్భాగాలు కావాలి. సాధారణంగా ప్రజలు ఒకరి కష్ట సుఖాలలో మరొకరు పాలుపంచుకుంటూనే ఉంటారు. గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయ పార్టీలు పంచిన విషం కారణంగా ఈ భాగస్వామ్యం కొంత తగ్గింది. ఈ దూరాన్ని తగ్గించాలని సమావేశంలో పాల్గొన్న మత నాయకులు నిర్ణయించారు.

★★★

## ధ్యేయం ఒక్కటే - అవగాహనలోనే లోపం ఉంది.

*ఒక విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులకు వారి ఉత్కృష్ట శీల, సత్ప్రవర్తనలకు సన్మానం జరిగింది. ముగ్గురినీ సమానంగా పంచుకోమని ఒకే నాణెం ఇవ్వడం జరిగింది.*

*వారిలో ఒకడు భారతీయుడు, రెండవవాడు పార్శీ, మూడవవాడు ఆంగ్లేయుడు. వారికి ఒకరి భాష ఒకరికి అర్థం కాదు. అందువలన ఆ నాణాన్ని పంచుకోవడం సమస్యగా మారింది. ఆంగ్లేయ బాలుడు తన భాషలో 'నాకు నా భాగంగా వాటర్ మెలన్ కావాలి' అని అడిగాడు. పార్శీ వాడు తన భాషలో 'నాకు హిందువానా కావాలి' అని, భారతీయ బాలుడు నాకు తర్బూజా కావాలని అడిగారు. సమస్య పెద్దదయింది. వివాదం పరిష్కారం కాలేదు.*

*చివరికి ముగ్గురూ కలిసి మూడు భాషలూ బాగా తెలిసిన వ్యక్తి దగ్గరకు వెళ్ళారు. ముగ్గురూ తమ తమ భాషలలో తమ కోరికను చెప్పారు. ఆ వ్యక్తి ఆ నాణాన్ని తన చేతిలోకి తీసుకొని బజారు నుండి ఒక పెద్ద తర్బూజా పండు తెప్పించి మూడు సమాన భాగాలుగా చేశాడు. ముందుగా ఆంగ్ల విద్యార్థిని పిలిచి ఒక ముక్క ఇస్తూ ఇదిగో నీ వాటర్ మిలన్ అని చెప్పాడు. ఇదేవిధంగా మిగతా ఇద్దరినీ పిలిచి వారి వారి భాషలలో పార్శీకి హిందువానా, భారతీయుడికి తర్బూజా ఒక్కొక్క ముక్క ఇచ్చి పంపించాడు. ముగ్గురూ బయట కలిసినపుడు ముగ్గురి కోరిక ఒకటేనని, ఒకే వస్తువు కోసం ఇంతసేపు పోట్లాడుకున్నామని అర్థం చేసుకున్నారు.*

*ప్రపంచ స్థితి కూడా ఇలాగే ఉంది. అందరి ధ్యేయం ఒకటే. అయితే భాష, జాతి, దేశాల భేద భావాల కారణంగా పరస్పరం పోట్లాడుకుంటున్నారు.*

**ఏ విషయాన్ని అయినా పూర్తిగా తెలుసు అనుకోవడం అవివేకం.**

ప్రత్యేక వ్యాసం

# మహాతపస్వి పరమపూజ్య గురుదేవులు- మహామనస్విని వందనీయ మాతాజీ

## (08-09-09 మాతాజీ జయంతి-16-09-09 గురూజీ జయంతి సందర్భంగా)

### మహా తపస్వి గురూజీ

పరమపూజ్య గురుదేవులు మథుర నుండి హరిద్వార్ వెళ్లి ఉండడానికి నిశ్చయించుకున్నారు. హరిద్వార్‌లో ఉన్న పరిజనులకు ఆత్మవిద్యను బోధించాలన్న సంకల్పం వారిని అక్కడకు నడిపించింది. పనికిమాలిన భ్రాంతులతో పడి కొట్టుమిట్టాడుతున్న పరిజనులకు ఆత్మ జ్ఞానాన్ని అందించాలి అనుకున్నారు. లోక కల్యాణం కొరకు స్థాన పరివర్తన తప్పనిసరి అయింది. "నేను చివరి శ్వాస ఆడినంతవరకు మానవ కళ్యాణానికే పాటుపడతాను'' అన్న గట్టి సంకల్పం తీసుకుని మరీ బయలుదేరారు. "భవిష్యత్తులో నేను తలపెట్టిన తపస్సు ప్రజల ఆలోచనల్లో మార్పు తేవడానికీ మాతాజీని హరిద్వార్‌లోనే ఉంచి వెళ్లాల్సి ఉంటుంది. ఆమె నా ప్రతినిధిగా అక్కడి వ్యవహారాలు చూచుకుంటారు" అంటూ 1971 జూన్ 17 నుండి 20 వరకు మథురలో గొప్ప వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. తమకు ప్రియాతి ప్రియమైన గురుదేవులు, మాతాజీ ఇరువురు మథుర విడిచిపోవడం అక్కడ ప్రజలు తట్టుకోలేకపోయారు. అందరి నేత్రాలు చెరువులే అయ్యాయి. జన్మ జన్మాంతర బంధం వల్ల ఒకే దారానికి గుచ్చబడిన ఆత్మలు విలవిల లాడాయి. అయినా "ఉజ్జ్వల భవిష్యత్తు" అనే ఆశ గురు శిష్యులను అందరిని కట్టిపడేసింది.

ఇక్కడి నుండి సంస్థలో రెండవ అధ్యాయం ప్రారంభం అయింది. గురుదేవులతో, మాతాజీతో పరిచయం ఉన్నవారికి పెద్దగా చెప్పాల్సిన అవసరం లేదు. కాని దూరం నుండి శాంతికుంజ్‌ను గూర్చి విని, ఊహించుకుంటున్నవారికి తప్పనిసరిగా గతాన్ని గురించి తెలియడం అవసరం. అందుకే 1991 నుండి ప్రారంభించడం జరిగింది. ఇప్పటిలాగా అప్పుడు శాంతికుంజ్ సకల సౌకర్యాలతో తులతూగడం లేదు. పనిపాటలను చూచుకోవడానికి ఇద్దరు మహిళలను, 12-14 సంవత్సరాల వయస్సుగల నలుగురు కన్యలను, తమను తాము అర్పించుకున్న కార్యకర్తలు శ్రీరామచంద్రసింహ్, శ్రీ బలరామ్‌లను మాతాజీకి అప్పగించారు. దాదా గురుదేవుల ఆజ్ఞను శిరసావహించి కఠినతరమైన తపస్సు చేయడానికి హిమాలయాలకు వెళ్ళిపోయారు.

### మహామనస్విని మాతాజీ

మహాతపస్వి అయిన గురుదేవులకు మహా మనస్విని అయిన మాతాజీ అర్థాంగిగా లభించారు. అమె గురుదేవుల చేయిపట్టి నడిచి వచ్చిన నాటి నుండి గురుదేవులు తలపెట్టిన మహా ఉద్యమానికి తనను తాను అర్పించుకున్నారు. వయస్సు చిన్నది. బాధ్యతలు బరువైనవి. అయినా అన్నింటినీ ఓర్పుతో, నేర్పుతో నిర్వహించేవారు. వచ్చీపోయే పరిజనులకు భోజన సదుపాయాలు, పత్రికా నిర్వహణ, పుస్తకాల ప్రచురణలు, లేఖలకు జవాబులు వ్రాయడం, వైద్యం కొరకు వచ్చి పోయే రోగుల పరామర్శ, కుటుంబ సభ్యుల మంచిచెడులు, పిల్లల ఆలన-పాలన మొదలైన అనేక బాధ్యతలను ఆనందంగా నిర్వహించేవారు. 1943 నుండి 1971వరకు చిరునవ్వు చెదరకుండా ఏవిధంగా ఈ బాధ్యతలను నెట్టుకవచ్చారో ఊహించలేం. సరే అది ఒక పర్వం.

1971లో అప్పుడప్పుడే తప్పటడుగులు వేస్తున్న శాంతికుంజ్‌ను మాతాజీకి అప్పగించి గురుదేవులు హిమాలయాలకు వెళ్ళిపోయారు. అఖండజ్యోతి సంస్థాన్ అస్తవ్యస్తంగా నడిబజారులో ఒంటరిగా నిలబడి ఉంది. సహాయకుల సంఖ్య చాలా తక్కువ. 12-14 సంవత్సరాల కన్యల చేత అఖండ దీపం సమ్ముఖములో 24 లక్షల జపంతో 24 అనుష్ఠానాలు చేయించాలి. కుటుంబాలను వదలివచ్చిన బాలికలకు మాతృప్రేమను పంచిపెట్టాలి. పరిపూర్ణమైన కుటుంబాన్ని వదిలి వచ్చారు. 20 రోజుల క్రితమే కుమార్తె శైలబాల పెండ్లిచేసుకుని అత్తవారింటికి వెళ్ళింది. భర్తగారు జూన్ 30వ తేదీన హిమాలయాలకు వెళ్ళడానికి ఏర్పాట్లు చూచుకుంటున్నారు. శాంతికుంజ్‌కు చుట్టుప్రక్కల అంతా నిర్జన ప్రదేశం. హరిద్వార్‌కు, ఋషికేశ్‌కు మధ్య ప్రయాణ సౌకర్యాలు అంతగాలేవు. సప్తఋషి ఆశ్రమం శాంతికుంజ్ యొక్క ముఖద్వారం తూర్పు ముఖంగా ఉంది. అందువల్ల చతుర్ధామాలకు వెళ్ళే దోవ దీనికి పూర్తిగా వేరుగా ఉంది. ఉదయం బయలుదేరి

ఎలాంటి కష్టాన్నైనా నవ్వుతూనే ఎదుర్కోవాలి.

వెళ్ళి, సాయంకాలానికి తిరిగివచ్చే ఒకే ఒక బస్సు ఉంది. ఆ బస్సు శాంతికుంజ్ దగ్గర కొద్దిసేపు ఆగివెళ్ళేది. హరిద్వార్‌తో ఉన్న సంబంధం ఇంతమాత్రమే. రాత్రి అయిందంటే భయంకరమైన నిశ్శబ్దం. నాలుగు వైపులాదట్టమైన చెట్లు, అప్పుడప్పుడు ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని వచ్చే శబ్దాలు నిద్రా భంగం చేసేవి.

హరిద్వార్, ఋషికేశ్, శాంతికుంజ్‌ల మధ్యనున్న రోడ్డు 6-7 సంవత్సరాల తరువాత వేయడం జరిగింది. తరువాతనే విద్యుత్ వ్యవస్థ చేయబడింది. గంగ ఒడ్డు ప్రదేశం కావడాన వృక్ష సంపద అధికంగా ఉండేది. అందువల్ల చలి చాలా ఎక్కువగా ఉండేది. తరువాత తరువాత గంగానది మీద వంతెన కట్టారు. నీటిపైపులు వచ్చాయి. ఈ పనులన్నింటికోసం చెట్లను నరికి వేయడం జరిగింది. మెల్లమెల్లగా శాంతికుంజ్ శాంతికి నిలయంగా మారింది. క్రమంగా గాయత్రీ నగరం ఏర్పడింది. దానినే గాయత్రీ తీర్థం అంటారు. అయితే ఇదంతా జరిగేసరికి కొన్ని సంవత్సరాల కాలం పట్టింది. మొదట్లో శాంతికుంజ్‌కు వచ్చిపోయే సాధకుల సంఖ్య అసలు లేనట్లే చెప్పుకోవాలి.

మాతాజీ తనతో పాటు ఉంటున్న కన్యలను పోషించడమే కాదు, కార్యాలయంలో కూర్చుని వచ్చిన లేఖలకు సమాధానాలు వ్రాసే వారు. అప్పుడప్పుడు భూమి విషయాలు, బేంకు విషయాలు చూచుకునేందుకు సిటీ బస్సులో నగరానికి వెళ్ళి వచ్చేవారు. మెల్లగా నారీజాగరణ కార్యక్రమాలు చేపట్టారు. పనిఒత్తిడి పెరిగిన కారణంగా రెండు ఎంబాసిడర్ కార్లు కొనాల్సి వచ్చింది. ఈ వ్యవస్థను శ్రీ బలరాంజీ చూసుకునేవారు. ఈనాడు మనం ఏదన్నా చేయగలుగుతున్నాం అంటే అది గురుదేవుల ద్వారా మాతాజీ, మాతాజీ ద్వారా మనం నేర్చుకున్నవే! అనేకమైన సాధక బాధకాలను తట్టుకుంటూ మాతాజీ చిన్నారి శాంతికుంజ్‌ను పెంచి పెద్ద చేశారు.

క్రమంగా కన్యల సంఖ్య 4 నుండి 24కు పెరిగింది. వీరంతా అఖండ దీపం దగ్గర కూర్చుని 24 గంటలు పగలు-రాత్రి అన్న తేడా లేకుండా అఖండ జపం చేస్తూ ఉంటారు. ఈ అఖండ దీపాన్ని పరమపూజ్య గురుదేవులు 1926లో స్వహస్తాలతో వెలిగించారు. దానిని ఈ కన్యలు వంతులవారిగా కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారు. వీరు కార్యకర్తలందరికీ పుత్రికా సమానులే. మొదట్లో పుష్ప, ఆదర్శ, కమల, వసంత, నిర్మల, రేణుక, సరోజ, సుధ, ఊర్మిళ అనే 9 మంది బాలికలు ఉండేవారు. వీరంతా భారతదేశం నలుమూలలా నుండి వచ్చిన కార్యకర్తలకుమార్తెలే.

వందనీయ మాతాజీతో కలసి ఉదయం, సాయంత్రం హారతిలో పాల్గొనేవారు. మాతాజీవారికి వండి వడ్డించడమేకాకుండా సంగీతం, ఉపన్యాసం చెప్పడం, యోగవ్యాయామం ఆటలు మొదలైనవన్నీ నేర్పించేవారు. వారికి సరియైన సమయసారిణి ఇచ్చి, ఆవిధంగా నడుచుకునేలా చూసుకునేవారు. అప్పుడప్పుడు విహార యాత్రకు తీసుకునివెళ్ళేవారు. ఇవన్నీ నిర్వహించడమే కాకుండా మాతాజీ వ్యక్తిగతంగా తెల్లవారుజామున 3 గంటలకు నిద్రలేచేవారు. అన్ని పనులు చూచుకుంటూనే తాను కూడా జపసాధన చేసుకునేవారు.

ఈవిధంగా మాతాజీ యంత్రంలాగా పనులను చేస్తూ పరమపూజ్య గురుదేవుల ఆశయాలకు ప్రాణం పోస్తూ వచ్చారు. ఎంతదైవీ శక్తి పనిచేస్తూ ఉన్నా ఆమె కూడ మానవమాత్రురాలే కదా! క్రమంగా ఆరోగ్యం క్షీణించడం మొదలు పెట్టింది. సన్నగా గుండెనొప్పి ప్రారంభం అయింది. అన్నింటికన్నా మించిన బాధ పతిదేవుల వియోగమే. ఆమెకు గుండెలో నొప్పి అనిపించినప్పుడల్లా కన్యల వద్ద "మీ నాన్నగారు రాలేదు కదా!" అని తన బాధను వ్యక్తం చేసేవారు. ఒకసారి అనుకోకుండా మాతాజీ బాధను భరించలేకపోయారు. మంచం ఎక్కాల్సి వచ్చింది. ఆ సమయంలో ఉరుముల్లేని పిడుగులాగా పరమపూజ్య గురుదేవులు శాంతికుంజ్‌కు వచ్చేశారు. కేవలం 5 రోజులు మాత్రమే ఉన్నారు. ఉన్న 5 రోజులూ మాతాజీ ప్రక్కన కూర్చుని అనేక విషయాలు ఏకాంతంగా చర్చించారు. అంతేకాదు ఆమెకు గుండె జబ్బు పూర్తిగా తగ్గిపోయింది. ప్రాణాంతక వ్యాధిగా తెలిపిన వైద్యులు కూడ చాలా ఆశ్చర్యపోయారు.

శాంతికుంజ్‌ను మహామానవులను తయారుచేసే టంకశాలగా తీర్చిదిద్దాలని ఉద్బోధించారు. 1971 నుండి 1972 వరకు వందనీయ మాతాజీ చేసిన కృషి మహాతపస్వులు కూడ చేయలేనిది. ఆనాడు శాంతికుంజ్ ఉన్న పరిస్థితుల్లో మాతాజీ ఒంటరిగా నిలబడి, గురుదేవుల ఆశయాలను బ్రతికించారంటే మహోన్నతమైన మనస్సు ఉండి తీరాలి. తపస్సులను అన్నింటిని మించిన తపస్సు వారిది. మహా మనస్విని వందనీయ మాతాజీకి మన స్ఫూర్తిగా నమస్కరించుకుందాం.

**ఋషియుగ్మం మనలను వెన్నంటి నడిపించునుగాక**

*(అఖండజ్యోతి, ఆగస్టు 1996)*

★★★

**ఉపాధ్యాయుడు నిత్యమూ విద్యార్థిగానే ఉండాలి.**

ధారావాహిక: దేవసంస్కృతీ సౌరభం-27

# భారతీయ సంస్కృతిలో గృహస్థ యోగం

భారతీయ సంస్కృతిలో స్త్రీకి అత్యంత గౌరవస్థానం ఇవ్వబడింది. మహాభారతంలో "లాలితాను గృహీతా చస్త్రీ శ్రీః భవతి భారత" అని తెలుపబడింది. అనగా ప్రేమపాత్రమైన స్త్రీ సాక్షాత్తు లక్ష్మితో సమానం అని అర్థం. "స్త్రియస్తు మానవర్షన్తి తాః మౌనయత మానవాః" అనగా స్త్రీలు గౌరవింపదగిన వారు అని అర్థం. స్త్రీ తల్లిగా సంతానాన్ని కని సృష్టిక్రమాన్ని కొనసాగిస్తుంది. గృహిణిగా పురుషునికి అన్ని విధాలా సహకరిస్తుంది. మంత్రిగా సలహాలనందిస్తుంది. ధర్మ కార్యాలకు సహకరిస్తుంది. స్త్రీ సహజగుణాలైన వాత్సల్యము, దయ, ప్రేమ, ధైర్యము మొదలైన వాటితో పురుషులకు స్ఫూర్తిని కలిగిస్తుంది. జీవించి ఉన్నంతకాలం స్త్రీ పురుషులు ధర్మ కార్యాలలో కలసి మెలసి ఉండాలి అని మనుధర్మశాస్త్రంలో చెప్పబడింది.

భారతీయ సంస్కృతిలో పాతివ్రత్యానికి మిక్కిలి ప్రాధాన్యతనిచ్చారు. ఈ ఒకే ఒక్క స్వభావం వల్ల భారతీయ మహిళ ప్రపంచంలోనే తలమానికంగా చెప్పుకోబడింది. ధర్మం దృష్ట్యా హిందూ స్త్రీ ఒకే ఒక వ్యక్తికీ, ఆతని కుటుంబానికీ తనను తాను అర్పించుకుని సమాజానికి ఔన్నత్యాన్ని ప్రసాదిస్తుంది. సంతానానికి ఉత్తమ సంస్కరాలు అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుంది. పతివ్రత అంటే శీలవతి అని అర్థం. భారతమాత పతివ్రతలను కన్న తల్లి. స్త్రీలు పూజింపబడుచోట దేవతలు నివాసం ఉంటారు. అందుకే భారతదేశం దేవభూమి అన్నారు.

భారతీయ సంస్కృతిలో ఉచ్చనీచాలకు, కులగోత్రాలకు, అంటరానితనానికి పెద్దపీటవేశారని చాలా మందిభావిస్తూ ఉంటారు. కాని అది శుద్ధ అబద్ధం. కులాలు వృత్తిరీత్యా ఏర్పడ్డాయి. పనిని బట్టి ఏర్పడిన వర్గాలే కులాలుగా రూపుదిద్దుకున్నాయి. మనలో యోగ్యతయే కొలబద్దగా ఉండేది. ఎవరైనా సమాజంలో అపరాధం చేస్తే అతనికి సమాజం నుండి కొంతకాలం వెలివేసేవారు. అటువంటి వ్యక్తిని తాకడం కూడా మహాపాపం అని భావించేవారు. శిక్ష పూర్తి అయిన తర్వాత తిరిగి సమాజంలో అతనిని కలుపుకునేవారు. వెలివేత భయంతో నేరాలు ఎక్కువగా జరిగేవి కావు. తరువాత తరవాత ఆ పద్ధతిలో మార్పు వచ్చింది. వెలివేయబడిన వారు శాశ్వతంగా అంటరానివారుగా మిగిలిపోయేవారు. దానితో ఉచ్చకులం, నీచకులం అంటూ పేర్లు పెట్టడం జరిగింది.

ఈ ఉచ్చ నీచ భావాలు సమాజ కల్యాణానికి గొడ్డలిపెట్టు. నిజానికి గుణ కర్మ స్వభావాలను బట్టి కులం గుర్తింపబడాలిగాని, జన్మను బట్టికాదు. ఒక దుష్టుని ఇంటిలో మంచి గుణవంతుడు జన్మిస్తే అతడు ఉచ్చకులానికి చెందినవాడనే చెప్పుకోవాలి. అంతేకాని అతనిని తక్కువ కులం వానిగా భావించి తిరస్కరించకూడదు. సమాజ తిరస్కారానికి గురి అయిన వారు శాశ్వతంగా అన్ని రంగాలలో వెనుకబడిపోతారు. ఈ పరిస్థితి దేశానికే ముప్పును కలిగిస్తుంది. అంటరానితనం, ఉచ్చనీచ భావన హిందూ సమాజమంతా వ్యాపించింది. మహనీయుల బోధలతో కొంతకాలం నుండి దీనికి విరుగుడు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది.

గుణ కర్మ స్వభావాలను బట్టే వ్యక్తి యొక్క ఎక్కువ తక్కువలు కొలవబడతాయి. కలెక్టరు కొడుకు కలెక్టరు, బంట్రోతు కొడుకు బంట్రోతు కావాల్సిన అవసరం లేదు. వారి వారి యోగ్యతలను బట్టి వారి వారి పనులు నిర్ణయింపబడతాయి. ఆ పనులను బట్టి వారిని ఆయా వర్ణాలకు చెందినవారిగా భావించాలి. పూర్వ కాలంలో వర్ణాలు ఇదేవిధంగా ఏర్పడ్డాయి. "ఏక ఏవ పురావేదః ప్రణవః సర్వవాఙ్మయః। దేవ నారాయణో నాన్య ఏకోగ్నిర్వర్ణ ఏవచ॥" మొదట్లో ఓంకారమే ఒక వేదం. నారాయణుడు ఒక్కడే దైవం. లౌకికమైన అగ్ని ఒక్కటే. కులం కూడ ఒక్కటే అని పై శ్లోకానికి అర్థం. కృతయుగంలో మనుష్యులంతా ఒకే కులం. ఆ కులంపేరు హంస. ఆ యుగంలో పాప పుణ్యాలు లేవు. వర్ణాశ్రమ వ్యవస్థ లేదు. శరీరమునందలి రంగుతో కుల వ్యవస్థ రాలేదు. కామక్రోధ లోభమదమాత్సర్యాలు అన్ని రంగులవారికి ఉంటాయి. అవయవాల సృష్టి క్రమం అందరికీ ఒక్కటే. శారీరిక అవసరాలు, బాధలు అందరికీ సమానమే. సృష్టిని విస్తరింపచేయడానికి స్త్రీ పురుషుల కలయిక. దీనినే విచ్చలవిడిగా కాక ఒక పవిత్రమైన బంధంగా భారతీయ సంస్కృతి తీర్చిదిద్దింది. అదే వివాహ బంధం. అదే గృహస్థ యోగం. అదే బాధ్యతతో కూడుకున్న సమాజం. అదే విడదీయరాని మమతాను బంధాలతో కూడుకున్న వ్యవస్థ. కుటుంబ వ్యవస్థను కూలిపోకుండా చూచుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుని మీద ఉన్నది.

అనువాదం - కె.బి.సోమయాజులు

★★★

ప్రియంగా మాట్లాడుతూనే నిజాన్ని కూడ పలకాలి.

పరమపూజ్య గురుదేవుల అమృతవాణి

# నేటి ప్రజ్ఞావతారుడైన, యుగ దేవత యొక్క అప్పీలు-1

నాతో పాటు గాయత్రి మంత్రం చెప్పండి,

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్.**

దేవీ స్వరూపులారా! సోదరులారా!

మానవ జీవితంలో చాలా రకాలుగా సౌభాగ్యోదయం కలుగుతుంది, ఆ సౌభాగ్యాన్ని చూసుకుని మనిషి ఎప్పుడూ తనలోతాను ఆనందిస్తాడు. అలాంటి సౌభాగ్యం ఎప్పుడో కాని జరగదు. పెళ్ళిళ్ళు, పేరంటాలు ఎప్పుడో ఒకసారి తప్ప రోజూ జరగవుగా! 'కాన్వొకేషన్' లో రోజూ డిగ్రీ ఇవ్వరు, జీవితంలో ఒకేసారి ఇస్తారు. అప్పుడే చేతిలో పట్టా పుచ్చుకుని, నెత్తి మీద టోపీ పెట్టుకుని ఫొటో తీయించుకుంటారు. లాటరీ తగలడం, పదోన్నతి కలగడం ఇవన్నీ అప్పుడప్పుడు లభించే సౌభాగ్యాలే. కాని సమయాన్ని గుర్తించగలగడమే మనిషికి దక్కే అతిపెద్ద సౌభాగ్యం. సమయాన్ని గుర్తించడం కన్నా పెద్ద సౌభాగ్యం ఇంకొకటి మనిషి జీవితంలో, ప్రపంచంలో ఉండదని నా అభిప్రాయం. వ్యవసాయం చాలా మంది చేస్తారు, కాని సరైన సమయంలో వర్షాలు పడే వేళల్లో విత్తనాలు నాటిన రైతు తక్కువ కష్టంతోనే ధాన్యం బస్తాలు నింపుకుంటాడు. గోధుమలు ఏ సమయంలో నాటాలో చూసుకుని ఆ నెలలో విత్తనాలు వేస్తే అప్పుడే అది ఎక్కువగా సాగవుతుంది. కాని ఆ సమయం దాటిపోయాక నాటితే ఎక్కువ పంట వస్తుందని ఆశించలేము.

సమయం యొక్క గొప్పతనం చెబుతున్నాను మీకు. ఇప్పుడు నేను, మీరు ఉన్న కాలం చాలా గొప్పది, అది మీ జీవితాలలో కాని చరిత్రలో కాని మరెప్పుడూ రాదు. మీ తరువాతి తరాలు ఇలాంటి కాలం కోసం తపిస్తారు. మా తాత ముత్తాతలు ఆ కాలంలో పుట్టినవారు అని గొప్పలు చెప్పుకుంటారు. ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకున్న వారి కుటుంబాలు ఎప్పుడూ ఆనందిస్తూనే ఉంటాయి. చరిత్రలో వారి పేర్లు స్వర్ణాక్షరాలతో లిఖించబడతాయి. కాని ఈ సమయాన్ని గుర్తించని వాళ్ళు, పట్టించుకోని వారు తరువాత చాలా పశ్చాత్తాపపడతారు. వారి తరువాత తరాల వారు కూడా అప్పుడు మా తాతముత్తాతలు సరైన దారిలో ఎందుకు వెళ్ళలేదా అని బాధపడతారు. ఈ కాలం ఎంత గొప్పదో తెలియచెప్పటానికి మీకు కొన్ని ఉదాహరణలు ఇస్తాను, వాటిని తెలుసుకుని ఈ గొప్ప సమయంలో మీరు సరైన అడుగులు వేయగలిగితే చాలా సంబరంగా ఉంటుంది.

నేను మీకు అవతారుని కథలు చెపుతాను. ఎప్పుడు అవతారాలు వచ్చినా, మహాపురుషులు ఉద్భవించినా,వారితో పాటు అడుగులో అడుగు వేసి నడిచేవారిని నేను భాగ్యవంతులంటాను, చాలా తెలివైనవారుగా భావిస్తాను. వారిలో ఒకరి పేరు హనుమంతుడు. ఎవరీ హనుమంతుడు? సుగ్రీవుని నమ్మినబంటు హనుమంతుడు. వాలి సుగ్రీవుడిని తన్ని గెంటేసినప్పుడు, పెళ్ళాం పిల్లల్ని లాగేసుకున్నప్పుడు, తన నమ్మినబంటుతోనే ఋష్యమూక పర్వతం మీద ఉండేవాడు. ఒకసారి రాముడు వస్తే సుగ్రీవుడు హనుమంతుడ్ని పంపించాడు. వారికి ఎక్కడ అపకారం జరుగుతుందోనని హనుమంతుడు వామన-బ్రాహ్మణ రూపములో వెళ్ళాడు. అంటే హనుమంతుడు బలహీనుడనా? బలహీనుడు కాకపోతే తన యజమాని అయిన సుగ్రీవుని భార్యను, సంపత్తును, రాజ్యమును వాలిని లాక్కోనిచ్చేవాడు కాదు కదా! అని అనిపించవచ్చు. హనుమంతుడు సమయాన్ని గుర్తించి, శ్రీరామచంద్రునితో కలసి పని చేయాలని నిశ్చయించుకున్నాడు. ఒక మహత్వపూర్ణ శక్తితో కలసి పని చేస్తే ఏ ఏ లాభాలు వస్తాయో హనుమంతుడు ఊహించి ధైర్యంగా ముందుకు నడిచాడు. ఆదర్శాలను పాటించటానికి శక్తి అవసరం లేదు, సాధనాలు అవసరం లేదు. హనుమంతుడు అధ్యాత్మను పట్టుకున్న తరువాత శ్రీరాముడితో ఆయనకి సహాయకుడిగా అవుతానని చెప్పాడు. ఆ సమయములో హనుమంతుడు అద్భుతమైన ధైర్యాన్ని చూపి, సమయాన్ని గుర్తించి ప్రవర్తించాడు. ఇక ఆ తరువాత మీరు ఊహించలేనంత శక్తి సామర్థ్యాలు అతనికి లభించాయి. అనేక గొప్ప పనులు చేశాడు. కొండను ఎత్తగలిగాడు. సముద్రాన్ని దాటగలిగి కుంభకర్ణుడి లాంటి వారితో హనుమంతుడు ఒక్కడే పోరాడాడు.

హనుమంతునిలో ఇంతటి మహత్తరమైన శక్తి ఎలా వచ్చింది? హనుమంతుడు ఎప్పుడైతే అధ్యాత్మను తన జీవితంలో ధారణ చేశాడో అప్పటి నుండీ వచ్చింది. ఆధ్యాత్మికత జపాలలోనూ, పూజల వరకు సీమితమైనది కాదు. గుర్తుంచుకోండి, ఆధ్యాత్మికత అంటే – గొప్ప సిద్ధాంతాలను తమ జీవితంలో ధారణ చేసుకోగలిగే ధైర్యం. హనుమంతుడు ఈ ఆధ్యాత్మికతను తన జీవనంలో ధారణ చేసుకున్నాడు. ఉన్నతమైన ఉద్దేశ్యాలకోసం, భగవంతునితో కలిసి అడుగులో అడుగు వేసి అందులోనే చరితార్థుడయ్యాడు. దీనిని మించిన తపస్సు ఇంకేదీ ఉండదు. నల-నీలులు రాళ్లతో నీటిపై తేలే వారధిని కట్టారు. దీనికి స్థంభాలు కానీ, ఊయలలు కానీ, గర్డర్ కానీ, సిమెంటు కానీ అవసరం

**అవకాశం తలుపుతట్టగానే రెండు చేతులతో అందుకోవాలి.**

రాలేదు. అలా అవలీలగా రాళ్లు వేస్తూఉంటే వారధి తయారైపోయింది. ఉన్నతమైన ఆదర్శాల కోసం, భగవంతుడే స్వయంగా అవతరించి పనిని ప్రారంభించినప్పుడు, ఆదర్శవంతులు వారికి సహకరించినప్పుడు ఇలాంటి అద్భుతాలు జరుగుతాయి. ఎలుగుబంట్లు, కోతులు కూడా భగవంతునికి సహాయపడ్డాయి. వీరు చెక్క, ఇటుకలు, రాళ్లు మోసి నల-నీలుని దగ్గర జమచేసి పెట్టేవారు. భగవంతుని అవతారముతో కలిసి, ఆయన క్రియా పద్ధతులకుఅణుగుణంగా వారితో ఈ ఎలుగుబంట్లు, వానరులు పనిచేసి, ఎంతో ఎత్తుకు ఎదిగారు. మనము ఇప్పుడు వారిని కొలిచి, పొగుడుతున్నాం.

సేతువుని నిర్మించేటప్పుడు ఉడుత ఏమి చేసింది? దాని జుట్టులో ఇసుక నింపుకొని వచ్చి సముద్రంలో వేసేది. ఇది ఏమంత పెద్ద పని కాకపోయినా ఉడుత తన సమయాన్ని తెలుసుకొని భగువంతుని అవసరంలో సహాయం చెయ్యాలి అనుకొన్నది. రామచంద్రుడు ఉడుతను తన గుండెలకు హత్తుకుని, దాని వీపు భాగాన్ని ప్రేమతో నిమిరాడు. ఎందుకలా చేశాడు? ఉడుత ఇసుక తెచ్చిందనా? పట్టెడు ఇసుకతో ఏమవుతుంది? సిద్ధాంతాలపై గల దాని నమ్మకం, నిష్ఠ, భక్తి కోసమే ప్రేమగా రామచంద్రుడు అలా నిమిరాడు.

మిత్రుల్లారా! శబరి భగవంతునికి రేగి పళ్ళు తినిపించింది. ఆ సంఘటన ఇప్పటికీ చెప్పుకుంటూనే ఉంటాం. భగవంతుడు శబరితో అన్నాడు, "నాకు ఆకలిగా ఉన్నది" అని. భగవంతునికి అప్పుడు అవసరం వచ్చింది. మీకు మీమీ అవసరాలు ఉన్నట్లే భగవంతునికి కూడా అప్పుడప్పుడు అవసరాలు వస్తాయి. అలాంటి పరిస్థితే మనిషి సౌభాగ్యానికి సువర్ణావకాశం. శబరి అవకాశాన్ని గుర్తించింది. రేగి పళ్ళు తినిపించింది. శ్రీరాముడు ఎవరైనా వచ్చి నావ మీద నది దాటిస్తారేమోనని ఎదురుచూస్తున్నాడు. గుహుడు భగవంతుని అవసరం చూశాడు. ఆయనకు సహాయం చేశాడు.

ఒక ముసలి గ్రద్ద (జటాయువు) ఆ సమయంలో సీతాదేవి యొక్క అవసరాన్ని చూసింది. సీతాదేవి ఎవరైనా వచ్చి సహాయం చేస్తారేమోనని ఎదురు చూస్తోంది. జటాయువు చేసింది. దాని జీవితం ధన్యమైయింది. మనిషి ఎప్పుడూ భగవంతుని ముందు చెయ్యిజాపుతుంటాడు. కానీ భగవంతుడు కూడా అప్పుడప్పుడు చెయ్యిజాపుతుంటాడు. వారు చెయ్యి జాపినప్పుడు ఆ చేతిలో ఏమైనా ఉంచితే ఆ ఉంచినవారి జోలె బంగారంతో నిండిపోతుంది.

మీరు అవకాశాన్ని గుర్తించరు. భగవంతుడు కూడా అప్పుడప్పుడు చెయ్యిజాపుతాడని మీకు తెలియదు. మేము మిమ్మల్ని పిలిచినప్పుడు ప్రపంచం మారుతున్నదని గుర్తుంచుకోవాలి. మీరు గిరగిరా తిరుగుతున్న పృథ్విని చూడలేరు. ఇక్కడ రాజులుండేవారు. ఇప్పుడెక్కడున్నారు రాజులు? చూస్తూ ఉండగానే అంతా మారిపోయింది. జాగిర్దారులు, జమిందారులను, చూశారా మీరు? చూడకపోతే రాజస్థాన్ వెళ్ళండి. అక్కడ గ్రామగ్రామాలలో కోటలు ఉండేవి. ఇప్పుడు వాటి అవశేషాలు మాత్రమే ఉన్నాయి. రాజులు వెళ్ళిపోయారు. జమిందారులు వెళ్ళిపోయారు. 20 సంవత్సరాలలో ఎంతో మార్పు వచ్చింది.

మిత్రులారా! ఈ రోజులలో ప్రపంచము రెండు రకాలుగా మారుతున్నది. దీనిని ఎవరు మారుస్తున్నారు? 20వ శతాబ్దపు అవతారం. నేను దీనిని ప్రజ్ఞావతారం అంటాను. మనిషి బుద్ధి చాలా ప్రమాదకరంగా తయారయ్యింది. ఈ బుద్ధి మొత్తం ప్రపంచాన్ని నాశనం చేసింది. ఈ వక్ర బుద్ధి వల్ల కష్టాలెక్కువవుతున్నాయి. మీరు కాలేజీలకు, విశ్వవిద్యాలయాలకూ వెళ్ళి చూస్తే అవాంఛనీయతత్వాలు, అరాచకతత్వాలు, ఎక్కడున్నాయో, ఈ గందరగోళాలు ఎక్కడనుండి మొదలవుతున్నాయో తెలుస్తుంది. మీకు మారుతున్న ప్రపంచం కనిపించటం లేదు. ఈ రోజున చాలా మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. ఈ తెలివికి పాఠం నేర్పటానికి ఒక క్రొత్త తెలివి ఉద్భవించనుంది. దాని పేరే 'మహాప్రజ్ఞ'. ఇరవై నాలుగవ అవతారం ప్రజ్ఞావతారంగా అవతరిస్తోంది. మీకు కనిపించకపోవచ్చు కాని, నా కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడండి. నావి చాలా తీక్షమైన కళ్ళు, చాలా దూరం చూడగలవు. నా కళ్ళలో టెలిస్కోపుఉంది. మీరు వచ్చి కాస్త నా కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడండి ఏం జరుగుతుందో. ప్రపంచం చాలా రకాలుగా మారుతోంది. కాని దీన్ని ఎవరు మారుస్తున్నారు? భగవంతుడు మారుస్తున్నాడు. భగవంతుడు ఎప్పుడు భూమి మీద అవతరించినా, భక్తులకు సౌభాగ్యం పొందే అవకాశం లభించింది. పైన రాముడి ఉదాహరణనిచ్చాము, ఇప్పుడు బుద్ధుని ఉదాహరణ ఇస్తాను, శ్రీకృష్ణ భగవానుని ఉదాహరణ ఇస్తాను. చందనం అద్దే కుబ్జ గురించి చెప్పుకోవచ్చు. ఇంకెన్ని ఉదాహరణలివ్వను మీకు? భగవంతుని అవతార కార్యాలలో ఎవరైనా కాస్త చేయందించినా వారు ధన్యులే. భగవంతుడే కాదు, మహానుభావులకు సహాయపడినవారు కూడా రాజగోపాలాచారి, వినోబాలు అయిపోయినట్టే. వారి పేరు పటేలైంది, నెహ్రూ అయింది, జాకిర్ హుస్సేనైంది, రాధాకృష్ణన్ అయింది, రాజేంద్రబాబు అయింది. ఇప్పుడు లెక్కపెడుతున్న వారందరూ భారతదేశానికి చక్రవర్తులు. వారు చక్రవర్తులెందుకయ్యారు అంటే, ఒక గొప్ప అవతారం యుగపరివర్తనకి వచ్చినప్పుడు ఆ కుటుంబంలో చేరిపోయారు, ఇప్పటి సమయం కూడా అలాంటిదే. ఆ అవతారంతో కనక చేయి కలిపితే, పదం కలిపితే, దాని వెనుక నడవగలిగితే, వారి భారం పంచుకోగలిగితే చాలు.

*అనువాదం - చందన బృందం*

*(వాఙ్మయం-68-చాప్టర్ 5)*

*(మిగతాది వచ్చేసంచికలో...)*

★★★

**అవకాశాన్ని అందిపుచ్చుకున్నవాడే విజయాన్ని సాధిస్తాడు.**

మహిళా జాగరణ

# పరమపూజ్యదేవీమూర్తి - మహిళ

తల్లిగా, దేవతగా విధాత సృష్టించిన శక్తి మాతృశక్తి, మహిళా శక్తి. ఇది పరమ పూజ్యమైన దేవతారూపం. దేవత్వ ప్రతీకలలో ప్రథమస్థానం స్త్రీది; రెండవది పురుషునిది. భావసంవేదన, ధర్మధారణ, సేవాసాధనల రూపంలో ఆమె శ్రేష్ఠత్వం చరితార్థం అయింది.

స్త్రీ శక్తి గడచిన రోజులలో అనేక భయంకర పరిస్థితులను చవిచూసింది. ఫ్యూడల్ అంధకార యుగం నుండి పుట్టిన అనర్థం పరిస్థితులను తలక్రిందులు చేసింది. ఆమెను అబలగా భావించడం జరిగింది. భోగినిగా, రమణిగా, అనుభవించతగినదిగా, దాసీగా ఉండడం ఆమెకు తప్పనిసరి అయింది. పూజ్యభావంతో చూడవలసిన స్త్రీ చెడుదృష్టితో చూడబడింది. కానీ ఇప్పుడు అందరి ఆలోచనల్లో మార్పు వచ్చింది. పాశ్చాత్యులు స్త్రీ విముక్తి ఆందోళన ప్రారంభించారు. ఆందోళనకు భిన్నంగా ఈ మహిళాశక్తి జాగరణ ప్రక్రియ దైవ చేతన ద్వారా నిర్వహింపబడుతోంది. బుద్ధికి అనుగుణంగానే ఇది నడుస్తున్నది. మహా పరివర్తన వేళలో సత్యయుగం తిరిగి రావడాన్ని గురించిన చర్చ జరుగుతున్న ఈ తరుణంలో గాయత్రీపరివారమే కాక ప్రపంచమంతా ఈ మహిళాశక్తి లేచి నిలబడడం, రంగస్థలంపై ప్రముఖ పాత్రను వహిస్తూ ఉండడం చూస్తోంది. విద్య, స్వావలంబన లాంటి వివిధ కార్యక్రమాల ద్వారా మహిళా జాగరణ జరుగుతోంది. ఆమె పౌరోహిత్యం నుండి యుగనాయకత్వం వరకు అనేక బాధ్యతలు నిర్వహిస్తోంది. ఇది కల్పన కాదు, పచ్చి నిజం.

జీవసృష్టి నిర్మాత ఆదిశక్తి, మహామాయ. ఆమెను విధాత అనీ, మాత అనీ కూడ పిలుస్తారు. మాతృశక్తి ప్రాణులపై దయ కురిపించకపోతే ఆ శక్తి ఉనికి వెలుగులోనికి వచ్చేది కాదు. గర్భం లోపలి ప్రారంభదశ ఒక సూక్ష్మ బిందువుగా మాత్రమే ఉంటుంది. తల్లిలోని చేతన దానిలో ప్రవేశించి దానిని పరిపక్వం చేస్తుంది. ప్రసవ వేదనను సహించి ఆమెయే ఆ శిశువు బంధనాలను త్రెంచి, దానికి ప్రపంచ ఉద్యానవనంలో ప్రవేశించగల స్థితిని కలిగిస్తుంది. అసమర్థమైన, వికసించని స్థితిలో శిశువుకు తల్లియే ఆధారం అవుతుంది. ఆమె స్తన్యమిచ్చి అడుగడుగునా ఆ శిశువు అవసరాలను తీరుస్తుంది. స్త్రీ రూపంలో తల్లి అప్పుడప్పుడు చిత్ర విచిత్రములైన అనుగ్రహాలను కురిపించకపోతే మానవుడే కాదు ఏ ప్రాణీ ఈ విశ్వబ్రహ్మాండంలో ఎక్కడా కనిపించదు. అందువలన ఆమె జీవనాన్ని ఇచ్చే బ్రహ్మచేతనగా అభినందింపబడి వేదమాతగా, దేవమాతగా, విశ్వమాతగా ఈ ముగ్గురు దేవతలుగా అర్చించబడుచున్న శక్తి మహిళ.

మానవునిలోనే కాక ప్రతిభావంతులైన ప్రాణులలో కూడ దేవతలూ దానవులూ ఉంటారు. వారిద్దరూ దితికి, అదితికీ జన్మించారని కథ ఉన్నది. సృష్టి శక్తిగా ఈ ప్రపంచంలో శక్తివంతమూ, సంపన్నమూ, విజ్ఞానయుతమూ, సుందరము అయిన అన్నింటిలోనూ నారీ తత్వానికి ప్రముఖ పాత్ర ఉన్నది. అందువలన ఆమె ప్రత్యేకతకు వివిధ రూపాలలో వేలాది నమస్కారాలు చేయడం జరుగుతుంది. సరస్వతి, లక్ష్మి, కాళి రూపాల్లో విజ్ఞానంగా, గాయత్రి, సావిత్రి రూపాలలో జ్ఞాన చేతనగా ఆమె ప్రత్యేక పూజలు అందుకుంటుంది.

దేవత్వ ప్రతీకలలో ప్రథమ స్థానం స్త్రీది. రెండవ స్థానం పురుషునిది. లక్ష్మీ-నారాయణులు, ఉమా-మహేశ్వరులు, శచీ-పురందరులు, సీతా-రాములు, రాధా-కృష్ణులు వంటి దేవతల జంటలలో మొదట స్త్రీ, తరువాత పురుషుడు ఉన్నారు. తల్లి శరీరంలో సంస్కారం కలుపుకుని ఈ ప్రపంచంలోకి ప్రవేశిస్తాడు, మానవిగా కనిపిస్తున్నా ఆమె వాస్తవానికి దేవత. ఆమె పేరుతో పాటు దేవి అనే పదం జోడింపబడి ఉంటుంది. శ్రేష్ఠమైనదిగా, గొప్పదిగా ఆమెను అంగీకరించాలి.

భర్త, సోదరుల నుండి, పుత్రుని వరకు అందరికీ వారి అభిరుచికీ, అవసరాలకు అనుగుణంగా ఆమె వివిధ రూపాలలో సుఖ సంతోషాలను అందిస్తుంది. ఆమె ఆచరణ నుండి సంతోషం, సంతృప్తి, శాంతి అనుభవంలోకి వస్తాయి. ఆధ్యాత్మిక రంగంలో ఆమెయే భక్తి, శక్తి, సమృద్ధి. ఆమెలోని అణువణువు రసాత్మకమైనది. నరుడు ఆమెను పొంది ధన్యుడయ్యాడు. ఆమె కారణంగానే అనేక సామర్థ్యములు చూపడంలో సమర్థుడయ్యాడు. అవ్యాజమైన ఈ దయకు అతని అణువణువులో కృతజ్ఞత, శ్రద్ధ, ఆరాధనా భావం పొంగుతూ ఉండాలి. ఈ కామధేనువు అనుగ్రహాన్ని పొందడంలో ఎంత సఫలుడయితే అంతగా ప్రతిభ, సంపద, సమర్థత, ప్రగతిశీలతల వంటి వరములతో అతడు లాభాన్వితుడు అవుతాడు. తత్వవేత్తలు అనాదికాలం నుండి స్త్రీ విలువను అదేవిధంగా అంచనా వేస్తూ వచ్చారు. ఆమెను అభ్యర్థించడం అవసరమని ప్రతివ్యక్తికీ ప్రేరణ ఇస్తూ వచ్చారు. శక్తిపూజా విధానం మొత్తం ఈ అభిప్రాయాన్నే మనస్సులో నింపుతుంది.

వికాసరంగంలో ప్రతి ఒక్కరూ ఈమె వివిధ రూపాలను సాధన చేయవలసి వచ్చింది. శ్రద్ధ, ప్రజ్ఞ, నిష్ఠ, సామర్థ్యం, కళ, నేర్పు, దూరదృష్టి-ఇవన్నీ ఆ మహాశక్తి సూక్ష్మస్వరూపాలు. 'సాధన ద్వారా సిద్ధి' అనే సాంప్రదాయం ఈ రూపాలుగా ప్రకటితమౌతున్నది. సభ్యత, విజ్ఞతలు ప్రపంచంలో వెల్లివిరిసిన యుగాలలో ఆమె గౌరవ గరిమలకు తగినవిధంగా ప్రజలంతా ఆమెను నిండు మనసుతో ఆదరించేవారు, ఫలితంగా - అంతటా సుఖ శాంతులతో నిండిన సత్యయుగ వాతావరణం కానవచ్చేది.

★★★

ముందు నీపై నీవు విశ్వాసం పెంచుకో - తరువాతే ఎవరి మీదైనా.

బోధకథ

# మృతుని పట్ల వ్యామోహం వ్యర్థం

చనిపోయిన ఆత్మీయుల పట్ల వ్యామోహం సహజమే. ఆ తరుణంలో తమను తాము సంబాళించుకున్నామని చెప్పగలిగేవారు అరుదుగా ఉంటారు. మరణం ఒక సహజ ప్రక్రియ. జీవాత్మ శాశ్వతమైనది అన్న వాస్తవాన్ని గుర్తించాలి.

ఎన్నెన్నో పురాణ కథలు ఈ వాస్తవాన్ని బలపరుస్తున్నాయి. ప్రద్యుమ్న మహారాజు రోగగ్రస్తుడు అయినాడు. ఎన్ని వైద్యాలు చేయించినా ప్రయోజనం లేకపోయింది. మరణం నుండి తప్పించుకోలేకపోయాడు. మహారాణి, రాజకుమారులు, మంత్రులు, సామంతులు, ప్రజలు అందరూ రోదించసాగారు. ఏదోవిధంగా రాజు తిరిగి జీవిస్తే ఎంత బాగుంటుంది అని వారంతా ఆలోచించసాగారు.

ఆ రోజులలో పురంధ్ర మహర్షి ఎన్నెన్నో సిద్ధులు, మహిమలు పొందిన మహానుభావుడు. ఆయన కృపవల్ల ఎన్నో ఘోర విపత్తులు తొలగిపోయాయి. అసాధ్యాలు సైతం సాధ్యపడ్డాయి. అలా ఆయన ఖ్యాతి నలుగడలా వ్యాపించింది. కాకతాళీయంగా, రాజు మరణించిన సమయంలోనే ఆయన అక్కడికి వచ్చారు. మహారాజు ఆయన భక్తులలో ఒకరు. దుఃఖంలో మునిగిఉన్న ఆయన కుటుంబానికి ఊరట కలిగించడం, రాజ్య వ్యవస్థ, రూపురేఖలు ఇక ముందు ఎలా ఉండాలో చూడడం తన కర్తవ్యం అని ఆయన భావించారు.

పురంధ్ర మహర్షిని ఆకస్మికంగా చూడగానే, అక్కడి వారందరిలో ఆశ చిగురించింది. మహారాజును ఎలాగైనా తిరిగి బ్రతికించవలసిందిగా వారంతా ఒకే స్వరంతో ప్రార్థించారు. మహర్షి వారికి పరిపరివిధాల చెప్పి చూశారు. జనన మరణాలు తప్పనిసరి అయిన విషయాలని చాలా సేపు వారికి వివరించారు. కానీ, ఆ మాట ఎవరూ వినిపించుకోలేదు. రాజును బ్రతికించండి అన్నదే అందరి వేడికోలు, అందరి ఒత్తిడి.

ఆ ఒత్తిడిని తట్టుకోవడం ఆయనకు సాధ్యపడలేదు. రాజ బంధువుల వ్యామోహం కట్టలు త్రెంచుకున్నది. మహర్షి కొంత మెత్తబడ్డారు. ఆయన వారికి ఒక ఉపాయాన్ని సూచించారు. "మహారాజు ఆత్మ కొత్త శరీరాన్ని ధరించింది. అక్కడకు మిమ్మల్ని తీసుకువెళతాను. ఆ శరీరంతో సంభాషణ జరిపే సౌకర్యం మీకు కలిగిస్తాను. రాజు మృత శరీరంలోనికి తిరిగి రమ్మని మీరు వేడుకోండి. ఆయన ఒప్పుకుంటే కొత్త శరీరాన్ని తొలగించి, ఆయన ఆత్మ పాత శరీరంలోకి వచ్చే ఏర్పాటు చేస్తాను."

ప్రద్యుమ్న మహారాజు ఒక చెట్టుమీద పురుగుగా జన్మించాడు. మహర్షి రాజ కుటుంబానికి ఆ చెట్టువద్దకు తీసుకువెళ్ళారు. ఆ పురుగును వారికి చూపించారు. రాజు కుటుంబ సభ్యులంతా ఆ పురుగులోని ఆత్మను తిరిగి రాజు శరీరంలోకి రావలసిందని కోరారు, పట్టుపట్టారు. ఆయన కొత్త శరీరాన్ని నాశనం చేయడానికి సిద్ధపడ్డారు. మీ శరీరాన్ని మేము భద్రపరచామని పదేపదే నమ్మకంగా చెప్పారు.

అందుకు పురుగు శరీరాన్ని ధరించిన మహారాజు ఇలా జవాబు చెప్పారు – "బంధువులారా! మీరు అనవసరంగా వ్యామోహపడుతున్నారు. గత జన్మలోని నా బంధువులపై నాకిపుడు మమకారం లేదు. అసలు మీ అందరినీ నేను ఎరుగనే ఎరుగను. కొత్త శరీరంలో ఉండడమే నాకు సంతోషం. నేను త్వరలో నా కుటుంబాన్ని కూడ ఏర్పాటు చేసుకోపోతున్నాను. ఇందుకు అడ్డు రాకండి. నా శరీరాన్ని మార్చుకోవడానికి నాకు ఎంత మాత్రం ఇష్టం లేదు."

అందరూ విస్తుపోయారు. నిశ్చేష్టులు అయినారు. రాజు ఒప్పుకుంటేనే ఆయనను పాత శరీరంలోకి తెచ్చే ఏర్పాటు చేస్తానని మహర్షి మొదటే షరతు పెట్టారు. రాజుకు పూర్వ జన్మలోని తన బంధువుల పట్ల ఏ మాత్రం ఆపేక్ష లేదని తేలిపోయింది. రాజు బంధువులంతా తమ పట్టు విడిచిపెట్టారు. విచారంతో తిరిగి వచ్చారు.

ఆ తర్వాత ప్రద్యుమ్న మహారాజు మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి. రాజ బంధువుల దుఃఖం క్రమంగా తగ్గింది. వారంతా ఒక వాస్తవాన్ని బాగా గుర్తించారు.

ఎవరు ఏ శరీరంలో ఉంటే వారికి ఆ శరీరం నచ్చుతుంది. ఆత్మకు ఇల్లంటూ ఉండదు. కుటుంబ సభ్యులూ ఉండరు. బంధువర్గమూ ఉండదు. కనుక చనిపోయిన బంధువును గురించి వ్యామోహం చెందడం నిరర్థకం.

మృతశరీరానికి తగువిధంగా అంత్యక్రియలు జరిపించాలి. వ్యామోహం నుండి బయటపడాలి. మృతుని ఆత్మకు శాంతి కలిగించాలి.

★★★

**నీ బాధకు కారణం అయిన దాన్ని ఇతరులపై ప్రయోగించకు.**

ఆధ్యాత్మిక విజ్ఞానం

# ఋషుల విజ్ఞానము ఇదే

యుగఋషి శ్రీరామశర్మ ఆచార్య ఆధ్యాత్మిక మంత్ర ద్రష్ట. వారు చేతనత్వ ఆలోచనలతో మునిగిపోయారు. 1946 డిశంబర్ నెలలో ఒక ఉదయం. ఆ ముందురోజే ఆయన జన్మదినం. వారికి బ్రహ్మ ముహూర్తాన సమాధి శిఖరావస్థలో కొన్ని సంకేతాలందాయి. 1926 వసంత పంచమి బ్రాహ్మీ ముహూర్తమున మార్గదర్శకుని సందర్శనం లభించింది. తరువాత వచ్చిన ప్రతీరోజు బ్రహ్మ ముహూర్తమూ, ప్రత్యేక సమయమే. ఆ రోజున ఇంకా ప్రత్యేకం. హిమాలయములోని ఋషుల, సద్గురుదేవులు సర్వేశ్వరానందుల సూక్ష్మ అనుభూతితో పాటు వారి చిదాకాశంలో "వైజ్ఞానిక ఆధ్యాత్మికత" అనే రెండు శబ్దాలు మహామంత్రంవలె ప్రతిధ్వనించాయి. ప్రకాశించాయి. ఇదే వైజ్ఞానిక మహామంత్రం యొక్క ప్రథమ సాక్షాత్కారం. ఈ అనుభూతి తరువాత వారి అంతఃజగత్తులో బాహ్యజగత్తులో, అనేక సంఘటనలు ఒక క్రమంగా జరగటం మొదలుపెట్టాయి.

అంతర్జగత్తులో సంఘటనలు ఆ రోజు నుంచే అనుభవంలోకి వస్తున్నాయి. ఆరోజున బాహ్యజగత్తులో కూడా సంకేతరూపంలో ఒక ఉత్తరం అందింది. రామ్‌నారాయణ్ కేడియా ఆ ఉత్తరం వ్రాశారు. శ్రీ కేడియా అఖండజ్యోతి పరివారంలో నాలుగు సంవత్సరాలుగా ఉన్నారు. వారికి ఆచార్యులవారితో సన్నిహిత సంబంధం ఉన్నది. శ్రీ కేడియా కలకత్తాలో నివసిస్తారు. ఆయన నివాసానికి "శాంతి నికేతన్" పెద్ద దూరం కాదు. అనేకసార్లు శాంతినికేతన్ వెళ్ళటం జరిగింది. ఈసారి వెళ్ళినపుడు హరిప్రసాద్ ద్వివేదిగారిని కలవడమే విశేషం.

శ్రీ ద్వివేది హిందీ సాహిత్యంలో సుప్రసిద్ధ విద్వాంసుడు. సాహిత్యకారుడు. శాంతినికేతన్‌లో హిందీ ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. వారి చదువు అంతా కాశీలో జరిగినా, గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్ గారి ప్రేమపాశం ఆయనను శాంతినికేతన్‌లో కట్టిపడేసింది. ఇప్పుడు విశ్వకవి లేకపోయినా వారి పుత్రుడు రథీబాబు విజ్ఞప్తితో అక్కడే ఉంటున్నారు. కేడియా గారు ద్వివేదిగారిని కలసి అఖండజ్యోతి మాసపత్రిక ఇవ్వటం జరిగింది. అఖండ జ్యోతి పత్రిక ఉద్దేశ్యం, రాసే తీరు, ఆధ్యాత్మిక విషయాలను క్రొత్తవిధంగా చెప్పబడటం ద్వివేదిగారిని చాలా ప్రభావితం చేశాయి. వారు కేడియాగారితో అఖండజ్యోతి సంపాదకులను కలవాలని ఉందని, వారిని ఒకసారి పిలిపించుమని, వారితో మాట్లాడాలని ఉందని చెప్పటం జరిగింది.

కేడియాగారు తమ ఉత్తరంలో ఈ విషయాలన్నీ వివరంగా వ్రాశారు. ఆ ఉత్తరాన్నే యుగ ఋషి చదువుతున్నారు. దానిలోని విషయాలేగాక చేతనత్వంలో ఒక ఆలోచన స్పందించింది. అఖండ జ్యోతి కార్యాలయం నుంచి ఒక వ్యక్తిని పిలచి కేడియాగారికి తాము కలకత్తా వస్తున్నట్లు టెలిగ్రాం ఇప్పించి, కలకత్తా వెళ్ళటానికి కావలసిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆచార్యుల వారు ఈ మధ్యకాలంలో అనేక సార్లు కలకత్తా, శాంతినికేతన్ వెళ్ళారు. పోయినసారి వెళ్ళినపుడు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌ని కలవటం జరిగింది. అప్పుడు ఆయన చాలా అనారోగ్యంతో ఉన్నారు. హరిప్రసాద్‌ద్వివేదిగారిని కలవటం జరగలేదు. ఆయన ఆ సమయంలో ఎక్కడకో వెళ్ళారు.

ఈసారి ద్వివేదిగారు స్వయంగా కలవడానికి ముందుకు వచ్చారు. వారి కోరికపై దైవీ ప్రేరణతో కలకత్తాలో రెండు రోజులు ఉండేందుకు కేడియాగారి నివాసానికి వెళ్ళారు. కేడియా గారికి విదురుడి ఇంటికి శ్రీకృష్ణుడు వచ్చినట్లు అనుభవంలోనికి వచ్చింది. చాలా ఆనందంగా భక్తితో ఆయనకు ఆతిథ్యమిచ్చారు. ఆ సాయంత్రం శాంతినికేతన్ వెళ్ళేందుకు కార్యక్రమం వేసుకున్నారు. ద్వివేదిగారికి వీరి ఆగమనం గురించిన సూచన అందింది. ఆయన ప్రస్తుతం బాణభట్టు గారి ఆత్మకథ వ్రాస్తూ ఉన్నారు. కేడియాగారు ఆచార్యుల వారితో ద్వివేదిగారి నివాసానికి వెళ్లినపుడు ఆయన అక్కడ ఉద్యానవనంలో పచార్లు చేస్తున్నారు. వారితోపాటు క్షమిత్ మోహన్‌సేన్, విదుశేఖర్ శాస్త్రి ఉన్నారు. ద్వివేదిగారు శ్వేతవర్ణంతో ప్రకాశిస్తున్న గురుదేవుల శరీరాన్ని, తేజస్సుతో నిండి ఉన్న నేత్రాలను, తపో దీక్షతో కాంతులీనుతున్న ముఖాన్నీ రెప్పవాల్చకుండా చూస్తూ ఉండిపోయారు. తరువాత సంక్షిప్తంగా శ్రీ మోహన్‌సేన్, శ్రీ విదుశేఖర్‌ల పరిచయం చేయించారు.

శ్రీ ద్వివేది ఇలా అన్నారు "ఈ రోజు చాలా మంచిరోజు. మీరు వచ్చారు. కొద్ది సేపట్లో శ్రీ సి.వి.రామన్ గారి ఉపన్యాసం జరుగనున్నది. రామన్ గారు నోబెల్ పురస్కారం అందుకున్న

**ఏం చేయాలో చెప్పేది విజ్ఞానం.**

తరువాత అందరికీ సుపరిచితులయ్యారు. ఈ రోజు వారి ఉపన్యాసం భౌతిక విజ్ఞానంపై, రామన్ ప్రభావంపై కాకుండా విజ్ఞానానికి ఆధ్యాత్మికత ఆవశ్యకతపై మాట్లాడతారు". ఈ మాటలు విన్న యుగఋషి ఏమి అనలేదు. చిన్నగా నవ్వారు. తర్వాత ద్వివేదిగారు క్షమిత్ మోహన్, విదుశేఖర్ శాస్త్రి, కేడియా గార్లతో యుగఋషి సభామందిరానికి వెళ్లారు.

సి.వి.రామన్‌గారు పొడవాటి నల్లగౌన్ వేసుకుని నుంచుని ఇలా అంటున్నారు. "20వ శతాబ్దం విజ్ఞానానికి సంబంధించినది. ప్రతిదేశంలోను విజ్ఞాన స్పర్శ చూడవచ్చు. కాని విజ్ఞానం యొక్క ప్రయోగాలు మానవశ్రేయస్సు కొరకే జరగాలి. వైజ్ఞానికులు హృదయహీనులుగా ఉండకూడదు. వీరు సహృదయులై ఉండాలి. దీని కొరకు ఆధ్యాత్మికత సాహచర్యం ఎంతైనా అవసరం". రామన్ పలికే ప్రతిమాట ఆయన హృదయం లోనుంచి ఉప్పొంగుతున్నది. ఆయన ఉపన్యాసం పూర్తయ్యాక యుగఋషిని సి.వి.రామన్‌గారికి పరిచయం చేస్తానని ద్వివేదిగారు అన్నారు.

ద్వివేదిగారు యుగఋషిని, మిగిలినవారిని సి.వి.రామన్ గారితో కలుసుకునేందుకు తీసుకువెళ్ళారు. పరస్పర అభివాదములు, పరిచయ కార్యక్రమం తర్వాత అందరు రామన్‌గారి ఉపన్యాసాన్ని మెచ్చుకున్నారు. సి.వి.రామన్ అన్నారు–"మెచ్చుకోవటం కాదు. క్రియాన్వితం అవ్వాలి". అప్పుడు శ్రీరామశర్మ ఆచార్య ఇలా అన్నారు. "ఆధ్యాత్మిక క్షేత్రం కూడ క్రియాన్వితం అవ్వాలి. దానికి విజ్ఞానం యొక్క సాహచర్యం కావాలి. దీనిలో ఉన్న మూఢత్వాన్ని, భ్రాంతులను, అంధ విశ్వాసాలను విజ్ఞాన ప్రయోగాలే వదిలించగలుగుతాయి. ఆచార్యుల మాటలను అందరూ సమర్థించారు. సి.వి.రామన్ ఇలా అన్నారు–"20వ శతాబ్దం విజ్ఞానం యొక్క సమయం అయితే 21వ శతాబ్దం వైజ్ఞానిక ఆధ్యాత్మికత సమయం అని చర్చించుకున్నారు. తిరిగి వచ్చిన తరువాత జనవరి 1947 అఖండజ్యోతి వైజ్ఞానిక ఆధ్యాత్మికత అనే అంశంపై ప్రత్యేక సంచికగా వెలువడింది. దాని మొదటి పేజి చివర పంక్తిలో ఇలా వ్రాశారు. "అఖండజ్యోతి పాఠకులారా! వైజ్ఞానిక ఆధ్యాత్మికతను హృదయంగమము చేసుకోవాలి. ఇదే ఋషుల విజ్ఞానం".

*(అఖండజ్యోతి జులై 2009)*

★★★

## కష్టార్జితం

*లుహార్ ఒక గృహస్థుడు. నైపుణ్యంతో, శ్రమతో కుటుంబాన్ని చక్కగా పోషించుకుంటున్నాడు. అతని కుమారుడికి ఎక్కువగా ఖర్చుచేయడం అలవాటయింది. తండ్రి కుమారుడి మీద ఆంక్షలు విధించి ఇలా అన్నాడు– "నీవు కష్టపడి ఒక రూపాయి సంపాదించి తీసుకొనిరా" నీ ఖర్చుకు డబ్బిస్తాను.*

*బాలుడు ప్రయత్నించాడు. సాధించలేకపోయాడు. తను దాచుకున్న డబ్బునుంచి ఒక రూపాయి తీసుకొని వెళ్ళాడు. తండ్రి బట్టీ దగ్గర కూర్చున్నాడు. ఆ రూపాయిని చేతిలోకి తీసుకొని చూసి అన్నాడు ఇది నీ సంపాదన కాదని బట్టిలో విసిరేశాడు. కుమారుడు సిగ్గుపడి వెళ్ళిపోయాడు.*

*రెండవరోజు కూడా సంపాదించడం చేతకాక కుమారుడు చాటుగా తల్లిని అడిగి తీసుకువచ్చాడు. ఆ రోజు కూడా అలాగే జరిగింది. మూడవరోజు దొంగతనం చేసి తీసుకొచ్చాడు. కాని తండ్రిని మోసగించలేక పోయాడు. ప్రతిసారీ కష్టపడి సంపాదించినది కాదని తండ్రి బట్టీలో వేస్తూ వచ్చాడు.*

*సంపాదించకుండా పని జరగదని కొడుకు అర్థం చేసుకున్నాడు. రెండు రోజులు కష్టపడి ఏదో విధంగా ఒక రూపాయి సంపాదించి తీసుకువచ్చాడు. తండ్రి వాటిని చూసి కూడా అదే మాట చెప్పి బట్టీలో వెయ్యబోయాడు. కుమారుడు కేకవేస్తూ తండ్రి చెయ్యిపట్టుకొని 'ఏం జేస్తున్నావు నాన్నా! నా కష్టార్జితాన్ని వృధాగా బట్టిలో వేయవద్దు' అన్నాడు.*

*తండ్రి నవ్వాడు. ఇలా అన్నాడు – 'కుమారా! కష్టపడి సంపాదించడంలోని బాధ ఇప్పుడు అర్థమైందా? నువ్వు అనవసర పనులకు నా సంపాదనను ఖర్చు చేస్తుంటే నేను కూడా నీలాగనే విలవిలలాడాను."*

*పుత్రునికి అంతా అర్థమైంది. డబ్బును దుబారా చేయనని ప్రతినపూనాడు. తండ్రికి సహకరించడం మొదలుపెట్టాడు.*

★★★

**ఎలా చెయ్యాలో చెప్పేది బుద్ధి కుశలత.**

తెలుగు యోగులు

# రాధామహాలక్ష్మి

20వ శతాబ్దపు ప్రథమార్ధంలో ఉదయించిన ఈ భక్తురాలి పేరు హనుమాయమ్మ. చిన్నతనం నుంచి దైవభక్తి పెంపొందించటం వల్ల ఎప్పుడూ జపము, భజనలు చేస్తూండేది. చయనం కోటినారాయణ అనే సత్‌పురుషునితో ఈమెకు వివాహం జరిగింది. ఒక వైపు సాంసారిక బాధ్యతలు నెరవేరుస్తునే ఆధ్యాత్మిక మార్గంలో నిరంతరం సాధన చేస్తూ ఎన్నో దివ్యానుభూతులను పొందగల్గింది. ఇలా జీవితం గడుస్తూ ఉండగా శ్రీ రాళ్ళబండి వీరభద్రరావుగారు అనే ఒక గొప్పయోగి ఉద్యోగరీత్యా విద్యాశాఖలో పనిచేస్తూ గుంటూరుకు బదిలీ అయి వచ్చారు. ఆధ్యాత్మిక రంగానికి చెందినవాడు కావటం వల్ల వారితో పరిచయం లభించింది. సాధనలో ఒకే మార్గం కావటం వల్ల భజనలు, సద్గోష్ఠులు మొదలైన కార్యక్రమాలలో తరచుగా కలుస్తుండటం జరిగేది. నెమ్మదిగా ఆమె తన ఇంటినే ఆశ్రమంగా మార్చివేసింది. ఆమెకు, వీరభద్రరావుగారికి దుర్గాదేవి కలలో కనిపించి రాధామంత్రాన్ని ఉపదేశించింది. ఇద్దరూ విజయవాడ కనకదుర్గ ఆలయంలో మండల దీక్షచేసి రాధాదేవి యొక్క సాక్షాత్కారాన్ని పొందారు. రాధాదేవియొక్క సఖి అయిన రాధామహాలక్ష్మి (ఉపరాధ) ఆమె శరీరాన్ని ఆవేశించటం మొదలయింది. గోలోకంతో బృందావన ధామానికి ఉన్న అనుబంధాలు తెలియవచ్చాయి. వీరభద్రరావు గారు ఆవాహనం చేసినప్పుడల్లా ఈమె శరీరంలోకి దేవతలు రావడం మొదలుపెట్టారు. దీనివల్ల వారికి ఆధ్యాత్మిక, చైతన్యవృద్ధి కలగటమే కాక వివిధ సమస్యలతో వచ్చేవారి బాధలకు కారణాలను తెలుసుకొని వారికి పరిష్కారం చేయటానికి ఈ దేవతావేశం ఎంతగానో తోడ్పడింది. వీరభద్రరావుగారు ఈమె సహకారంతో కొన్నివందల వేలమంది బాధలను తొలగించారు. కొన్నాళ్ళకు వీరభద్రరావుగారికి బదిలీఅయి ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసివచ్చింది. తరువాత కూడ ఈమె స్వయంగా ఎంతో మందికి బాధలు పోగొట్టి ఉపకారాలు చేసింది.

ఇది ఇలా జరుగుతుండగా వీరభద్రరావుగారు తాను ఉన్న చోటు నుండి మరొక చోటుకు బదిలీ అయి వెడుతూ రైలు ప్రయాణంలో గుంటూరు స్టేషన్‌మీదుగా వెడుతున్నారు. ఆయనను చూడటానికి హనుమాయమ్మగారు ఇతర భక్తులతో కలసి వెళ్ళారు. వారితో మాట్లాడుతుండగా దివ్యావేశం వచ్చి ప్రయాణం ఆపుమని ఆదేశించింది. ఆయన దిగి ఆశ్రమానికి వచ్చారు. వెంటనే ఆయనకు పెద్దజ్వరం వచ్చింది. స్పృహ తప్పిపోయింది. డాక్టర్లు వచ్చి చూచి నాడి అందకపోవటం గమనించి బతకటం కష్టమని పెదవి విరిచి వెళ్ళిపోయారు. ఇంతలో హనుమాయమ్మగారికి మళ్ళీ దివ్యావేశం వచ్చింది. ఈయనకు ఎవరైనా తమ ఆయువు ధార పోస్తే మరి కొంతకాలం జీవించుతాడు అని చెప్పి దేవతవెళ్ళిపోయింది. భక్తులెవ్వరూ ముందుకు రాలేదు. అప్పుడు హనుమాయమ్మ గారు, ఆమె భర్త అయిన కోటినారాయణ గారు చేతులు జోడించి రాధాదేవికి మ్రొక్కి "జగన్మాతా! వందల వేలమందికి తన తపఃశక్తితో ఉపకారం చేస్తున్న ఈ మహానుభావుడు జీవించటం అవసరం. మా ఆయువులు ఎంత కావాలంటే అంత తీసుకొని ఆయనను బ్రతికించు" అని ప్రార్థించారు. కాసేపటికి ఆయనకు స్పృహ వచ్చింది. జ్వరం తగ్గిపోయింది. ఆయన ఉద్యోగానికి రిజైన్ చేసి ఈ ఆశ్రమంలో ఉండటం మొదలుపెట్టారు. అసంఖ్యాక ప్రజలకు ఉపకారాలు చేస్తూ బాధితులకు మంత్రం వేస్తూ ప్రజా సేవ చేస్తున్నారు. దేశ సంచారం ప్రారంభమయింది. అనేక పట్టణాలలో కొన్నాళ్ళు ఉండటం, అక్కడ బాధితులకు మంత్రములిచ్చి తీర్థములిచ్చి బాగుచేయటం జరుగుతున్నది. ఒక్కసారి ఒరిస్సాలో ఉండగా వీరి కీర్తి ప్రతిష్ఠలు చూచి ఓర్వలేని ఒక మాంత్రికుడు వీరిమీద ప్రయోగం చేశాడు. ఆ ప్రయోగశక్తిని రాధాదేవి పరివారం బంధించింది. ఇలా రెండు సార్లు జరిగింది. ఆ మాంత్రికుడు తన శక్తిని కోల్పోయి, వీరికి పాదాక్రాంతుడయినాడు. ఇటువంటి సంఘటనలు జరగటం, కొన్ని చోట్ల మనుష్యులనావేశించిన భూత ప్రేతములు వీరిని బెదిరించటం,

**పురుషునికి ప్రపంచమే ఇల్లు - స్త్రీకి ఇల్లే ప్రపంచం.**

రాధాదేవి అనుగ్రహం వల్ల వాటిని వీరు పారద్రోలటం జరిగింది. స్పర్శమాత్రం చేత ఎంతటి బాధలనయినా పోగొట్టగల శక్తిని వీరికి పరమేశ్వరి ప్రసాదించింది. అన్నింటిలోనూ ఆశ్చర్యకరమయినది వీరభద్రరావుగారి ఇచ్ఛవల్ల రాధామహలక్ష్మి హనుమాయమ్మ శరీరంలో ఆవహించి ఆధ్యాత్మికమైన సందేశాలు ఇవ్వటం ఎందరో చూచారు. ఈవిధంగా త్యాగస్వరూపిణి, తపోనిధి అయిన ఈమె, రాధామహలక్ష్మీదేవి ప్రవేశించటం మొదలయిన తరువాత ఆమె పేరు కూడా రాధామహాలక్ష్మి అని మార్చబడింది. కొంతకాలం ఇలా గడచిన తరువాత (19-4-1973) ఏదో ఒక వ్యాధిని నిమిత్తం చేసుకొని ప్రాణపక్షి ఎగిరిపోయింది. వీరభద్రరావుగారు ఆశ్రమాన్ని నిర్వహిస్తూ ఉండగా కొన్నాళ్ళకు ఆమె భర్త కోటినారాయణగారు కూడా పరమపదించారు. వీరభద్రరావుగారు "రాధికాప్రసాద్ మహారాజ్" అన్న పేరుతో వ్యవహరించబడుతూ ఉండేవారు. అయితే భక్తులు ఆయను నాన్నగారు అని పిలవటం అలవాటయింది. రాధామహాలక్ష్మమ్మ కోటినారాయణ దంపతులకు పిల్లలు లేరు. కుమారి అంజనీదేవి అన్న బాలిక వారి వంశమునకు చెందిన అమ్మాయి నాన్నగారి శిష్యురాలై, యోగసాధనలో పురోగమించింది. నాన్నగారామెను రాధామహలక్ష్మమ్మ గారివలెనే దేవతావేశాన్ని పొందగలిగిన యోగినిగా తీర్చిదిద్దారు. అంజనీకుమారి శరీరంలోకి దేవత అయిన రాధామహలక్ష్మియేకాక, భౌతికశరీరాన్ని విడిచిపెట్టిన రాధామహలక్ష్మి (హనుమాయమ్మగారు) కూడ వచ్చి తాను రాధాసఖిగా ఉన్న విషయాన్ని తెలియచేసింది. అప్పుడప్పుడు ఆమె వచ్చి దివ్య భూమికలలో ఉండే విశేషాలు తెలియచేస్తూ భక్తి సందేశాలు ఇస్తూ ఉండేది. రాధాదేవి అనుగ్రహం వల్ల రాధామహలక్ష్మి కోటి నారాయణ దంపతుల త్యాగం వల్ల ఆయుర్వృద్ధి పొందిన రాధికా ప్రసాద్‌మహరాజ్‌గారు తన 103వ ఏట భౌతిక శరీరాన్ని వదిలి రాధాసఖిగా మారిపోయారు. తరువాత ఇప్పుడు ఆ సంస్థకు కుమారి అంజనీదేవి మాతాజీ రాధామహాలక్ష్మి అన్న పేరుతో అధ్యక్షురాలయి వ్యవహరిస్తున్నది.

★★★

## స్వయంకృషిగల బాలుడు

ఫ్రాన్సుగాయని మిలిథాన్ వద్దకు ఒక పేదబాలుడు జీర్ణవస్త్రాలతో వచ్చి దీనంగా నిలబడ్డాడు. ఆమె హృదయం ద్రవించి ఆదరంతో దగ్గరకు తీసికొని నీకేమి కావాలని ప్రశ్నించింది. బాలుడు వినయంతో నాపేరు పియరే. మా అమ్మకు జబ్బుగా ఉంది. వైద్యం చేయించటానికిగాని, ఆహారం యివ్వటానికిగాని నావద్ద ఏమాత్రం పైసలు లేవు అని చెప్పి తలవంచుకొన్నాడు. అయితే నీకు ఆర్థిక సహాయం కావాలి. అంతేనా అన్నది మెలిథాన్. పియరే కాదన్నాడు. ఈమె ఆశ్చర్యంగా అయితే ఎందుకు వచ్చినట్లని ప్రశ్నించింది. బాలుడు వినయంగా నా ప్రతిభనుగాని, నా శక్తినిగాని మీరు స్వీకరించి దానికి తగిన విలువ చెల్లించే ఏర్పాటు చేయండి. ఆ సొమ్ముతోనే అమ్మ కోలుకుంటుందిఅని నా విశ్వాసం. **ఉచితంగా స్వీకరించిన వాటివలన సత్ఫలితాలు రావు** అన్నాడు ఖచ్చితంగా. ఆమె తనలోని ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం కానీయక సాధారణ శైలిలో బొత్తిగా చిన్నవాడివి, ఏమి పనిచేస్తావ్ అని అన్నది. బాలుడు మలినమైన జేబునుండి ఒక కాగితాన్ని తీసి ఆమె చేతిలో పెడుతూ నేను ఒక చిన్న కవిత వ్రాశాను. మీరు గాయని కాబట్టి దయతో ఈ కవితను ఒక సంగీత సభలో పాడండి. మిమ్ములను సత్కరించి ఇచ్చిన ధనాన్ని నాకివ్వండి చాలును అని కోరాడు. మెలిథాన్ కన్నులు చమర్చేయి. ఆ చిన్నవాడిని దగ్గర కూర్చోబెట్టుకొని ఆ కన్నులలోనికి చూస్తూ సాయంత్రం నిండు సభలో ఆ కవితను ఆర్తితోపాడి శ్రోతలకు వినిపించింది. శ్రోతల నయనాలు కూడా అశ్రుపూరితాలయ్యాయి. ప్రజలు గొప్పగొప్ప కానుకలను ఇచ్చి మెలిథాన్‌ను ప్రశంసించేరు. ఆమె ఆ సత్కారానికి అర్హుడు **పియరే** అనే ఈ చిన్నబాలుడిని సభకు పరిచయం చేసి లభించిన మొత్తం ధనరాశిని అతనికే ఇచ్చి తల్లి వద్దకు పంపించింది. ఆ విధంగా ఆ బాలుడు తల్లికి వైద్యం చేయించి మాతృ ఋణాన్ని తీర్చుకోగలిగేడు.

**శాంతి అనేది ఆకాశం నుండి ఊడి పడదు - అవకాశం కల్పిస్తేనే వస్తుంది.**

కుటుంబ నిర్మాణం

# సదాచారాలను సొంతం చేసుకోవాలి

మనుష్యుల పరిచయం వారి ఆచార వ్యవహారాల వల్లనే తెలుస్తుంది. వారు కూర్చోవటం, లేవటం, తిరగటం, మాట్లాడటం, ఇతరుల ఇళ్ళకు వెళ్ళటం, దారిలో పరిచయస్థులను కలుసుకోవటం మొదలైన ప్రతి పనిలోనూ వారి ఔన్నత్యం తెలిసి వస్తుంది.

సభ్యత మరియు సదాచారాల పరస్పర సంబంధం చాలా పటిష్ఠమైంది. ఒకటి లేకుండా ఇంకొకటి పొందటమనే ఆలోచన నిరర్థకమైంది. సభ్యత కలిగి ఉన్న వారే సదాచార పరులు. సదాచారాలను పాటించే వారే సభ్యత కలవారు అని చెప్పవచ్చు. ఇటువంటి వ్యక్తులు వారి మాటలతో ఇతరులకు కష్టం కలుగనీయరు. వారి ఆలోచనలను మర్యాదపూర్వకంగా తెలియపరుస్తారు. ఇతరులు చెప్పే మాటలను కూడా ఆదరంగా వింటారు. ఆత్మ ప్రశంస చేసుకోరు. వారిని వారే పొగడుకోవటం, మంచి వ్యక్తుల లక్షణం కాదని వారికి తెలుసు. శిష్టాచారులు, సభ్యత కల వ్యక్తుల ఆచార వ్యవహారాలు, ప్రవర్తన, వారితో సంబంధం గల వ్యక్తులు ప్రశంసించే విధంగా ఉంటాయి. ప్రశంసలను వినాలనే కోరిక వ్యక్తిత్వ నిర్మాణంలో అడ్డంకిని కల్గిస్తుంది. శిష్టాచారంలో గల మహత్తు ఇచ్చిపుచ్చుకోవడాలతో ప్రమేయం లేకుండానే వారిపై గౌరవ మర్యాదలను తెచ్చిపెడుతుంది. సదాచారాలు లోపించిన వారిని ఇంటిలోని వ్యక్తులు కూడా గౌరవించరు.

చాలామంది అందమైన, ఖరీదైన వస్త్రాలను ధరించడమే సభ్యత అనుకుంటారు. కానీ ఈ ఆలోచన తప్పు. ఖరీదైన, అందమైన వస్త్రాలను ధరించిన వ్యక్తి అనాచారపరుడు కావచ్చు. గ్రామంలో పొలం దున్నే చదువురాని రైతు కూడా సదాచార సంపన్నుడుగా ఉండవచ్చు. ఈ దృష్టితో పరిశీలించి చూస్తే ఆధునిక విద్యను పొందిన నవ యువకులను చూసినప్పుడు మనదేశంలో శిష్టాచారానికి గల విలువలు తగ్గిపోతున్నాయనే అనుమానం కలిగితీరుతుంది.

ఈ రోజుల్లో చదువుకునే విద్యార్థులు చాలామంది సభ్యతను, సంస్కారాన్ని పాటించటం మానివేశారు. అశ్లీల సంభాషణలు చేయడమే వారికి ఆనందాన్ని ఇస్తున్నది.

మన ఆచరణలో, జీవన విధానంలో అనేకమైన చిన్న, పెద్ద చెడు అలవాట్లు కలిసిపోయాయి. అలవాటు అవటం వలన అవి మనకు చెడ్డగా అనిపించకపోయినా బయటి వ్యక్తులకు అసభ్యంగా అనిపిస్తాయి. ఇతరుల వద్ద నుండి వస్తువులు అప్పుతీసుకుని తిరిగి ఇవ్వటంపై శ్రద్ధ చూపించకపోవటం, అడిగి తీసుకున్న వస్తువులను జాగ్రత్తగా ఉంచకపోవటం, వస్తువులను పాడుచేసి ఇవ్వటం, అప్పుచేసి వస్తువులను కొని వాటి ఖరీదు చెల్లించటంలో నిర్లక్ష్యం వహించటం, వ్యక్తులను ఇంటికి ఆహ్వానించి తాము బయటికి వెళ్ళడం, ఉత్తరాలకు సరియైన సమయంలో జవాబులు ఇవ్వకపోవడం, ఆఫీసులకు ఆలస్యంగా వెళ్ళటం మొదలైన వందల కొద్ది ఉదాహరణలు కోకొల్లలుగా కనిపిస్తాయి. అవి మనకు తెలియకుండానే మనలను ఇతరుల దృష్టిలో తేలిక పరుస్తాయి.

ఈ ప్రపంచంలో వివిధ రకాలైన జాతులు, మతాలు, సంప్రదాయాలు, నీరు,గాలి, వాతావరణం మొదలైన వాటిలో భేదాలుంటాయి. ఈ భేదాలు రాజనైతిక, భౌగోళిక, ఆర్థిక, సామాజిక దృష్టిలో వేల భాగాలుగా విభజించుకోవచ్చు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొన్నట్లయితే మనుష్యులందరూ ఒకే విధమైన ఆచారాలను, నియమాలను పాటించాలని ఆశించటం సరియైనది కాదు అనిపిస్తుంది. హిందువుల, ముస్లిముల, క్రిష్టియన్ల ఆచారాలలో అనేక విషయాలు విరుద్ధంగా ఉంటాయి. అయినప్పటికీ వర్తమానకాలంలో వైజ్ఞానిక ప్రగతి మూలంగా వీరందరూ కలుసుకోవడం, పరస్పరం కలసి మెలసి జీవించడంలో జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో ఆచారాలలో కొన్ని సామాన్య నియమాలు ఏర్పరచి, వాటిని పాటించడం ప్రతివారికీ అవసరం. ఇతర దేశాల సభ్యత, ఆచారాలు బాహ్య నియమాలకు అధికమైన ప్రాధాన్యతను ఇస్తాయి. భారతీయ సంస్కృతి పరిచయస్థుల పట్ల బాహ్య నియమాలను పాటిస్తూ మనసులో సద్భావనను, సహృదయతను కలిగి ఉండాలని బోధిస్తుంది. ఈ అంతరంగ భావనల నుండే మన వ్యవహారంలో వాస్తవికత ఉత్పన్నం అవుతుంది. గొప్ప గొప్ప వ్యక్తులను ఆ వైపుకు ఆకర్షింపచేస్తుంది.

సదాచారాలకు, సహృదయతకు పరస్పర సంబంధం చాలా ఉంది. ఆలోచనలు, మానసిక ప్రవృత్తి క్షీణించి, నీరసమై కఠినులైన వారు ఎవరితోను ప్రేమ పూర్వకంగా ప్రవర్తించలేరు. దీని ఫలితంగా ఇతరులు కూడా వారిని నిర్లక్ష్యంగా చూస్తారు. వారు జీవితంలో ఒంటరి వారై నిరాశా నిస్పృహలతో గడుపుతారు. సహృదయత అనే మంచి గుణం వలన సాధారణ వ్యక్తులైనప్పటికీ అనేకమందికి ప్రాణస్నేహితులై గాఢ సంబంధాలను ఏర్పరచుకొంటారు. ఆనందమయ జీవితాన్ని గడుపుతారు.

**తెలిసినదానికన్నా తక్కువ మాట్లాడు - మాట్లాడిన దానికన్నా ఎక్కువ చెయ్యి.**

సదాచార నియమాలన్నింటిలో ముఖ్యంగా మన వద్దకు వచ్చిన వారిని కేవలం పైకే కాక మనస్ఫూర్తిగా ఆదరించాలి. అన్నింటికంటే ముందుగా మానవతా దృక్పథంతో అవసరమైన వారికి చేతనైన సేవ చేయాలని నిర్ణయించుకోవాలి. ఇది కనుక మనం పాటించలేకపోయినట్లయితే మానవతను కోల్పోయిన వారలం అవుతాం. ఇదే భారతీయ సంస్కృతికి ఆధారం. దీనిని బట్టే అతిథి సత్కారం గృహస్థులకు అన్నింటికంటే ముఖ్యమైన ధర్మమని చెప్పబడింది. ఇది మన దేశం అనుసరిస్తున్న సదాచారం. దీనివల్ల మనం కష్టాలను సహించటానికి, త్యాగం చేయటానికి, వెనుకంజ వేయకూడదని తెలుస్తోంది.

పూర్వకాలపు పరిస్థితులకు ఇప్పటికీ చాలా భేదం ఉంది. ప్రపంచంలోని వ్యక్తులందరూ ఒకదేశం నుండి ఇంకో దేశానికి రాకపోకలు సాగించారు. సందర్భానుసారంగా పరస్పర సహకారాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి స్థితిలో శిష్టాచారాన్ని నిర్ధారించటం కష్టం. ఎందువల్లనంటే ఒక దేశంలో సదాచారంగా భావింపబడేది. ఇంకో దేశంలో అనాచారంగా భావించవచ్చు. దాదాపు 100–150 సంవత్సరాలనుండి ప్రపంచంలో విభిన్న సభ్యతలు కలిసిపోతున్నాయి. అయినప్పటికీ అందరిచే అంగీకరింపబడిన నియమాలను వెలికి దీయడం జరిగింది. వానినే అంతర్రాష్ట్రీయ శిష్టాచారాలుగా చెప్పవచ్చు.

భారతీయ సంస్కృతికి అనుకూలమైన ఆచార నియమాలను గురించి చెప్పుకున్నట్లయితే, వాటిలో కొన్నింటిని ఈ విధంగా వర్గీకరణ చేయవచ్చు.

**ధార్మిక, నైతిక మరియు చారిత్రక ఆచారాలు :**

1. అన్ని ధర్మాలను గౌరవించటం మన కర్తవ్యం. ఏ ధర్మానికి చెందిన రీతి రివాజులతోను జోక్యం కల్గించుకోవటం మానవత్వం కాదు.
2. ఎవ్వరినీ ఈశ్వరోపాసన లేక మరేవిధమైన జపతపాదులు చేసే సమయంలో ఆటంకం కల్గించడం మంచి పద్ధతి కాదు.
3. చాలా మంది వ్యక్తులు సీతారామ్, రాధేశ్యామ్, శివ–శివ మొదలైన నామాలను చాలా గట్టిగా అరుస్తూ చదువుతుంటారు. మన భక్తితో ఇతరులకు ఇబ్బంది కలిగించడం న్యాయం కాదు.
4. శారీరక కష్టం చేయకల్గి కూడా కష్టించకుండా యాచించి భుజించటం మంచి పద్ధతి కాదు.
5. సోమరులకు దానం చేయటం సరియైనది కాదనిపిస్తే, దానిని సరియైన పద్ధతిలో వ్యక్తం చేయాలి.
6. ధార్మిక ప్రదేశాల వద్ద శాంతి పూర్వక వాతావరణాన్ని నెలకొల్పాలి.
7. సూర్యోదయానికి ముందే నిద్రలేవడం భారతీయ సంస్కృతి లోని ఒక ముఖ్యనియమం. దీనివలన ఆరోగ్యమేకాక, మానవుల మానసిక, ఆధ్యాత్మికస్థితులు కూడా మెరుగు పడతాయి.
8. భారతీయ సంప్రదాయం ప్రకారం అవి ఏ మతానికి, సంప్రదాయానికి చెందినవైనా పవిత్ర ప్రదేశాలకు పాదరక్షలతో వెళ్ళరాదు.
9. దేవస్థానాలలో ప్రవేశించేటపుడు పాదరక్షలు, లాఠీ, గొడుగు మొదలైన వస్తువులను బయటనే వదిలివేయాలి.
10. ఇటువంటి ప్రదేశాలలో నాలుగు వైపులా గోడలు కానీ, లేక వేర్వేరు అడ్డంకులను కానీ ఏర్పరిచినపుడు, అక్కడి వారి అనుమతి లేకుండా లోనికి పోవడం అనుచితం.
11. స్టేషను, బస్టాపు, పోస్టాఫీసు, సినిమా హాలు ఆటలకు టిక్కెట్లు అమ్మే కిటికీల వద్ద తోసుకోవటం మంచిది కాదు. ఒక లైనులో నిలబడి శాంతిపూర్వకంగా వారి నెంబరు వచ్చాకే వెళ్ళాలి.
12. సామాజిక స్థలాలలో, నివసించే ప్రదేశాలలో రాకపోకలకై నిర్దేశించబడిన సూచనలకు సరియైన విధంగా పాటించాలి.
13. సభలు, సామాజిక ఉత్సవాలు ప్రదర్శనలు, ఆటలు మొదలైన వాటిలో నియమాలను ఉల్లంఘించటం, గొడవలు చేయటం మొదలైనవి పనికిరావు.
14. టికెట్లు కొని వెళ్ళవలసిన ప్రదేశాలకు టికెట్టు లేకుండా వెళ్ళకూడదు. ఆవిధంగా వెళ్ళడం క్షమించరాని నేరం అవుతుంది.

**సామాజిక వ్యవహారాలలో సదాచారాలు :**

1. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచి గురువులకు, తల్లి దండ్రుల పాదాలకు నమస్కరించడం భారతీయ సంస్కృతిలోని విశిష్ట నియమం.
2. ఇంటికి ఎవరైనా వ్యక్తి వచ్చినపుడు, వారికి ప్రేమ పూర్వకంగా నమస్కారం చేయాలి. వారి ఎదుట చేతులు, కాళ్ళు జాపుకుని అమర్యాదాపూర్వకంగా కూర్చోకూడదు.
3. మన ఇంటికి వచ్చిన గౌరవనీయులైన వ్యక్తుల ఎదుట ఇంటిలోని వ్యక్తులను కాని లేక సేవకులపైన కానీ కోపాన్ని ప్రకటించటం లేక తిట్టటం సరియైన పద్ధతి కాదు.
4. మన కంటే పెద్దవారు లేక గౌరవనీయ వ్యక్తుల ఎదుట వారి ఆసనం కంటే ఉన్నతమైన ఆసనంపై కూర్చుండకూడదు.

**ఇతరులను ద్వేషించడం అంటే ఎలుకలు ఉన్నాయని చూరుకు నిప్పుపెట్టుకోవడం లాంటిదే.**

5. తుమ్ము, దగ్గు మొదలైనవి వచ్చినపుడు రుమాలును అడ్డుపెట్టుకోవటం సభ్యతకు చిహ్నం.
6. వెళ్ళే దారిలో ఎవరైనా పరిచయస్థులు కనపడినట్లయితే వీలయినంతవరకూ, స్వయంగా నమస్కారం చేయాలి. వృద్ధులకు, రోగులకు, స్త్రీలకు, కుంటి, గ్రుడ్డి వారికి దారి నుండి ప్రక్కకు తొలిగి దారి ఇవ్వాలి.
7. ఎవరింటికైనా వెళ్ళినపుడు గృహ యజమాని, ఇతర సభ్యుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలి.
8. సామాజిక ఉత్సవాలు లేక సభ సమ్మేళనాల మధ్యలో అకారణంగా, అకస్మాత్తుగా లేచి వెళ్ళడం అసభ్యతకు సూచకం. ఇటువంటి పరిస్థితులలో వెళ్ళకుండా ఉండటం లేక ఎవరి దృష్టినీ ఆకర్షించకుండా వెనుకవైపున కూర్చోవటం చేయాలి. ఇదేవిధంగా వ్రతాలకు, సభలకు వెళ్ళిన సమయంలో నిద్రపోవటం, కునికిపాట్లు పడటం కూడా అనుచితమే.
9. ప్రక్కనున్న వారితో ఎప్పుడూ ప్రేమతో వ్యవహరించాలి. అవసరమైనపుడు అన్ని విధాలా సహాయం చేయాలి. వారు బీదవారు అయినట్లయితే వారి ఎదుట వైభవాన్ని ప్రదర్శించి, వారిని సిగ్గుపడేలా చేయాలని ప్రయత్నించకూడదు. ఇదేవిధంగా ధనవంతుల వద్ద మీ బాధలను తెలియచేసి వారి సానుభూతిని పొందటానికి ప్రయత్నించడం కూడా మంచిది కాదు. వీలయినంత వరకూ ప్రక్కవారితో సహనంగా వ్యవహరించాలి. వారికి చేసే సహాయం కూడా కర్తవ్యంగా భావించి నిస్వార్థ భావంతో చేయాలి.
10. రోగుల వద్దకు వెళ్ళినట్లయితే వారితో జబ్బును గురించి ఎక్కువ చేసి మాట్లాడకూడదు. వారి వద్ద నిరాశాపూర్వకంగా మాట్లాడకూడదు. రోగి దగ్గరకు ఎప్పుడూ ప్రసన్న వదనంతో వెళ్ళాలి. మన మాటలతో ధైర్యాన్ని పెంచాలి.
11. దారిలో గట్టిగా పిలవటం సరియైనది కాదు. గట్టిగా మాట్లాడటం, పక పకా నవ్వడం సరియైనవి కావు.
12. దారిలో స్త్రీల వెనుకగా వారు సంకోచపడేవిధంగా నడవకూడదు. ఏ స్త్రీనయినా మాటి మాటికి మెడ వెనుకకు త్రిప్పి చూడకూడదు. ఇదే విధంగా బయట నిలబడి ఆడవారిని చూడటం, కళ్ళు ఉరమటం మొదలైనవి అసభ్యతకు చిహ్నాలు.
13. సత్రాలు, ధర్మశాలలు, పార్కులు మొదలైన ప్రదేశాల శుభ్రతపై విశేషమైన దృష్టిని ఉంచాలి. మన పని పూర్తయిన తరువాత వాటిని అశుభ్రంగా వదిలివేయటం అసభ్యత.

**ఆరోగ్య రక్షణకు అన్నపానాదులకై శిష్టాచారాలు :**

1. భోజనం చేసే ప్రదేశం శుభ్రంగా, అందంగా ఉండటం అవసరం.
2. భోజనం చేసేటప్పుడు, నీరు త్రాగేటప్పుడు శబ్దం చేయటం అసభ్యత.
3. కుడి చేతితో భోజనం చేయాలి. కూరలు, పప్పు మొదలైనవాటిని వేళ్ళతో కలిపి, ఆ వ్రేళ్ళను నాకటం అసభ్యత.
4. నీరు మొదలైన త్రాగే పదార్థాలను నుంచునిత్రాగటం సరియైనది కాదు. ఆరోగ్యానికి కూడా హానికరం.
5. భోజనం ప్రశాంతంగా, నిశ్చింతంగా చేయాలి.
6. నడుస్తూ, తిరుగుతూ భోజనం చేయటం ఆరోగ్యానికి హానికరమే కాక సభ్యతకు వ్యతిరేకం కూడా.
7. తినే వాటిపై నుండి, త్రాగేవాటిపై నుండి దాటి నడవటం చెడ్డ అలవాటు.

**వ్యావహారిక విషయాలలో శిష్టాచారాలు :**

1. ఎక్కడైనా ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కూర్చుని మాట్లాకుంటున్న సమయంలో అక్కడకు వెళ్ళి కూర్చోవడం తగదు.
2. మాట్లాడే సమయంలో అవసరమైన, అనుచితమైన మాట ఏదైనా వస్తే వెంటనే క్షమించుమని అడగాలి.
3. మాట్లాడే సమయంలో కేవలం మీరొక్కరే మాట్లాడుతూ ఉండటమేకాక, ఇతరులకు కూడా అవకాశమివ్వాలి.
4. కఠినంగా మాట్లాడి విషయాన్ని త్వరగా జగడంగా మార్చటం మూర్ఖత.
5. మాట్లాడేటప్పుడు మాటిమాటికీ తిట్లు, చెడ్డ పదాలను ఉపయోగించటం రోత.
6. వాయిదా వేసిన పనిని యధాశక్తి పూర్తి చేయటానికి ప్రయత్నించాలి.
7. ఏ మాటనైనా అధికంగా పెంచకూడదు.

శిష్టాచారపరులు మనోవాక్కాయ కర్మలతో ఎవరికీ హాని కలిగించరు. చెడు మాట్లాడరు. మనసులోనైనా ఇంకొకరి చెడు కోరుకోరు. ఇతరులకు దుఃఖాన్ని కల్గించే పనిచేయరు. వినయం, మధుర వ్యవహారం వారి జీవనశైలి. అందుకే సదాచారాలను సొంతం చేసుకుందాం.

*అనువాదం - ఎ.ఆర్.నిర్మల*

★★★

**హింసను కన్న తల్లి అసహనమే - మహాత్మాగాంధీ.**

నావారితో నామాట

# శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-8

## సామూహిక జప సాధన ఒక రూపుదిద్దుకుంది

### నవయుగ నిర్మాణానికి పునాదిరాయి సాధనా శక్తి

పరమపూజ్య గురుదేవుల శతజయంతి సందర్భంగా సామూహిక జపవిధానాన్ని ప్రధానంగా తీసుకున్న విషయం గతమాసంలో చర్చించుకున్నాం. సామూహిక సాధనా శక్తి అఖండమైనది. అద్భుతమైనది. మూల శోధన ద్వారా చారిత్రక ఉదాహరణలతో వివరించడం జరిగింది. శత జయంతి సందర్భంగా ఈ సంవత్సరం అత్యంత కీలకమైంది. ఈ యుగసంధి కాలం మనకు చక్కని మలుపు. సత్యయుగం రావడానికి అన్ని మార్గాలు తెరుచుకుంటూ ఉన్నాయి. భవిష్యవేత్తలు తెలిపిన విషయాలు మనలను ముందుకు నడిపిస్తున్నాయి. 2011 నుండి 2012 ను దాటగలిగామంటే ఆపై రోజులు శుభకరమైనవి అని తెలుసుకోవచ్చు. భారతమాత శిరస్సు మరికొంత ఉన్నతం అవుతుంది. భవిష్యత్తును గూర్చి చర్చించుకుందాం.

### వినాశము - దృష్టి

వికృతమైన ఆలోచనలు, పతనమైన చరిత్ర కలసి సూక్ష్మ జగత్తును కలుషితం చేస్తున్నాయి. ప్రకృతి తన సహజ గుణాన్ని కోల్పోయింది. అనేకమైన వైపరీత్యాలు సృష్టిస్తోంది. ఋతుధర్మాలు సరిగ్గా నడవడం లేదు. అతివృష్టి లేకపోతే అనావృష్టి, కరువు కాటకాలు, భూకంపాలు, కలరా, సునామీ మొదలైన ప్రళయాలు పెరిగిపోతూ ఉన్నాయి. మానవునిలో సద్భావనలు అంతరించిపోతున్నాయి. కామపిశాచం వెర్రితలలు వేస్తోంది. మానసిక వికృతులు పెచ్చు పెరిగాయి. యుద్ధోన్మాదం, ఉగ్రవాదం హద్దులు దాటుతున్నాయి. ఏ ప్రాణికి భద్రత లేకుండా పోయింది. ఒకసారి జలప్రళయం, మరొక్కసారి హిమ ప్రళయం. అన్ని ప్రళయాలు మహావినాశాన్ని సూచిస్తున్నాయి.

కాని సృష్టికర్త ఆవిధంగా జరగనీయడు. ఆయన ఈ భూమిని, ప్రకృతి సంపదను, మానవీయ శక్తిని సమర్థవంతంగా సరిదిద్దగలడు. సృష్టి ప్రారంభం అయిన నాటి నుండి ఇప్పటివరకు అనేకమైన ఆపదలు, ప్రళయాలు ఎన్నో వచ్చాయి. కాని సరి అయిన సమయం చూచి వాటిని త్రిప్పికొడుతూనే ఉన్నారు. ఒక్కసారి స్కైలాబ్ వృత్తాంతాన్ని గుర్తుచేసుకుంటే చాలు. ఆపదలు ఖచ్చితంగా వస్తాయి. అందులో ఏ మాత్రం సందేహం లేదు. అయినా భయపడాల్సిన పనిలేదు. సత్యయుగ వాతావరణం నిర్మాణం అవుతోంది. ఇదే సరిఅయిన సమయం (అఖండజ్యోతి -నవంబరు 1988-60వ పేజి)

### ఆధ్యాత్మిక చికిత్సయే కర్తవ్యం

మనం మన గురుదేవుల మాట మీద నమ్మకం పెట్టుకోవాలి. వారిమాట ప్రకారం సమాజంలో ఆధ్యాత్మికతను వృద్ధిచేయాలి. యుగ సంధి సమయంలో దేవతల శక్తిని కూడగట్టుకుని దుర్గాశక్తి మనకు సహకరించింది. ఋషుల రక్తాన్ని పంచుకొని సంస్కృతీ సీత జన్మించింది. బుద్ధ ధర్మం చక్రాన్ని త్రిప్పుతూ భిక్షులను ఆధ్యాత్మికతలో ఓలలాడించింది. గాంధీజీ సత్యాగ్రహాన్ని పాటిస్తూ స్వాతంత్ర్యాన్ని తీసుకుని వచ్చారు. రమణ మహర్షి, అరవింద మహర్షి మొదలైన వారి తపస్సులు సూక్ష్మ జగత్తును సృష్టించాయి. రాబోయే విశ్వవినాశనాన్ని నిలుపుచేసి జగత్తును రక్షించాలంటే దేవ మానవుల సాధన కావాలి. అప్పుడే ఈ భగీరథ ప్రయత్నం సఫలం అవుతుంది.

ఈ కార్యాన్ని సఫలం చేయాలంటే భారతదేశంలోనే కాదు, విశ్వమంతా సామూహిక జపాన్ని ఈ ఆశ్వయుజ నవరాత్రుల నుండి ప్రారంభించాలన్న సంకల్పం ఉంది. దీనినే శతజయంతి సాధనా రూపంలో ఋత్విజులు, వరిణీ, భాగీదారుల ద్వారా వ్యక్తిగత స్థాయిలో చైత్రనవరాత్రుల నుండి ప్రారంభించడం జరిగింది. శక్తి పీఠాలలో, ప్రజ్ఞా సంస్థానాలలో, గాయత్రీ చేతనా కేంద్రాలలో, సత్సంగ భవనాలలో, ప్రజ్ఞామండళ్ళలో, మహిళామండళ్ళలో, కార్యాలయాలలో సామూహిక సాధనా రూపంలో రెండు సంవత్సరాల కొరకు ఉద్యమంలా నడపాలన్న ఆలోచన నడుస్తోంది. దీని ద్వారా కొద్దిమంది సాధకులతో స్వల్ప కాలంలోనే అధికమైన ప్రయోజనాన్ని పొందే అవకాశం ఉంది.

### యుగసంధి - మహాపురశ్చరణ

పరమ పూజ్యగురుదేవులు 1980లోని చివరి మాసాలలో 20 సంవత్సరాల సాధనను ఒక ఉద్యమంగా చేపట్టారు. తరువాత

ఎందుకు చెయ్యాలో చెప్పేది అవసరం.

దానికే ఒక ప్రత్యేకతను కల్పించి ఈ మహాసాధనకు "యుగసంధి మహాపురశ్చరణ" అని నామకరణం చేశారు. 1988 నవంబరులో 12 సంవత్సరాల ఉద్యమంగా ప్రారంభించారు. ఆ రోజుల్లో అదే గొప్ప అనుష్ఠానం. దానిలో కోట్ల సంఖ్యలో పరిజనులు భాగస్వాములు అయ్యారు. 12 సంవత్సరాల మహా ఉద్యమం సంస్థ యొక్క చరిత్రలో ఒక మైలురాయి అని చెప్పవచ్చు. అవకాశం చూచుకుని పరిజనులంతా శాంతికుంజ్‌కు వచ్చి తప్పనిసరిగా 9 రోజుల అనుష్ఠానంలో పాల్గోవాలి. అప్పుడే సామూహికజపయజ్ఞంలో పాల్గోవడానికి అర్హులు అవుతారు. ఈ సాధనలో సూర్యుని ఆరాధించే విధానం కూడా తెలియచేశారు. సూర్యధ్యానంతోపాటు ప్రాణప్రత్యావర్తన అనే భావాన్ని సమర్పించుకోవాలి. దీనివల్ల సూర్యదేవుని ఓజస్సు, తేజస్సు, వర్చసులను పొందగలుగుతారు.

## ఫలించిన కృషి

ఈ 12 సంవత్సరాల మహాపురశ్చరణల ఫలితంగా దేశమంతటా అఖండ జపం నిర్వహింపబడింది. మారుమూల గ్రామాలలో కూడ గాయత్రీ మహామంత్రం ప్రతిధ్వనించింది. దేశ విదేశాలలో అశ్వమేథయజ్ఞాలు జరిగాయి. మొట్టమొదటి మహాపూర్ణాహుతి 1994 నవంబర్‌లో గురుదేవుల జన్మస్థలమైన ఆవల్‌ఖేడాలో జరిగింది. రెండవ మహాపూర్ణాహుతి హరిద్వార్–గాయత్రి తీర్థనగరంలో 2000 సంవత్సరం నవంబర్‌లో వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాలకు లక్షల సంఖ్యలో పరిజనులు పాల్గొన్నారు. సంస్థ నూతన సంకల్పాలతో 21వ శతాబ్దిని ఆహ్వానించింది. దేశమంతటా సంస్కార మహోత్సవాలు, దీపయజ్ఞాలు, గాయత్రీ మహాయజ్ఞాలు వరుసగా జరిపించడంతో గాయత్రీ తీర్థ్ యొక్క ప్రతిష్ఠ పెరిగిపోయింది. యువతరాన్ని చైతన్యపరచేదృష్టితో దేవ సంస్కృతీ విశ్వవిద్యాలయం స్థాపించబడింది.

## ఇప్పుడు నడుస్తున్నది సామూహిక సాధన

2009లోనికి అడుగుపెట్టాం. దేశ దేశాలలో గాయత్రీ మహాశక్తి నర్తనం మొదలుపెట్టింది. యోగాభ్యాసాల ప్రయోగం, ఆధ్యాత్మిక చింతన పెచ్చుపెరిగిపోయింది. ఎటువైపు చూచినా యజ్ఞీయ వాతావరణం చిగురులు తొడుగుతోంది. చదువుతోపాటు విద్యావిస్తరణ ప్రారంభం అయింది. సమాజంలో ఐక్యతాభావం కనిపిస్తోంది. యుగనిర్మాణానికి సంకల్పం గట్టిపడుతోంది. యువత ద్వారా రచనాత్మక కార్యక్రమాలు ప్రారంభించ బడుతున్నాయి. అయితే అదే స్థాయిలో భోగవాదం కూడ పెరిగిపోతోంది. అయినప్పటికీ ఈ దేశానికి మూలాధారమైన ఆధ్యాత్మికత మాత్రం క్రొత్త ఊపిరి పోసుకుంటున్నది. పరిసరాల ప్రభావంతో వచ్చిన భోగవాదం "మహాపురశ్చరణ" సాధన వల్ల దూరంగా విసిరివేయబడుతుంది. ఇది గురుసత్తా నిర్ణయం. కనుక సామూహిక జపం మహాపురశ్చరణ పేరుతో తీవ్రతరం చెయ్యాలి. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా పాకిపోయింది.

## ఏంచెయ్యాలి? ఎలా చెయ్యాలి?

గాయత్రీ పరివార్ ప్రభావం అధికంగా ఉన్నచోట మహాపురశ్చరణకు సంకల్పం తీసుకోవాలి. ప్రతిరోజూ సాధ్యపడక పోవచ్చు. కనీసం వారంలో రెండు రోజులు శని–ఆదివారాలు అందరికీ అనుకూలం అయిన స్థానాన్ని నిర్ణయించుకోవాలి. ఆ స్థలం దేవాలయం కావచ్చు. సత్రం కావచ్చు. ఏదీ దొరకకపోతే పరిజనుల ఇండ్లల్లో అనుకూలమైన ఇల్లు ఎంపికచేసుకోవచ్చు. శనివారం అయితే సాయంకాలం పూట ఆదివారం అయితే ఉదయం పూట చేయడం మంచిది. అయిదు దీపాలను గాని, అయిదు అగరు బత్తీలనుగాని సూర్యునిలాగా అలంకరించాలి. దాని సమక్షంలో ఒక్క అరగంట మౌనంగా జపంగాని, ధ్యానంగాని చెయ్యాలి. 15 నిమిషాలు "యన్మండలం" పాడుతూ సూర్యదేవుని స్తుతించాలి. మొత్తం కార్యక్రమాన్ని ఒక్క గంటలో ముగించవచ్చు. అవకాశం ఉన్నవారు ఎక్కువసేపు చెయ్యవచ్చు. తరువాతి భాగం జ్ఞాన యజ్ఞం. గురుదేవుల సాహిత్యం చదవడం, చదివించడం చెయ్యాలి. ఒక్కొక్కరు కనీసం 5గురిచేత చదివించగలగాలి. క్రమంగా వారం వారం సంఖ్య పెరిగేలా చూచుకోవాలి. ఈ కార్యక్రమం అంతా ఆధ్యాత్మిక కేంద్రాలలో జరిగితే సంఖ్య త్వరగా పెరిగిపోతుంది. ఆదర్శ వాక్యాలను వ్రాసిన స్టిక్కర్లను అక్కడక్కడ అంటించాలి. బేనర్లు వ్రేలాడదీయాలి.

## ప్రతి ఒక్క పరిజనుడు భాగస్వామి కావాలి

ఈనాటి భయంకర దృశ్యాలకు వెనుక ఉన్న మూలకారణాన్ని ఛేదించాలంటే గాయత్రీ మంత్రం శబ్దభేది బాణంలా పనిచేయాలి. అలా జరగాలంటే అన్ని చోట్లా సామూహిక జపాలు జరగాలి. ఏ మూల చూచినా గాయత్రీ మంత్రం హోరెత్తిపోవాలి. సామూహికంగా వచ్చే ప్రమాదాలను సామూహికంగానే ఎదుర్కోవాలి. అందువల్ల ప్రతి ఒక్క పరిజనుడు భాగస్వామి కావాలి.

★★★

**పిరికివాడు ప్రతిక్షణం చస్తూనే ఉంటాడు - ధైర్యవంతుడు ఒక్కసారే మరణిస్తాడు.**

# ఏ పుస్తకంలో ఏముంది?

## నేటి సమస్యలు - రేపటి సమాధానాలు

రచన : **పండిత శ్రీరామశర్మ ఆచార్య**

అనువాదం : **డి.వి.ఆర్. మూర్తి**

ఇది క్రాంతిధర్మి సాహిత్యంలోని 11వ పుస్తకం. మానవుడు దారితప్పిన దేవత. అతనిలో ఉన్న దైవీ శక్తులను మరచాడు. అందువల్లనే అసంఖ్యాకమైన ఆపదలు, కష్టాలు అనుభవించవలసి వచ్చింది. మనిషి తన భాగ్యానికి తానే నిర్మాత. ఉజ్జ్వల భవిష్యత్తుకు కావలసింది ఒక్కటే "దృష్టి కోణ పరివర్తన". సాదా జీవనము, ఉన్నత ఆదర్శం సిద్ధాంతాన్ని ఆచరిస్తే అన్ని సమస్యలు మటు మాయమవుతాయి. మనుష్యులు స్నేహంతో సహకరించుకోవడానికి పుట్టారు తప్ప కొట్టుకుని చావడానికి కాదు. యుద్ధాల కొరకు వెచ్చిస్తున్న సంపదను, ప్రతిభను నవనిర్మాణ ప్రయోజనాలకు వెచ్చింగలిగితే 21వ శతాబ్దపు ఉజ్జ్వల భవిష్యత్తు కలలు అన్ని 10 సంవత్సరాలలో పూర్తి అవుతాయి.

పరిపాలన, పరస్పర సహకారం ఆధారంగా వికేంద్రింపబడాలి. పరిపాలన సేవా భావంతో నిర్వహించాలి. అప్పుడు భౌతికంగా, ఆత్మికంగా సమగ్ర ప్రగతి సాధ్యమవుతుంది. ఆలోచనలలో పరివర్తన, కరుణతో కూడిన భావసంవేదనలు రావాలి. స్వార్థం తగ్గించుకోవాలి.

విద్యను అమృతవర్షిణి అన్నారు. చదువును అన్నపూర్ణ అన్నారు. విద్య సంజీవని. దానిని మరచిపోవటం నిజంగా దౌర్భాగ్యమే. ఈనాడు విద్యను జాగృతం చేయాలి. అంధకార హాహాకారాలు తొలగిపోయి నూతన వెలుగులు చిమ్మాలి. మనము కూడా వీటిని మన జీవితాలలోనికి తెచ్చుకుని సత్యయుగ నిర్మాణానికి కృషి చెయ్యాలని ఈ పుస్తకం సందేశమిస్తుంది.

## మనః స్థితి మారితే పరిస్థితులు మారతాయి

రచన : **పండిత శ్రీరామశర్మ ఆచార్య**

అనువాదం : **తుంగతుర్తి శ్రీనివాస్**

ఇది క్రాంతిధర్మి సాహిత్యంలోని 12వ పుస్తకం. కాలం ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు. కాలంతోపాటు నమ్మకాలలో, ఆచరణలో మార్పు వస్తుంది. ఈనాడు సత్యయుగ నిర్మాణం కొరకు, ఉజ్వల భవిష్యత్తు కొరకు పద్ధతులు మార్చుకోవాలి.

మనదేశంలో బద్ధకం, అనవసర ఖర్చులు చేయడం గొప్పదనానికి చిహ్నాలుగా భావిస్తున్నారు. కష్టపడటం దౌర్భాగ్యంగా భావిస్తున్నారు. సగటు భారతీయుడు రోజుకు కొన్ని గంటలు మాత్రమే పనిచేస్తాడు. మిగిలిన సమయం కబుర్లు చెప్పుకోవటం. టి.వి. చూడడం వగైరాలతో సరిపోతుంది. ఈ సమయమును సదుపయోగం చేస్తే ఉల్లాసభరిత పరిస్థితులను తయారుచేసుకోవచ్చు.

సంపద గడించేవారు చాలా మంది ఉన్నారు. కాని వాటిని సదుపయోగం చేసేవారే తక్కువ. ప్రపంచంలో ఎంత ధనసంపద ఉన్నదంటే దానిని కలసి పంచుకుంటే అందరూ సుఖశాంతులతో జీవించవచ్చు, సర్వతోముఖ ప్రగతి సాధించుకోవచ్చు.

ఇంటిలో సమర్థులు సంపాయిస్తారు. దానితో ఇంటిల్లిపాది జీవిస్తారు. ఇది సమర్థుల బాధ్యత, ఆనవాయితి. క్రింద పడిన వారిని చేయూతనిచ్చి పైకి లేపాలి. కరుణ, దయ, ప్రేమతోపాటు కష్టించి పనిచేసే మనస్సు, వనరులను సద్వినియోగపరచే మనఃస్థితి తెచ్చుకోమని ఈ పుస్తకం సందేశమిస్తుంది.

★★★

జడప్రాయంగా ఉన్న అమిత జ్ఞానం కన్నా - చైతన్యవంతమైన పరిమిత జ్ఞానం మిన్న.

వార్తలు

# రాష్ట్రమంతటా గాయత్రీ మహా యజ్ఞాల ఉత్సవాలు

## హైదరాబాద్‌లో - గురుపౌర్ణమి

గాయత్రీ చేతనా కేంద్రం హైదరాబాదులో 07.07.09 నాడు గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు ఉత్సవం జరుపబడింది. 5 గంటల నుండి 8 గంటలవరకు ధ్యానం, 8 గంటల నుండి 11 గంటల వరకు పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 11 గంటల 30 నిమిషాలనుండి 12 గంటల 30 నిమిషాల వరకు గురుదేవులకు పాదపూజ నిర్వహించబడింది. వరిష్ఠ కార్యకర్త శ్రీమతి అనసూయమ్మ గురుపాదుకాస్తవం చదువుతూ పాదపూజను జరిపించారు. 1 గంటకు భోజన ప్రసాదం అందించబడింది. మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంకాలం 5 గంటల వరకు గాయత్రీ చాలీసా పారాయణ జరిగింది. తరువాత సాయంకాలం హారతి, తదనంతరం దీపయజ్ఞం నిర్వహించబడ్డాయి. అన్ని కార్యక్రమాలకు దాదాపు 70 మంది పరిజనులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో

24.07.09 నుండి 26.07.09 వరకు మంగళగిరి విశ్వగాయత్రీ పరివార్ కార్యాలయ ప్రాంగణంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం (సత్రయాగం) అతివైభవంగా నిర్వహించబడింది. 24.07.09 సాయంత్రం 108 కలశములతో మంగళ వాయిద్యములతో, జయ ఘోషలతో కలశయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. సుమారు 200 మంది కలశ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ కొలిశెట్టి శివశంకరరావు మానవ జీవనపు తీరు తెన్నులపై ప్రసంగించారు. తదనంతరం హారతి, ప్రసాద వితరణ జరిగింది.

25.07.09 ఉదయం శ్రీ గారపాటి చెన్నకేశవరావు పూజ్య గురుదేవుల, వందనీయ మాతాజీల గురించి వివరించారు. తదుపరి శ్రీ కృష్ణార్జున బోధి, ఛైర్మన్ బుద్ధ విహార్ ట్రస్ట్ బుద్ధ భగవానుడు ఉపదేశించిన మార్గం ద్వారా సాధన, శీలసంపద ఆవశ్యకత వివరించారు. అనంతరం 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. సుమారు 150 మంది యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

26.07.09 ఉదయం శ్రీ గారపాటి చెన్నకేశవరావు అంతర్యాగం నిర్వహించారు. తదుపరి శ్రీ కాకుమాను రామలింగేశ్వరశాస్త్రి, ఆర్షధర్మ ప్రచారక్ గాయత్రీ మంత్ర విశిష్టత గురించి ప్రవచనమిచ్చారు. తదనంతరం యజ్ఞం, పూర్ణాహుతి, హారతి, ప్రసాద వితరణ జరిగింది. పూజ్య గురుదేవుల సాహిత్యమును పుస్తక విక్రయశాలలో ఏర్పరచారు. ఈ కార్యక్రమమునకు శ్రీ భోజనపల్లి ప్రసాద్, శ్రీ బిఎల్ఎన్ మూర్తి, బి.శారద గారు, శ్రీ వెంకటేశ్వరరావు, శ్రీ కె.నరసింహరావు, శ్రీ తాతారావు సహకరించారు.

## వలివేరు గ్రామంలో

05.08.09 వలివేరు గ్రామం, చుండూరు మండలం, గుంటూరు జిల్లాలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. డా॥ శ్రీరాం, శ్రీమతి అనసూయమ్మగారు నిర్వహించారు. సుమారు 200 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో సామూహిక గాయత్రీ మంత్ర దీక్ష జరిగింది. ఊరి పెద్దలు వెంకట సుబ్బమ్మగారు, వారి కుమారుడు, గ్రామంలోని కార్యకర్తలు సహకరించారు. అక్కడనే లలితాంబిక పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో వారం వారం సత్సంగాలు జరుగుతున్నాయి.

## గుంటూరులో

31.07.09 గుంటూరు గౌతమీనగర్‌నందు 24 కుండముల గాయత్రి మహాయజ్ఞం డా॥ శ్రీరాం నిర్వహించారు. సుమారు 250 మంది పరిజనులు పాల్గొన్న యజ్ఞమునకు శ్రీమతి శ్యామల, శ్రీ సూర్యనారాయణగారు, శ్రీ బి.హరిప్రసాద్ దంపతులు, గీతాశాయిగారు, విజయలక్ష్మిగారు, ఝాన్సిగారు సహకరించారు. 30.07.2009 సాయంత్రం శ్రీమతి రాఘవమ్మ గారి కోలాట బృందముతో కలశయాత్ర ఆనందంగా జరిగింది. తరువాత పిరమిడ్ ధ్యాన కేంద్ర సభ్యురాలు పద్మావతిగారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 500 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది.

## ఎర్రగడ్డలో

హైదరాబాదులోని ఎర్రగడ్డలో శాంతినికేతన్ కాలేజి గ్రౌండులో 01.08.09 నాడు 12 కుండీల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. ప్రతీ సంవత్సరం వలెనే కాలేజి ప్రిన్సిపల్

ఎవరు ఏది చెప్పినా విను - విని ఆలోచించు - ఆలోచించి ఆచరించు.

# రాష్ట్రమంతటా గాయత్రీ మహా యజ్ఞాల ఉత్సవాలు

శ్రీమతి అంబారామస్వామి ఈ యజ్ఞాన్ని నిర్వహింపచేయడం జరిగింది. 250 మంది విద్యార్థినులు భక్తి శ్రద్ధలతో యజ్ఞంలో పాల్గొన్నారు. యజ్ఞ ప్రసాదంగా ఉపాసన పుస్తకాలు, 'యుగశక్తి గాయత్రి' పత్రికలు పంచడం జరిగింది. వరిష్ఠ కార్యకర్త శ్రీమతి అనసూయమ్మ యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీ లక్ష్మీనారాయణ, శ్రీ సత్యన్నారాయణ, శ్రీ జగన్నాథం సహకరించారు.

## వడ్డమాను గ్రామంలో

01.08.09 అమరావతి మండలం వడ్డమాను గ్రామంలో నవకుండి గాయత్రీ మహా యజ్ఞం డా॥ శ్రీరామ్‌చే నిర్వహించబడింది. గ్రామ పెద్దలు, 150 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఒంగోలులో

ఒంగోలులోని రుషి వాటికలో మార్చి 2009 నుండి, ఆగస్టు 2009 వరకు నిర్వహించిన కార్యక్రమాలు ఒకేసారి పంపడం జరిగింది. 01.03.09 నుండి 8,15,22,27,29 తేదీలలో గాయత్రీ మహాయజ్ఞంతోపాటు వివిధ సంస్కారాలు నిర్వహించబడ్డాయి.

05.04.09 నుండి 12,18,19,22,23,24,25,26 తేదీలలో యజ్ఞంతోపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

02.06.09 నుండి 7,8,9,12,14,20,21,22,23,24,28 తేదీలలో యజ్ఞంతోపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

03.07.09 నుండి 7,12,19,20,21,22,23,24,26 తేదీలలో యజ్ఞంతోపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

02.08.09 నాడు యజ్ఞంతోపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహింపబడ్డాయి.

మొత్తం యజ్ఞ సంఖ్య 361. శ్రీమతి మలసాని శ్యామలాదేవి, శ్రీ వెంకటేశ్వర్లు తదితర కార్యకర్తల కృషి ప్రశంసనీయం. ఇకముందు ఈవిధంగా కాకుండా ఏ నెలకానెల పత్రికలో ప్రచురణకు అనుగుణంగా వ్రాసి పంపినచో సౌకర్యంగా ఉంటుంది.

## చందంపేట్‌లో

20.05.09 మెదక్ జిల్లా చందంపేటలోని అపితికరి ఫార్మసి ఆవరణలో పంచకుండి గాయత్రీ మహాయజ్ఞం శ్రీ జి.వెంకట నారాయణ, శ్రీ ఫూల్‌సింగ్ నిర్వహించారు. ఫాక్టరి మేనేజర్, సుమారు 100 మంది కార్మికులు ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వరంగల్‌లో

02.06.09 గాయత్రీ జయంతి సందర్భమున వరంగల్‌లోని విక్టరి ఎవెన్యూ అపార్టుమెంట్స్ ప్రాంగణంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ వనమా సురేష్ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ ఎ.ఆర్.కె.మూర్తి, శ్రీ జి.వెంకటేశ్వర్లు గారు నిర్వహించారు.

## వేములవాడలో

12.07.09 వేములవాడలోని హనుమాన్ దేవాలయంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ పులి సత్యన్నారాయణ నిర్వహించారు. వరుణదేవుడి కరుణ కొరకు వరుణ గాయత్రి ఆహుతులను ప్రత్యేకంగా ఇవ్వడం జరిగింది. ఆ రోజు సాయంత్రం నుండి 2 రోజులు వర్షం కురిసింది. ఈ యజ్ఞ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ నరాల సత్తెమ్మ–పోశెట్టిలు పాల్గొన్నారు. అరుణ, లక్ష్మి, రేణుక, రాజారాం, నాగరాజు మధుకర్, నరేందర్ గార్లు యజ్ఞ కార్యక్రమమునకు సహకరించారు.

## ఇల్లెందులో - గురు పూర్ణిమ

23.06.09 శ్రీ సతీష్ ఖండేల్వాల్, ఖమ్మం జిల్లా కో–ఆర్డినేటర్ రూపొందించిన "సర్వే జీవాః సుఖినోభవంతు" శాఖాహారం శ్రేష్ఠతనం తెలిపే వీడియో సీడీని శ్రీ పి.వీరయ్య తహసిల్దార్, ఖమ్మం ఆవిష్కరించారు. కావలసిన వారు గాయత్రి పరివార్, ఇల్లెందుకు వ్రాసి ఉచితంగా పొందగలరు. (సెల్: 9441023101)

07.07.09 గురుపూర్ణిమ సందర్భమున సకాలంలో వర్షాలు కురవాలని లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ త్రికుండి గాయత్రి యజ్ఞమును గాయత్రి పరివార్ కార్యాలయంలో నిర్వహించారు. పరిజనులు దుర్గుణాలను వదలి మంచి గుణాలను అలవర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం శ్రీ సతీష్ ఖండేల్వాల్ జిల్లా కన్వీనర్ ఆధ్వర్యంలో జరిగింది.

**ఎవరి మీద ఏది చెప్పినా స్వీకరించు - కానీ నీ అభిప్రాయం మాత్రం నీలోనే ఉంచుకో.**

# రాష్ట్రమంతటా గాయత్రీ మహా యజ్ఞాల ఉత్సవాలు

## సైదాబాదులో

01.05.09 హైదరాబాదు సైదాబాద్ పూర్ణోదయ కాలనిలో త్రికుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ బి.హనమంతరెడ్డి దంపతులచే, శ్రీమతి అనసూయమ్మగారిచే నిర్వహించబడినది. సుమారు 400 మంది పరిజనులు పాల్గొన్నారు. యజ్ఞకార్యక్రమమునకు శ్రీ పి.ప్రతాప్‌రెడ్డి దంపతులు సహకరించారు.

## కూకట్‌పల్లిలో

25.05.09 హైదరాబాదు కూకట్‌పల్లిలోని పి.ఎన్.హైస్కూలు ప్రాంగణంలో 24 కుండముల గాయత్రి మహాయజ్ఞం శ్రీ జి.వెంకట నారాయణ, శ్రీ హీర్‌సింగ్ రాజ పురోహిత్, శ్రీ ఫూల్ సింగ్ నిర్వహించారు. ఈ యజ్ఞ కార్యక్రమంలో 150 మంది విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మారుపాకలో గురుపూర్ణిమ

07.07.09 వేములవాడ మండలం మారుపాకలో గ్రామంలోని గాయత్రీ జ్ఞాన మందిరంలో గురుపూర్ణిమ సందర్భమున త్రికుండి గాయత్రీ మహాయజ్ఞం శ్రీ పులి సత్యన్నారాయణ నిర్వహించారు. సుమారు 70మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమమునకు మధుకర్, లక్ష్మి, బూరుగ అరుణ, ఎడ్లరేణుక, వెంకటేశం, సత్యహరి, తిరుపతి, మనోహర్, రాము సహకరించారు. సామూహిక గాయత్రీ మంత్ర దీక్ష ఇవ్వడం జరిగింది.

## లక్ష్మీపురంలో

లక్ష్మీపురం గ్రామం నర్సరావుపేట మండలం వేదమాత గాయత్రీ అనుగ్రహపీఠంలో 20 మంది పరిజనులు ప్రతి రోజూ 15 మాలల జపం జూన్ 2009 5వ తేదీ నుంచి చేస్తున్నారు. ఇప్పటికి 18000 గాయత్రి జపం పూర్తి అయింది. పూజ్య గురుదేవుల జన్మదిన సమారోహ వరకు చేయటానికి సంకల్పం చేశారు. ఈ కార్యక్రమమును నిర్వహిస్తున్న కొడాలి అనితగారిని అభినందిస్తున్నాము.

## పిడుగురాళ్ళలో - గురు పౌర్ణమి

07.07.09 గురు పౌర్ణమి సందర్భమున స్థానిక బొగ్గవరపు సీతారామయ్య మానసిక వికలాంగుల స్కూలులో గాయత్రీ జ్ఞానమందిరం నిర్వాహకురాలు గాయత్రి యజ్ఞం నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు యజ్ఞకార్యక్రమములో పాల్గొన్నారు. గాయత్రి జ్ఞాన మందిరం అధ్యక్షులు శ్రీ జూలకంటి సుబ్రహ్మణ్యం ఇతర సభ్యులు ప్రసాదములు, పెన్నులు పంచిపెట్టారు. ఆ స్కూలు విద్యార్థులపై గురు కృప వర్షించాలని ప్రార్థిస్తున్నాం.

## జగిత్యాలలో

05.08.09 జగిత్యాల స్థానిక మార్కండేయ దేవాలయంలో రక్షాబంధన్ కార్యక్రమము నూతన యజ్ఞోపవీతధారణ, పంచకుండి గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని గాయత్రి ప్రజ్ఞామండలి సంయోజకులు ఆడెపు గంగారాం నిర్వహించగా శ్రీ లక్ష్మీనారాయణ, శ్రీ బుచ్చిరెడ్డి, శ్రీఅశోక్‌కుమార్, శ్రీ గుప్త, శ్రీ లక్ష్మణ్ సహకరించారు. పద్మశాలి సేవా సంఘ అధ్యక్షుడు శ్రీ దాసరి మహేందర్, కార్యదర్శి శ్రీహరిగారు, మాజీ అధ్యక్షురాలు శ్రీమతి విమలాదేవి పాల్గొన్నారు. సుమారు 100 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గోరిజవోలు గుంటపాలెం (పెదనందిపాడు మండలం)లో

28.06.09, 29.06.09 తేదీలలో గోరిజవోలు గుంటపాలెంలో గాయత్రి మహాయజ్ఞం, సత్రయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమములో పిరమిడ్ ధ్యానకేంద్రం. గుంటూరు నుంచి శ్రీ లక్ష్మణరావు, అవధూత ఆశ్రమం, అచ్చినేని గుంటపాలెం నుంచి శ్రీమతి నాగమ్మగారు పాల్గొన్నారు. శ్రీ లక్ష్మణరావు పిరమిడ్ ధ్యానం వలన కలిగే లాభాలు, శ్రీమతి నాగమ్మగారు విష్ణు సహస్రనామ పారాయణ ప్రాశస్త్యం వివరించారు. మొదటిరోజు శోభాయాత్ర, రెండవరోజు ఉదయం గాయత్రి యజ్ఞమునకు చుట్టుప్రక్కల పది గ్రామముల నుండి సుమారు 600 మంది పరిజనులు పాల్గొన్నారు. యజ్ఞఫలంగా గాయత్రి పరివార్ కార్యక్రమాలకు సేవలందించుటకై 10 మంది సంసిద్ధత తెలియచేశారు. ఈ కార్యక్రమములు డా॥ శ్రీరామ్, గుంటూరు జిల్లా సహ కన్వీనర్, శ్రీమతి శివకుమారి, గాయత్రి పరివార్ నర్సరావుపేట ఆధ్వర్యంలో జరిగినవి.

★★★

బుద్ధిమంతుడికి మనస్సు, ఇంద్రియాలు స్వాధీనంలో ఉంటాయి.